


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

29-4-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 88 పేజీలు: 12 వెల: 6.50


బెంగాల్‌లో నేడు మలి విడత పోలింగ్ 2లో

3 షరతులు అంగీకరిస్తేనే యుద్ధ విరమణ: ఇరాన్ 9లో

# విశాఖ ఇక ఎఐ పట్నం




మంగళవారం గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్, సిఎం చంద్రబాబు నాయుడు తదితరులు

## ఇక అన్ని దారులు ఉత్తరాంధ్ర వైపే

### గూగుల్ క్లౌడ్ ఎఐ హబ్‌గా విశాఖ, ప్రాజెక్టుల ఏర్పాటులో ఎపి నం-1

### కొత్త టెక్ శకానికి శ్రీకారం, ఎఐ హబ్‌కు శంకుస్థాపన చేసిన కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్, సిఎం చంద్రబాబు

**విశాఖపట్నం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** సెర్చ్ ఇంజిన్‌గా మొదలైన గూగుల్ విశాఖలో ఏర్పాటు చేయబోతున్న సెంటర్ ద్వారా దేశానికే గ్రోత్ ఇంజిన్ కాబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. టెక్నాలజీ రంగంలో ఏపీలో కొత్త శకానికి శ్రీకారం చుడుతున్న ఏప్రిల్ 28వ తేదీ గుర్తుండిపోతుందని చెప్పారు. గూగుల్ క్లౌడ్ ఏఐ హబ్ ఏర్పాటుకు మంగళవారం విశాఖపట్నంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్, గూగుల్ గ్లోబల్ ఇన్ ఫ్రా, క్లౌడ్ వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఐటీశాఖ మంత్రి >>2

## త్వరలో అమరావతి-హైదరాబాద్ బుల్లెట్ రైలు

### 70 నిమిషాల్లోనే అమరావతి-విశాఖ ప్రయాణం

### ఎపిని కనెక్ట్ చేస్తూ 1.06లక్షల కోట్ల రైల్వే ప్రాజెక్టులు

### డేటా సెంటర్ ప్రారంభానికి రానున్న ప్రధాని: కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్




మంగళవారం విశాఖలో గూగుల్ క్లౌడ్ ఇండియా ఎఐ హబ్ శంకుస్థాపనలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

**విశాఖపట్నం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్ శంకుస్థాపన కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు నిర్మించిన సైబర్ టవర్ ఓ ఐటీ ఐకానిక్ గా మారింది అని చెప్పారు. గూగుల్ ఏఐ డేటా సెంటర్ తో విశాఖపట్నం ఇక ఏఐ పట్నంగా మారుతుంది అని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని మోదీ విజన్ లకు సెల్యూట్ చేస్తున్నాను అని విద్య, వైద్యం, ఏరోస్పేస్, లాజిస్టిక్స్, వ్యవసాయం ఇలా వేర్వేరు రంగాల్లో ఏఐ విప్లవం వస్తోంది తెలిపారు. గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్ ద్వారా విశేషమైన సేవలు అందుతాయి అని ఎంఒయూ చేసుకున్న అతి తక్కువ సమయంలో గూగుల్ ఏఐ డేటా హబ్ శంకుస్థాపన జరుగుతోంది అని తెలిపారు. త్వరలోనే ఈ ఏఐ డేటా సెంటర్‌ను ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభించుకునే రోజు దగ్గర్లోనే ఉందని ఐటీ సేవల రంగంలో భారత్ లీడర్ గా ఎదిగింది. మన దేశంలోని నాయకత్వం కీలకంగా వ్యవహరించింది అని తెలిపారు. ఆ సమయంలో ఉత్పత్తి రంగంపై భారత్ ముందుకు వెళ్లలేకపోయింది అని సెమీ కండక్టర్లు, చిప్ లు, ల్యాప్ టాప్, మొబైల్ ఉత్పత్తుల లాంటి ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిలో వెనుకబడ్డాం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ చొరవతో మొబైల్ మాన్యు ఫాక్చరింగ్ లో ఇప్పుడు ముందడుగు వేశాం అన్నారు. భారత్ నుంచి ఇప్పుడు అత్యధికంగా ఎగుమతి అవుతున్న ఉత్పత్తిగా ఇప్పుడు మొబైల్ ఫోన్ మారింది అని చెప్పారు. దేశీయంగా అవసరమైన 50 శాతం ఎలక్ట్రానిక్ పరికరాలను భారత్ లోనే ఉత్పత్తి చేసుకుంటున్నాం అనేది గర్వకారణం అన్నారు. మేజర్ ఎలక్ట్రానిక్స్ డెవలప్మెంట్, డిజైన్ చేసే దేశంగా భారత్ ను గుర్తించాలి సెమీ కండక్టర్ మిషన్‌లో భాగంగా ఇప్పటికే వాణిజ్య పరమైన ఉత్పత్తిని కూడా భారత్‌లో ప్రారంభించాం అన్నారు. సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ పరికరాల ఉత్పత్తిలో విశ్వసనీయమైన భాగస్వామిగా భారత్ మారిందని డేటా సెంటర్లకు అవసరమైన సర్వర్లను కూడా దేశంలోనే ఉత్పత్తి చేసుకోవాలని టెక్ కంపెనీలకు పిలుపునిచ్చారు. గూగుల్ కూడా తమ సర్వర్లను, జీపీయూ, చిప్ లను ఇక్కడే ఉత్పత్తి చేసుకునేలా చూడాలని కోరారు. భారత్ ఇస్తున్న ఈ ఆహ్వానాన్ని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ కు కూడా తెలియచేయాలని విజ్ఞప్తి చేశారు. తక్కువ వ్యయంతోనే నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసేందుకు వీలుందన్నారు. విశాఖ నుంచి 3 సబ్ సీ కేబుల్స్ ను వేస్తున్నందుకు గూగుల్ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆస్ట్రేలియా, మిడిల్ ఈస్ట్ మీదుగా యూరోప్ కు, అఫ్రికా మీదుగా అమెరికాకు వెళ్లేలా ఈ సముద్ర గర్భ కేబుల్స్ వేస్తున్నారు అని తెలిపారు. డబుల్ ఇంజన్ బులెట్ >>2




## 44° దాటిన ఒంటిమిట్ట, కంభం

### 16 జిల్లాల్లో సగటున 42° ఉష్ణోగ్రత

**విజయవాడ,ఏప్రిల్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో విభిన్న వాతావరణం నెలకొని ఉంది. ఎండలు మండుతుంటే, మరో పక్క బంగాళా ద్రోణి ప్రభావంతో పలుజిల్లాల్లో ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షాలు పడుతున్నాయి, మంగళవారం >>2



## నాకిష్టం..ఫుట్‌బాలాట!

### గ్యాంగ్‌టక్‌లో యువతతో కలిసి సరదాగా ప్రధాని ఆటలు

### ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యమే తమ ఆశయమని వెల్లడి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రెండు రోజుల పర్యటనలో మంగళవారం గ్యాంగ్‌టక్‌లో యువ క్రీడాకారులతో సరదాగా ఫుట్‌బాల్ ఆడాడు. అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ప్రధాని మోడీ సోషల్ మీడియాలో షేర్ చేశారు. మువ్వన్నెల జెండాతో అలంకరించిన నీలిరంగు స్పోర్ట్స్ జాకెట్ ధరించిన మోడీ, ఒకే రంగు దుస్తులు ధరించి, ఒక్కొక్కరు ఒక ఫుట్‌బాల్ >>2

## గుడి నిర్మాణం వివాదం

### అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజుకు హైకోర్టులో చుక్కెదురు

**విజయవాడ,ఏప్రిల్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుకు ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం పరిధిలో ఉన్న ఆకివీడు సమీపంలో రామాలయం పునర్ నిర్మాణం విషయంలో ఆయన ప్రదర్శిస్తున్న పట్టుదలకు చెక్ పెట్టింది. రామాలయం పునర్ నిర్మాణం కోసం గొంతెనమ్మ గుడిని అర్ధరాత్రి కూల్చేసిన వ్యవహారంలో స్థానికులు దాఖలు చేసిన పిటిషన్ పై అత్యవసర విచారణకు హైకోర్టు అంగీకరించింది. ప్రభుత్వస్థలాలలో ఎటువంటి మతపరమైన నిర్మాణాలు చేపట్టకూడదు అని సుప్రీంకోర్టు నిబంధనలు ఉన్న అనధికారికంగా రాజకీయ ప్రయోజనాలతో నూతనంగా గుడి నిర్మించడానికి ప్రయత్నిస్తున్నారన్న ఆకివీడు పెద్దపేటకు చెందిన జయంతి ఉన్నమట్ట దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. ఆకివీడు పెద్దపేట >>2



## లారీని ఢీకొన్న కారు నలుగురు మృతి

### పూసపాటిరేగ వద్ద దుర్ఘటన

**విజయనగరం/పూసపాటిరేగ. ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** విజయనగరం జిల్లా పూసపాటిరేగ డెంకాడ మండలం వద్ద జాతీయ రహదారి 16 సోమవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు దుర్మరణం చెందగా ఒకరు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నంకి వెళ్తున్న గుత్తేదారు మిత్ర బృందం ప్రయాణిస్తున్న కారు ఏపీ 39ఎంయు 3322 మితిమీరిన వేగం వల్లే ఈ ఘోర ప్రమాదం సంభవించిందని స్థానికులు చెబుతున్నారు. రాత్రి 12 గంటల సమీపంలో అతివేగంగా వచ్చిన కారు ప్యారాపురం వద్ద టీదుకాణంలో టీ తాగి >>2

## సరికొత్త చరిత్రకు గూగుల్ పునాది

### ఎపి భవిష్యత్తుకు ఇది శుభారంభం

### గూగుల్ కోసం భూములిచ్చిన రైతులందరికి కృతజ్ఞతలు: మంత్రి లోకేష్




**విశాఖపట్నం ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** విశాఖ అంటే మనకి స్టీల్ ప్లాంట్ గుర్తొస్తుంది, బీచ్ గుర్తొస్తుంది, కానీ ఇక నుండి విశాఖపట్నం అంటే ఏఐ డేటా హబ్, గ్లోబల్ ఐటీ హబ్ గా పిలవబడుతుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖ సమీపాన తర్లువాడ వద్ద ప్రతిష్టాత్మక గూగుల్ డేటా సెంటర్ భూమిపూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ గూగుల్ ఏఐ హబ్ తో విశాఖ ముఖచిత్రం మారబోతుందన్నారు. ఇది ఒక భూమిపూజ కాదని భవిష్యత్తుకి పునాది అని చెప్పారు. ఇది ప్రాజెక్ట్ కాదు ఒక జనరేషన్‌ని మార్చే మూవ్‌మెంట్. ఆంధ్రప్రదేశ్ రైజింగ్ ఇండియా లీడింగ్ అంటూ భావోద్వేగ ప్రసంగం చేశారు. కేంద్ర మంత్రి ఆశ్వినీ వైష్ణవ్ భారతదేశ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విప్లవాన్ని అసాధారణ వేగం, స్పష్టతతో నడిపిన డైనమిక్ లీడర్ అని కొనియాడారు. ఈ ప్రాజెక్టును అత్యంత వేగంగా పట్టాలెక్కించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, గూగుల్, అదానీ గ్రూప్, భారతి ఎయిర్‌టెల్ సంస్థ లీడర్లు, భారత ప్రభుత్వ అధికారులు, ప్రతిష్ఠాత్మక ఇండస్ట్రీ పార్టనర్లు, విశాఖ యువత, ఉత్తరాంధ్ర ప్రజలకు, గూగుల్ కోసం భూములు ఇచ్చిన రైతులకు మంత్రి అభినందనలు తెలిపారు. సరికొత్త చరిత్రకు పునాదిసరికొత్త చరిత్రకు పునాది అని ఇప్పటి వరకు ఒక లెక్క... ఇక నుండి ఒక లెక్క అని చమత్కరించారు. ఇప్పటి వరకు విశాఖ స్టీల్ సిటీ ఇక నుండి విశాఖ ఏఐ డేటా హబ్ అని అన్నారు. ఇప్పటి వరకు గూగుల్‌లో విశాఖపట్నం గురించి సెర్చ్ చేసేవారిని ఇక నుండి గ్లోబల్ ఐటీ మ్యాప్‌లో విశాఖపట్నం ఉంటుంది అని తెలిపారు. వైజాగ్ లో ఖిజిఖి అంటే గూగుల్ అని గట్టిగా చెప్పాలి, వైజాగ్‌లో సౌండ్ చేస్తే దేశం మొత్తం వినిపించాలి అన్నారు. గూగుల్ రాకుండా అడ్డుకోవడానికి కేసులు వేసిన బ్యాచ్ తెలుసుకోవాలన్నారు. ఐదేళ్లపాటు రాష్ట్రంలో విధ్వంస పాలరాష్ట్రంలో 5ఏళ్లపాటు విధ్వంస పాలన జరిగింది అని. >>2

## డీజిల్ కొరతపై నిఘా

### నిరంతరం పర్యవేక్షిస్తున్నా..

### ఇంధన కొరతపై సమీక్షలో సిఎం చంద్రబాబు



**విజయవాడ,ఏప్రిల్ 28,ప్రభాతవార్తప్రతినిధి:** డీజిల్ కొరత సాధారణ స్థితికి చేరేంత వరకు నిరంతరం పర్యవేక్షణ చేస్తూనే ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. క్యూలైన్లు లేకుండా చూడాలన్న ఆయన, అవసరమైతే టోకెన్, స్లాట్ సిస్టంలను అవలంభించాలని సూచిం చారు. పెట్రోల్, డీజిల్ కొరతపై సీఎం చంద్రబాబు వరుస టెలికాన్ఫరెన్స్‌లో భాగంగా మంగళవారం సమీక్ష నిర్వహించారు. టెలికాన్ఫరెన్సులో వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. పెట్రోలియం కంపెనీల నుంచి బంకులకు లోడ్ డిస్పాచెస్ ఎలా జరుగుతున్నాయని ఆరాతీశారు. రాత్రంతా లోడ్ డిస్పాచెస్ జరిగాయని నిరంతరం బంకులకు పెట్రోల్, డీజిల్ సరఫరా జరిగేలా చూస్తున్నామని అధికారులు వివరించారు. ఇవాళ ఉదయం ఆరు గంటల సమయానికి 1402 లోడ్లు డిస్పాచ్ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. గత అర్ధరాత్రి నుంచి ఇవాళ ఉదయం ఆరు గంటల వరకు 2173 కిలో లీటర్ల పెట్రోల్, 2846 కిలో లీటర్ల డీజిల్ అమ్మకాలు జరిగాయన్నారు. తెలిపిన అధికారులు స్టాక్ లేని బంకుల సంఖ్య ఎంత మేర ఉందని అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి, నిన్నటితో పోల్చుకుంటే గణనీయంగా తగ్గాయని అధికారులు చెప్పారు. ప్రస్తుతం జిల్లాల నుంచి వస్తోన్న సమాచారం మేరకు ఉదయం 6 గంటల నాటికి 432 బంకులు మినహా అన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ లభ్యత ఉందనిఅధికారులు వివరించారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సమస్య సాధారణ స్థితికి చేరుకునేంత వరకు ఎవ్వరూ విశ్రమించవద్దని... ఆర్టీజీఎస్ నుంచి నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉండాలని స్పష్టం చేశారు. ఆయిల్ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతూ... క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని ఆదేశించారు. నిన్న 2679 లోడ్లను రాష్ట్రంలోని వివిధ పెట్రోల్ బంకులకు పంపాలని ప్రణాళికలు సిద్ధం చేస్తే... వాటిల్లో 2079లోడ్లు ఇప్పటికే బయలుదేరాయి. వీటిల్లో కొన్ని గమ్యస్థానాల కు చేరుకున్నట్టు అధికారులు వివరించారు. ఇక మిగిలిన మరో 600 లోడ్లను డిస్పాచ్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ 2079 లోడ్లల్లో 11909 కిలో లీటర్ల పెట్రోల్, 19707 కిలో లీటర్ల డీజిల్ వివిధ బంకులకు వెళ్లాయి. రాష్ట్రంలోని మూడు ఆయిల్ సరఫరా కంపెనీలైన ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్పీసీఎల్ సంస్థల ద్వారా ఈ మొత్తం లోడ్ డిస్పాచ్ అయింది. ప్రతి లోడ్ కు రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని అటాచ్ చేసి పంపుతున్నట్టు అధికారులు తెలిపారు. డిస్పాచ్ అయ్యే ప్రాంతం నుంచి దూరంగా ఉండే ప్రాంతాలకు లోడ్లు చేరడం కొంచెం ఆలస్యమవుతోందని అధికారులు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ లోడ్ డిస్పాచ్ రాత్రి పూట కూడా జరపాలని సీఎం ఆదేశించారు. ఆదివారం నాటితో పోల్చుకుంటే నిన్న ఆయిల్ సరఫరా మెరుగైంది. ఇక సోమవారం ఉదయంతో పోల్చుకుంటే మంగళవారం అనకాపల్లి, తూర్పు గోదావరి,గుంటూరు, కృష్ణా, బాపట్ల, పల్నాడు, నంద్యాల, అనంతపురం, మార్కాపురంవంటి జిల్లాల్లో బంకుల్లో పెట్రోల్, డీజిల్ లభ్యత మెరుగైంది. ఇక రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం రాత్రి ఏడు గంటల సమయానికి 6511 కిలో లీటర్ల పెట్రోల్, 9046 కిలో లీటర్ల మేర అమ్మకాలు జరిగాయి.

## సైబర్ గాబరా

### ఉమ్మడి కర్నూలులో వందల ఖాతాలు సీజ్

### ప్రత్యక్ష, సబ్ ట్రాన్స్‌ఫర్ల ఖాతాలు కూడా నిలిపివేత

### తీవ్ర ఇబ్బందుల్లో ఖాతాదారులు

### ఆన్‌లైన్ బెట్టింగ్, మట్కా ఖాతాలపై ప్రత్యేక అనుమానాలు



**కర్నూలు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** ఉమ్మడి కర్నూలు జిల్లాలో బ్యాంకు ఖాతాలు సీజ్ చేస్తున్నారు. ఒకటో రెండోకాదు వందలు, వేల సంఖ్యలో ఇప్పటికి అకౌంట్లో సీజ్ అయ్యాయి. అందుకు కారణం సైబర్ నేరాల ప్రకంపనలే ఎక్కడో సైబర్ నేరాలు చేసిన నేరగాళ్లు ఆ మొత్తాన్ని ఇక్కడి అకౌంట్లకు బదిలీ చేశారు ఆ మేరకు ఉత్తరాది పోలీసులు ఇచ్చిన నోటీసుల మేరకు అకౌంట్లను స్తంభింప చేశారు. అదే క్రమంలో సబ్ ట్రాన్స్ఫర్లు జరిగిన అకౌంట్లు సీజ్ చేయబడ్డాయి. వాటితో పాటు ఆన్‌లైన్ జూదం ఆడే వారి అకౌంట్లు కూడా సీజయ్యాయి. అంతేగాక వారి అకౌంటు నుంచి స్థానికంగా ట్రాన్సాక్షన్ జరిపిన ఇతరుల అకౌంట్లు కూడా సీజ్ అవుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సైబర్ నేరాలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు కలకలం రేపుతున్నాయి. మహారాష్ట్ర కేంద్రంగా పనిచేస్తున్న సైబర్ నేరగాళ్ల నుంచి వివిధ బ్యాంకు ఖాతాలకు చిన్నచిన్న మొత్తాల్లో నగదు బదిలీ అయిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు అప్రమత్తమయ్యాయి. అనుమానాస్పద లావాదేవీల నేపథ్యంలో గడచిన ఆరు నెలల కాలంలో వందల సంఖ్యలో ఖాతాలను బ్యాంకులు సీజ్ చేసినట్లు సమాచారం. గత ఏడాది అక్టోబర్‌లో ఆళ్లగడ్డ పట్టణంలోని ఒక ప్రభుత్వ రంగ బ్యాంకు ఖాతాకు మహారాష్ట్ర నుంచి నగదు బదిలీ అయిన ఘటన కీలకంగా మారింది. ఆ లావాదేవీలపై మహారాష్ట్రలోని సహార్ పోలీస్ స్టేషన్ నుంచి సంబంధిత బ్యాంకుకు అధికారిక నోటీసులు అందినట్లు తెలిసింది. ఆ మేరకు బ్యాంకు అధికారులు సంబంధిత ఖాతాను తక్షణమే సీజ్ చేశారు. అయితే అప్పటికే ఆ ఖాతానుంచి ఇతర ఖాతాలకు పలు లావాదేవీలు జరిగిన కారణంగా, వాటిని కూడా అనుమానాస్పదంగా గుర్తించి సీజ్ చేసినట్లు >>2

## మార్కాపురంలో వర్ష బీభత్సం

### బోడపాడులో ముగ్గురు బలి

### పిడుగుపాటుకు ఒకరు, పందిరి కూలి మరొకరు మృతి

### వడగళ్లు, గాలివానతో చెట్లు నేలకొరిగి విద్యుత్‌కు అంతరాయం



**మార్కాపురం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** మార్కాపురం ప్రాంతంలో కురిసిన అకాల వర్షం విషాదాన్ని మిగిల్చింది. బోడపాడు గ్రామంలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయినట్టు సమాచారం అందింది. పిడుగుపాటుకు ఒక మహిళ మృతి చెందగా, గాలివాన తీవ్రతతో పందిరి కూలిపోవడంతో మరో మహిళ అక్కడికక్కడే ప్రాణాలు విడిచినట్టు గ్రామస్తులు తెలిపారు. తీవ్ర ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించిన ఈ వర్షం, అనూహ్యంగా ప్రమాదాలకు దారితీసింది. సాయంత్రం ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని గాలివానతో కూడిన వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో వడగళ్ల వాన పడటం గమనార్హం. వడగళ్ల ప్రభావంతో పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక గాలివాన ప్రభావంతో బోడపాడు సహా పరిసర గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. రోడ్లపై కొమ్మలు విరిగి పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్నిచోట్ల >>2

రిటైల్ బంకుల నుంచి

# బల్క్‌గా వద్దు

### కంపెనీల నుంచే డీజిల్ కొనుగోలు చేసుకోండి

### అమరావతి నిర్మాణ పనులకు రాష్ట్రం విజ్ఞప్తిని తిరస్కరించిన కేంద్రం

**విజయవాడ, ఏప్రిల్ 28, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో నెలకున్న ఇందన కొరత, రాజధాని అమరావతి నిర్మాణ పనులకు డీజిల్ కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిపై కేంద్రం స్పందించింది. రిటైల్ ఔట్‌లెట్ల నుంచి బల్క్‌గా సరఫరా చేయడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది. నేరుగా ఆయిల్ కంపెనీల నుంచే కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. రిటైల్ బంకుల ద్వారా డీజిల్ సరఫరాకు అవకాశం లేదని తెలిపింది.. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం జారీచేసి ఉత్తర్వులను ఉపసంహరిం చుకోవాలని స్పష్టం చేసింది. రాజధాని పనుల కోసం కూటమి ప్రభుత్వం డీజిల్ కోరడంతో మోడీ సర్కారు ఈ మేరకు స్పందించింది. నాలుగు రోజుల కిందట ఆయిల్ కంపెనీలకు ఆదేశాలు జారీచేసిన ఏపీ ప్రభుత్వం.. రాజధాని అమరావతి నిర్మాణ పనుల కోసం బల్క్‌గా డీజిల్‌ను రిటైల్ బంకుల నుంచి సరఫరా చేయాలని సూచించింది. మొత్తం 2,75,66,000 లీటర్ల డీజిల్‌ను సరఫరా చేయాలని కోరింది. అయితే, ఈ ఆదేశాలను కేంద్రం తప్పుబట్టింది. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరతతో జనం ఇబ్బందులు పడుతున్నారు. బంకుల వద్ద నోస్టాక్ బోర్డులు దర్శనం ఇస్తున్నాయి. రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. రాజధాని అమరావతి నిర్మాణ పనుల కోసం బల్క్‌గా డీజిల్ కోరుతూ ఏపీ ప్రభుత్వం లేఖ రాసిం ది. ఈ క్రమంలో స్పందించిన కేంద్రరిటైల్ ఔట్‌లెట్ల నుంచి బల్క్‌గా సరఫరా చేయడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది.

## ఇంధన కొరతపై చంద్రబాబు కళ్లు తెరవాలి

### పిసిసి చీఫ్ షర్మిల ధ్వజం

**విజయవాడ, ఏప్రిల్ 28, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో తీవ్ర ఇందన సంక్షోభం ఏర్పడిందంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రూ.500 డీజిల్ కోసం ఓ ఆక్వా రైతు పడిన ఆవేదనను ప్రస్తావిస్తూ, ఇది రైతులను రక్షించే ప్రభుత్వమా లేక భక్షించే ప్రభుత్వమా అని ఘాటుగా ప్రశ్నించారు. చంద్రబాబు పాలనలో ఆక్వా రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, ఇది వారి పాలిట శాపంగా పరిణమించిందని ఆమె విమర్శించారు. ఈ మేరకు ఆమె ఓ రైతు ఆక్రోశిస్తున్న ఓ వీడియో విడుదల చేశారు. కూటమి పాపం.. ఆక్వా రైతన్న పాలిట శాపం. రాష్ట్రంలో ఇందన సంక్షోభం రొయ్య రైతులకు అంతులేని కష్టం. కంటికి రెప్పలా చూసుకొనే రొయ్య పిల్లలను బ్రతికించేందుకు ఓ పెట్రోల్ బంకు దగ్గర రైతన్న పడిన ఆవేదన వర్ణనాతీతం. రూ. 500 డీజిల్ కోసం ఆ రైతు రోదించిన తీరు చూసి కూటమి ప్రభుత్వం సిగ్గుపడాలి.

'అన్నా నాకు ఫ్యాన్ సీట్లు (ఏరేటర్) తిరగాలన్నా .. అప్పుచేసి రొయ్య పిల్ల వేశాను.. ఫ్యాన్ సీట్లు తిరగకపోతే నా రొయ్య పిల్ల చచ్చిపోద్ది అన్న' అంటూ రైతన్న ఆవేదన వింటుంటే ఈ రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్లా? లేనట్లా? ఎక్కడా లేని ఇందన సంక్షోభం ఏపీలోనే ఎందుకొచ్చింది ? ఇదేనా రాష్ట్ర ప్రజలపై కేంద్రానికున్న చిత్తశుద్ధి? ఇందుకేనా పడి పడి మోదీజీకి మద్దతు ఇచ్చేది? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

రాష్ట్రంపై బీజేపీకి పట్టింపు లేదనడానికి ఇందన సంక్షోభం ఒక నిదర్శనమని, వదంతులు నమ్మొద్దని చెప్పే బదులు... ఇప్పటికైనా కళ్లు తెరవండి చంద్రబాబు గారు.. అంటూ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## జగన్ సీపీఆర్‌వో ముందస్తు బెయిల్‌కు సుప్రీం నిరాకరణ

**విజయవాడ, ఏప్రిల్ 28, ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోల మార్ఫింగ్ కేసులో మాజీ సీఎం జగన్ సీపీఆర్‌వోగా పని చేసిన పూడి శ్రీహరికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు, మధ్యంతర ఉపశమనం కలిగించేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. ఈ కేసులో పూడి శ్రీహరిని రిమాండ్‌కు అప్పగించాలంటూ గతంలో పోలీసులు కుప్పం ట్రయల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం అందుకు అంగీకరించలేదు. దీంతో పోలీసులు హైకోర్టును ఆశ్రయించగా.. కుప్పం కోర్టు ఆదేశాలను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ.. విచారణకు సహకరించాలని పూడి శ్రీహరిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం కుప్పం కోర్టు ఆదేశాలను తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది.

## వి.కోటలో ఘోర అగ్నిప్రమాదం

**వి.కోట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** చిత్తూరు జిల్లా వి.కోట పట్టణ సమీపంలో ఉన్న పత్రపల్లి వద్ద ఓ వ్యాపారికి చెందిన ప్లాస్టిక్ వస్తువుల గోడౌన్ అగ్నిప్రమాదంలో దగ్ధమైంది.

ప్లాస్టిక్ పరికరాలు కాలి బూడిద కాగా రెండు కోట్ల మేర నష్టం కలిగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. పత్రపల్లి సమీపంలో ఉన్న గోడౌన్‌లో ఒక్కసారిగా దట్టమైన పొగలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న గోడౌన్ యజమాని అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. కుప్పం ఫైర్ బృందం మంటలు ఆర్పేందుకు తీవ్రంగా యత్నించారు.

ట్యాంకర్ వచ్చీ రాగానే

# నో స్టాక్ బోర్డా!



- బ్యాంకు యాజమాన్యాలు సిండికేట్‌గా మారుతున్నాయ్
- బైక్‌లకు రూ.100, ఆటోలకు రూ.500 రేషన్
- పెట్రోల్, డీజిల్ కొరతపై ప్రజాసంఘాల ఆగ్రహం
- ఉరి తాళ్లతో వినూత్న నిరసన

**తిరుపతి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లావ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరతను తక్షణమే నివారించాలని, అక్రమ నిల్వలున్న పెట్రోల్ బంకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తిరుపతి జిల్లా ఆటో డ్రైవర్‌ల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతి అంబేద్కర్ విగ్రహం దగ్గర వినూత్నంగా ఆటోకు తాళ్లు కట్టుకొని లాగుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎస్. జయచంద్ర, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి సుబ్రమణ్యం మాట్లాడుతూ కంపెనీలు ఒక్కో బంకుకు రోజుకు 20 వేల లీటర్ల డీజిల్‌ను మాత్రమే సరఫరా చేస్తుండగా గంటల్లోనే ఖాళీ అయిపోతోందన్నారు.

**వ్యవసాయ పనులపై తీవ్ర ప్రభావం**

తిరుపతి జిల్లాల్లో వారం రోజులుగా డీజిల్ తగినంత దొరకడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. కీలక సమయంలో ట్రాక్టర్లు,



తిరుపతిలో వినూత్నంగా నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్‌లు

వరి కోత యంత్రాలకు డీజిల్ లభించక వ్యవసాయ పనులపై తీవ్ర ప్రభావం పడుతోందని తెలిపారు. మరోవైపు రొయ్యలు, చేపల పెంపకం రైతులు కూడా డీజిల్ కోసం బారులు తీరుతున్నారు. ఈ క్రమంలో నగరంలోని పలు బంకుల యాజమాన్యాలు సిండికేట్‌గా మారిపోయారని సిఐటియు నేతలు ఆరోపిస్తున్నారు. పెట్రోల్ ట్యాంక్ వచ్చీ రాగానే స్టాక్ అయిపోయిందంటూ బోర్డులు పెట్టేస్తున్నారని, లీటర్ పెట్రోల్ 110 ఉండగా దానిపై అదనంగా 50 నుంచి వంద రూపాయలు పెంచి బ్లాక్‌లో విక్రయిస్తు న్నారన్నారు..పెద్ద వాహనాలకు వెయ్యిరూపాయలు, ఆటోలకు 500 రూపాయలకు మించి డీజిల్ నింపడం లేదని, పెట్రోల్ అయితే ఒక్క బైక్‌కి వందరూపాయలుకి పడుతున్నారన్నారు.. దీనివల్ల ప్రజలకు వినియోగదారులకు తీవ్రమైన కష్టం ఏర్పడిందన్నారు. తక్షణమే పెట్రోల్ డీజిల్ కొరతను నివారించాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పరుశురాం, యుగంధర్ జిల్లా ఆటో యూనియన్ కార్యదర్శి వాసు, నాయకులు రాము, ప్రసాద్, బాదుల్లా, కేశవులు, ప్రైవేట్ బస్సు యూనియన్ కార్యదర్శి శేషయ్య, వరద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీకి మరో 1,450 ఎలక్ట్రిక్ బస్సులు

### లీజు పద్ధతిలో పీపీపీ విధానం ద్వారా కొనుగోలు

**విజయవాడ, ఏప్రిల్ 28, ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీఎస్ఆర్టీసీ విద్యుత్తు బస్సుల వినియోగాన్ని పెంచాలని భావిస్తోంది. ఇందులో భాగంగా మరో 1,450 ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయడానికి సిద్ధమవుతోంది. ఈ ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సుస్థిర ఎలక్ట్రిక్ వాహన విధానం (4.0)లో భాగంగా ప్రస్తుతం ఆర్టీసీలోని 8,375 డీజిల్ బస్సుల స్థానంలో 2031 నాటికి ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పీఎం ఈ బస్‌సేవ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రానికి 1,050 బస్సులను కేటాయించింది. ఈ కేటాయింపులో 11 నగరాల కోసం 750 బస్సులు, తిరుమల ఘాట్ మార్గంలో నడపడానికి ఉద్దేశించిన 300 బస్సులు ఉన్నాయి. వీటి కోసం కేంద్ర ప్రభుత్వమే స్వయంగా టెండర్లను ఆహ్వానించి రాష్ట్రంలో వాటిని సరఫరా చేసే బాధ్యతను పినాకిల్ ఇండియా లిమిటెడ్‌కు అప్పగించింది.

ఇప్పుడు కొత్తగా కొనుగోలు చేసేందుకు ప్రతిపాదించిన 1,450 బస్సుల కోసం టెండర్లను ఆహ్వానించే బాధ్యతను ఏపీఎస్ఆర్టీసీ స్వయంగా చేపడుతోంది. ఈ బస్సులను తొలి విడతగా లీజు పద్ధతిలో పీపీపీ విధానం ద్వారా కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 1,050 బస్సులు 8 అడుగుల ప్రామాణిక వెడల్పును కలిగి ఉండటం వల్ల వాటిలో సీట్ల సామర్థం తక్కువగా ఉంది. అయితే ఆర్టీసీ ఇప్పుడు 8.5 అడుగుల వెడల్పు కలిగిన బస్సులను కొనాలని భావిస్తోంది.



**500 సీఎన్‌జీ బస్సులు**

స్త్రీ శక్తి పథకం కారణంగా బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరగటం, కాలం చెల్లిన వాహనాల స్థానంలో కొత్తవాటిని ప్రవేశపెట్టాల్సిన ఆవశ్యకత ఏర్పడటంతో 15 ఏళ్ల సేవా కాలాన్ని పూర్తి చేసుకున్న బస్సుల స్థానంలో వెంటనే 500 కొత్త సీఎన్‌జీ బస్సులను కొనుగోలు చేయడానికి సంస్థ సిద్ధమైంది. ఈ ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అంతేకాకుండా ఇప్పటికే 6 లక్షల నుంచి 7 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించిన 500 డీజిల్ బస్సులకు రెట్రోఫిట్టింగ్ (ఆధునికీకరణ) చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆ బస్సుల్లో సీఎన్‌జీ కిట్‌లను అమర్చనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా, భాగ్యనగర్ గ్యాస్, మేఘా, గోదావరి గ్యాస్, థింక్ గ్యాస్, హెచ్‌పీసీఎల్, ఐఓసీ వంటి వివిధ సంస్థలు ప్రస్తుతం వేర్వేరు జిల్లాల్లో సీఎన్‌జీని సరఫరా చేస్తున్నాయి. ప్రతి జిల్లాలో అవసరమైన సంఖ్యలో ఉన్న బస్సులకు సీఎన్‌జీని సరఫరా చేసే సామర్థం ఆయా సంస్థలకు ఉందో లేదో అధికారులు ప్రస్తుతం అంచనా వేస్తున్నారు.

# అమరావతి కార్మికులకు కనీస వసతులేవి?

### ఏడీసీ ఛైర్మన్ లక్ష్మీపార్థసారథి ఆగ్రహం

### మెరుగైన భోజన సదుపాయాలు కల్పించాలాని ఆదేశం

**విజయవాడ, ఏప్రిల్ 28, ప్రభాతవార్త ప్రతినిధి:** పొరుగు రాష్ట్రాల నుంచి అమరావతి నిర్మాణ పనులు చేయడానికి వస్తున్న కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఇక్కడ భోజనం, వసతి కల్పనలో గుత్తేదారు సంస్థలు పటిష్టమైన చర్యలు చేపట్టాలని అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) ఛైర్‌పర్సన్ డి.లక్ష్మీపార్థసారథి ఆదేశించారు. లేబర్ క్యాంపులలో సెంట్రల్ కిచెన్ సదుపాయాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. లింగాయపాలెంలోని ఎన్‌సీసీ లేబర్ క్యాంపు, తుళ్లూరులోని ఆర్వీఆర్ లేబర్ క్యాంపు, ఎన్13 రోడ్డుకు సమీపంలోని మెగా లేబర్ క్యాంపు, అనంతవరంలోని ఎన్16 రోడ్డుకు సమీపంలోని బీఎస్ఆర్, బీఎస్‌పీఎల్ లేబర్ క్యాంపులలో భోజనం, వసతి సదుపాయాలతో పాటుగా శానిటేషన్, మరుగుదొడ్ల కల్పన, తాగునీరు మరియు వాడకం నీటి సదుపాయాలను అధికారులతో కలిసి పరిశీలించారు.

ఈ4 రోడ్డుకు సమీపంలో ఉన్న మెగా లేబర్ క్యాంపులో కనీస వసతులు లేకపోవటం పట్ల అక్కడి ప్రాజెక్టు మేనేజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ వెంటనే విద్యుత్తు, తాగునీరు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మధ్యాహ్నం భోజన సమయంలో బీఎస్ఆర్ సెంట్రల్ కిచెన్‌ను పరిశీలించారు.

ఉదయం, మధ్యాహ్నం, రాత్రికి వంటల మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళలు, చిన్న పిల్లలకు కల్పిస్తున్న ఇతర వసతులపైనా ఆరా తీశారు. అదేవిధంగా రాత్రిళ్లు నిర్మాణ ప్రదేశాలలో పనిచేస్తూ పగలు లేబర్ క్యాంపులలో నిద్రించే లారీ, జేసీబీ, క్రేన్ డ్రైవర్లకు మంచాలు, ఫ్యాన్ వంటి సదుపాయాలపై నేరుగా సదరు కార్మికులను అడిగి తెలుసుకున్నారు. వలస కార్మికులకు వసతుల కల్పనలో గుత్తేదారు సంస్థలు లోటు లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా కార్మికులకు ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే ఏడీసీ అధికారులకు వెంటనే సమాచారం అందించాలని వారికి చెప్పారు. ఈ పర్యటనలో ఏడీసీ ఛీఫ్ ఇంజినీర్లు బి.నరసింహమూర్తి, సీహెచ్ ధనుంజయ, ఎస్ఈ కె.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

## పాస్టర్ కుల ధ్రువపత్రాలన్నీ రద్దు చేయండి - హైకోర్టు

**విజయవాడ, ఏప్రిల్ 28, ప్రభాతవార్త ప్రతినిధి:** మతం మారితే ఎస్సీ హోదా పోతుంది పాస్టర్ కుల ధ్రువపత్రాన్ని రద్దు చేయండంటూ హైకోర్టు ఆదేశించింది. పాస్టర్ చింతాడ ఆనంద్ మోసపూరితంగా పొందిన ఎస్సీ సర్టిఫికేట్‌ను రద్దు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ కేసులో బాధితుడు అక్కల రామిరెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంపై ఏపీ హైకోర్టు స్పందించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి, బాపట్ల జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్, పిట్లలవానిపాలెం తహశీల్దార్‌కు నోటీసులు జారీ చేసింది. విచారణను జూన్ 18కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ ఇటీవల ఈమేరకు ఉత్తర్వులు ఇచ్చారు.క్రైస్తవ మతంలోకి మారిన పాస్టర్ చింతాడ ఆనంద్ బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన అక్కల రామిరెడ్డి, మరికొందరిపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఫిర్యాదు చేయగా చందోలు పోలీసులు 2021లో కేసు నమోదు చేశారు. తమ స్థలాన్ని ఆక్రమించి అందులో చర్చి నిర్మించిన నేపథ్యంలో ప్రశ్నించినందుకు వైఎస్సార్సీపీ నేతల ప్రోద్బలంతో పాస్టర్ ఆనంద్ తనతోపాటు తన కుటుంబ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద తప్పుడు కేసు పెట్టారని ఈ కేసును కొట్టేయాలని కోరుతూ రామిరెడ్డి తదితరులు 2022లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు క్రైస్తవంలోకి మారిన రోజే ఎస్సీ హోదా కోల్పోతారని, పాస్టర్ ఆనంద్ ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని తీర్పు ఇచ్చింది. పాస్టర్ ఫిర్యాదుతో పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేస్తూ 2025 ఏప్రిల్ 30న తీర్పు ఇచ్చింది.

## ప్రైవేట్ కాలేజీ లే అవుట్‌లో ప్రభుత్వ నిధులతో రహదారా?

### -వైసిపి హయాంలో అధికారుల తీరుపై హైకోర్టు ఆగ్రహం

### - సీఐడీ విచారణకు ఆదేశం

**విజయవాడ, ఏప్రిల్ 28, ప్రభాతవార్త ప్రతినిధి:** కడప జిల్లా ప్రొద్దుటూరులో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ ప్రైవేట్ కాలేజీ కోసం.. లే అవుట్‌లో ప్రభుత్వ నిధులతో రహదారి వేశారు. దీనిపై ఏపీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారంటూ.. సీఐడీ విచారణకు హైకోర్టు ఆదేశించింది. ఈ అంశంపై కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో ఏపీ హైకోర్టు పైవిధంగా స్పందించింది. తమ అనుమతి లేకుండా రహదారి వేశారంటూ లే అవుట్‌లోని పలువురు భూ యజమానులు హైకోర్టును గతంలో ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపి నివేదిక అందించాలంటూ జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. దుర్వినియోగమైందని కోర్టు స్పష్టం చేసింది. దీనికి ఆ సమయంలో ఉన్న అధికారులు, కౌన్సిల్ ఛైర్మన్‌తో పాటు సభ్యులు కారణమయ్యారని స్పష్టం చేసింది. రహదారి వేసే సమయంలో ఎవరూ అభ్యంతరం చెప్పలేదని.. కానీ ప్రైవేట్ భూముల్లో భూసేకరణ చేయకుండానే ఈ రోడ్డు వేశారంటూ కోర్టుకు జిల్లా కలెక్టర్ నివేదిక అందజేశారు. రోడ్డు నిర్మాణం వల్ల ప్రభుత్వ ధనం దుర్వినియోగం కావడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై సీఐడీ విచారణ చేపట్టాలని హైకోర్టు ఆదేశించింది.

# ఇంధనం పక్కదోవ పట్టించే వారిపై కఠినంగా వ్యవహరించండి

### మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశం

**సచివాలయం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** బల్క్‌పద్ధతిలో డీజిల్, పెట్రోల్‌ను పక్కదోవ పట్టించే అవుట్ లెట్లపై కఠిన చర్యలు తీసుకోవ డానికి వెనకాడవద్దు అని అధికారులను రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. ముఖ్యంగా పెట్రోల్ బంకుల్లో ఇందన నిల్వలు ఉన్నా సరే లేవని వాహనదారులకు చెబుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రంలో ఇంధన పరిస్థితిపై ఆయన మంగళవారం ఉన్నతాధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ వినియోగదారుల సేవా కేంద్రం టోల్‌ఫ్రీ నెంబర్ 1967కు వస్తున్న ఫిర్యాదుల్లో అధికభాగం పెట్రోల్ బంకులు కావాలని ఇంధనం ఇవ్వడం లేదని వస్తున్నాయి. దీనిపై ఆయా జిల్లాల వారీగా రిపోర్టులను పరిశీలించి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో పెట్రోల్ బంకులు మూసివేతలు క్రమంగా తగ్గుతున్నాయి. అయిల్ కంపెనీల నుండి డిస్పాచ్‌లు చాలా వేగంగా జరుగుతున్నాయి. వస్తున్న లోడ్లు వాహనదారులకు పూర్తిస్థాయిలో అందేలా చొరవ తీసుకోవాలి. అవుట్‌లెట్లు ఈ సమయంలో ఇంధనాన్ని పక్కదోవ పట్టించాలని చూస్తే మాత్రం ఉపేక్షించవద్దు. ముఖ్యంగా రైతులకు ఇబ్బందులు లేకుండా చూడండి. అక్వా రైతులు కీలకసమయంలో ఉన్నారు. వారికి ఎట్టిపరిస్థితుల్లో ఇంధన కొరత రానివ్వద్దు. రబీ పంట కోతలకు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన విధంగా వారికి ఆయిల్ అందేలా చూడాలి. దీనికి వ్యవసాయ శాఖాధికారులు, రెవెన్యూ అధికారులు సమన్వయం చేసుకొని బాధ్యత తీసుకోండి అని ఆదేశించారు.

**--రేషన్ విధానంలో సత్ఫలితాలు**

కీలకమైన సమయంలో పెట్రోల్ బంకుల్లో రేషన్ పద్ధతిని ప్రవేశపెట్టడం మంచి ఫలితాలను ఇచ్చింది. ప్రజలు కూడా దీనికి తగిన విధంగా స్పందించారు. వారి నుండి కూడా రేషన్ పద్ధతి మీద మంచి స్పందన రావడం శుభ సూచకం. ఇదే విధానాన్ని పరిస్థితి అదుపులోనికి వచ్చే వరకు కొనసాగించాలి. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది వచ్చినా ఉన్నతాధికారులు వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చూసుకోండని సూచించారు.

# తిరుమల సమాచారం

### కల్తీనెయ్యి కేసులో అసలు సూత్రధారుల

# గుట్టు రట్టుకు రంగం సిద్ధం

♦ఛార్జిషీట్‌లపై విచారించనున్న హైకోర్టు ♦తొలివిడతలో 14మందికి నోటీసులు



**తిరుమల, ఏప్రిల్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులను ఆలోచన చేసే దిశగా మారిన తిరుమల లడ్డూలకు రసాయనాలు కల్తీచేసిన నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో తాజాగా న్యాయస్థానం ఛార్జిషీట్లపై విచారణకు సిద్ధమైంది. ఇప్పటికే సిబిఐ సిట్ అధికారులు, ఏకసభ్యకమిటీ ఇచ్చిన నివేదికలతో అసలు పెద్దల దోషుల్ని పట్టుకోవడానికి చర్యలు తీసుకునే దిశగా కార్యాచరణ కదులుతోంది. ఇందులో భాగంగా నెల్లూరు ఏసిబి కోర్టులో దాఖలైన రెండు ఛార్జిషీట్లను న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. మొత్తం 36మందిని దోషులుగా గుర్తిస్తూ సిట్ నివేదికలను కోర్టుకు సమర్పించింది. ఇందులో టిటిడి అధికారులు, మార్కెటింగ్ విభాగం, మూడుసంస్థలు డైరీ యజామాన్యం, సిబ్బంది పేర్లు ఉన్నాయి. ప్రైవేట్ డైరీలు ఈ కల్తీలో కీలకంగా భాగస్వామ్యమవడం విశేషం. తొలివిడతగా 14మందిని విచారణకు హాజరుకావాలని న్యాయస్థానం నోటీసులిచ్చేదిశగా సిద్ధమైందని తెలుస్తోంది. ఇదే జరిగితే విచారణలో వాదప్రతివాదనలు విన్న తరువాత అసలు దోషులను వెలుగులోకి తెచ్చే అవకాశం ఉందనేది టిటిడిలో హాట్‌టాపిక్‌గా మారింది. కల్తీనెయ్యి బాగోతంలో సుమారు 237కోట్ల రూపాయలు వరకు అవినీతి జరిగిందనేది సిట్ నివేదిక. ఛార్జిషీట్‌ల ఆధారంగా న్యాయస్థానం ఏం తేల్చనుందనేది సర్వత్రా ఉత్కంఠగా మారింది. ఈ కల్తీనెయ్యి బాగోతంలో ఇప్పటికే సమగ్రంగా విచారణ చేపట్టిన సిబిఐ సిట్ సేకరించిన రెండొందల పేజీల నివేదికలను కోర్టు పరిశీలించనుంది. 2019–24 మధ్యకాలంలో టిటిడికి నెయ్యి సరఫరాకు సంబంధించిన రికార్డులు, కీలక దస్త్రాలు, టిటిడి కొనుగోళ్ళు, టెండర్లు తదితర అంశాల నివేదికలో పొందుపరిచింది. నెయ్యి సరఫరాకు సంబంధించి అమలైన టిటిడి టెండర్ విధానం, నిబంధనలు ఉల్లంఘన, తదుపరి అప్పటి బోర్డుకు అనుకూలంగా మార్చుకుని నెయ్యి సరషరా చేయించుకోవడం వంటివాటిపై ఇప్పుడు కోర్టులో వాదనలు మొదలుకానున్నాయి.. కల్తీలో అసలు సూత్రదారులు ఎవరనేది కనిపెట్టి వివరాలు బయటకు రావచ్చనేది గుప్పుమంటోంది.

## రేపు నృసింహ జయంతికి ఏర్పాట్లు

**తిరుమల, ఏప్రిల్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** పుణ్యక్షేత్రం తిరుమలలో ఈనెల 30న నృసింహ జయంతి, తరిగొండ వెంగమాంబ జయంతిని వైభవంగా నిర్వహించనున్నారు. నృసింహ జయంతి ప్రతి ఏటా వైశాఖ మాసం స్వాతి నక్షత్రంలో ఉత్సవం చేపడతారు. యోగ నరసింహస్వామి మూలమూర్తికి ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకం చేస్తారు. శ్రీవారి ఆలయ మొదటి ప్రాకారంలో గర్భాలయానికి ఈశాన్యం వైపున ఉన్న మండపంలో పడమరగా శ్రీ యోగ నరసింహ స్వామివారి ఉప ఆలయం ఉంది. యోగముద్రలో ఉన్న ఈ విగ్రహాన్ని శాస్త్ర ప్రకారం రూపొందించారు. స్వామివారికి నాలుగు చేతులుంటాయి. పైభాగంలో ఉన్న చేతులలో శంఖుచక్రాలు కనిపిస్తాయి. కింది రెండు చేతులు ధ్యాననిష్టను సూచిస్తాయి.



**వెంగమాంబ బృందావనంలో..**

ఈ సందర్భంగా తిరుమలలోని వెంగమాంబ బృందావనంలో పుష్పాంజలి సమర్పిస్తారు. ఆ రోజు సాయంత్రం 5.30 గంటలకు ఉభయనాంచారులతో కూడి మలయప్పస్వామి నారాయణగిరి ఉద్యానవనంలోని పద్మావతి పరిణయ మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ వెంగమాంబ జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రముఖ సంగీత విద్వాంసులు తరిగొండ వెంగమాంబ సంకీర్తనల గోష్ఠిగానం నిర్వహిస్తారు. నారాయణగిరి ఉద్యానవనాల్లో వెంగమాంబ జయంతి అనంతరం ఉభయనాంచారులతో కలిసి మలయప్పస్వామి రిగి ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకుంటారు.



తిరుచానూరులోని తోళ్లప్ప గార్డెన్‌లో భక్తులతో మాట్లాడుతున్న ఇఒ రవిచంద్ర

## అన్నప్రసాదాల నాణ్యతపై ఇఓ ఆరా

**తిరుమల, ఏప్రిల్ 28 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల తరహాలో తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి దర్శనానికి విచ్చేస్తున్న భక్తులకు అందిస్తున్న అన్న ప్రసాదాలను మంగళవారం మధ్యాహ్నం టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. తోళ్లప్ప గార్డెన్‌లో శ్రీ వేంకటేశ్వర నిత్య అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ విధానాన్ని సమగ్రంగా పరిశీలిస్తూ భక్తులతో నేరుగా మాట్లాడారు. నాణ్యత, సమయపాలన, సేవల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, తాగునీరు, రాత్రి వరకు వితరణ సమయాలపై అధికారులనుండి వివరాలు సేకరించారు. అనంతరం అన్నప్రసాద భవనంలోని స్టోర్‌రూమ్, కోల్డ్ స్టోరేజ్, వంటగది, పరిశుభ్రతను పరిశీలించి కూరగాయలు, ఆకుకూరల నిల్వలపై సమీక్షి ంచారు. ఉపయోగంలో లేని ఫర్నిచర్, పనికిరాని యం త్రాలు, ఇనుము వ్యర్థాలను త్వరితగతిన తరలించాలని నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. సిబ్బందికి జీతభత్యాలు సకాలంలో అందుతున్నాయా, ఎలాంటి కోతలు ఉన్నాయా అనే అంశాలపై ఇఒ రవిచంద్ర విచారణ జరిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి సివిఎస్ఒ కే.వి. మురళీకృష్ణ, అన్న ప్రసాద కేంద్రం అధికారి విజయభాస్కర్ , సూపరింటెండెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు ఆశీసులు అందిస్తున్న అర్చకులు

## పద్మావతి అమ్మవారి సేవలో ఉప రాష్ట్రపతి

**తిరుపతి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త ప్రతినిధి:** ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ మంగళవారం మధ్యాహ్నం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు అర్చకులు ఇస్తికాపాల్ స్వాగతం పలికారు. ఆయన ఆలయంలోని ధ్వజస్తంభానికి మొక్కుకుని పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆశీర్వాద మండపంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర అమ్మవారి ప్రసాదాలు అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్ రెడ్డి, జెఇఒ వి వీరబ్రహ్మం, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు,,ఆలయ డిప్యూటీ ఇఒహరీంద్రనాథ్ ఉన్నారు.

## పెరిగిన ఇంధన ధరలతో విమానాలను నడపడం కష్టం

**విజయవాడ, ఏప్రిల్ 28, ప్రభాతవార్త ప్రతినిధి:** పెరిగిన ఇంధన ధరలతో ఫ్లైట్స్ నడపడం కష్టంగా మారిందంటూ విమానయాన సంస్థలు ప్రభుత్వానికి మూకుమ్మడిగా మొర పెట్టుకున్నాయి. ప్రభుత్వం చొరవ తీసుకోకపోతే విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేయడం లేదా పూర్తిగా మూసివేయడం తప్ప మరో మార్గం లేదని పేర్కొన్నాయి. ఈ మేరకు ఎయిరిండియా, ఇండిగో, స్పైస్‌జెట్ సంస్థలతో ఏర్పాటైన ది ఫెడరేషన్ ఆఫ్ ఎయిర్‌లైన్స్ (ఎఫ్ఐఏ) పౌర విమానయాన శాఖ కార్యదర్శికి మంగళవారం లేఖ రాసింది. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని ఉపశమన చర్యలు తీసుకోవాలని ఫెడరేషన్ కోరింది. విమానాల నిర్వహణలో 40 శాతం వాటా ఇంధనానిదే కావడం, ఇటీవల ఏటీఎఫ్ ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో విమాన సంస్థలు ఈ లేఖ రాశాయి. జెట్ ఫ్యూయల్ ధరలు ఆకాశాన్ని తాకిన నేపథ్యంలో దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులను నడపడం కష్టమవుతోందని ఎఫ్ఐఏ తన లేఖలో పేర్కొంది. ఇప్పటికే విమాన సంస్థలు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని గుర్తు చేసింది. ఈ సమయంలో ప్రభుత్వ మద్దతు అందకపోతే విమాన సేవల మూసివేత శరణ్యమని పేర్కొంది. ప్రభుత్వ మద్దతులో భాగంగా ఏటీఎఫ్ ధరలను స్థిరీకరించాలని విమాన సంస్థలు కోరుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరిగినప్పుడు, విమాన ఇంధనం ధరలు విపరీతంగా పెరిగిపోకుండా చూడటానికి గతంలో మాదిరి క్రాక్ బ్యాండ్‌ను ఏర్పాటు చేయాలని విమానయాన సంస్థలు కోరుతున్నాయి.

29-4pg4:29-4pg4.qxd 4/28/2026 5:22 PM Page 1



వార్త

ఇంద్రియ పరమైన విషయాలతో ఎంతగా మనిషి తెగతెంపులు చేసుకుంటాడో, అంతగా అతడు భగవంతుని పట్ల ఆకర్షితుడవుతాడు.

- రమణ మహర్షి

# అమలుకు నోచుకోని చట్టాలెందుకు?

మానవ జాతిని పట్టిపీడిస్తున్న మద్యపానం, ధూమపానాన్ని పారద్రోలే విషయంలో పాలకులకు ఆరాటమే కానీ త్రికరణశుద్ధి లేదనే చెప్పాలి. ఈ రెండు వ్యసనాలు దేశంలో ఎన్నో కోట్ల కుటుంబాలను ఛిద్రం చేస్తున్నాయి. ఎంతో మంది మంచానికి పరిమితమై కృంగికృశించిపోతున్నారు. లక్షల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. ఎన్ని అనర్థాలు జరుగుతున్నాయో ఎంతటి మారణహోమం సృష్టిస్తున్నాయో పాలకులకు తెలియంది కాదు. చట్టాలుచేస్తున్నారు. ఉపన్యాసాలు ఇస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రకటనలు ఇస్తున్నారు. కానీ త్రికరణశుద్ధిగా వీటిని నియంత్రించేందుకు ప్రయత్నం చేయడం లేదు. మరో కోణంలో ఆలోచిస్తే ప్రోత్సహిస్తున్నారని కూడా చెప్పొచ్చు. కొందరిని కొంతకాలం మోసం చేయొచ్చు. అందరిని కొంత కాలం మోసం చేయొచ్చు. కానీ అందరిని ఎళ్లకాలం మోసం చేయాలంటే అది భ్రమే అవుతుంది. అలా ప్రజలను మోసం చేసినవారు, వేధించిన వారు గతంలో ఎందరో చక్రవర్తులు, రాజులు కాలగర్భంలో కలిసిపోయారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి, ప్రజా అవసరాలను గుర్తించి ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకొని వారి ఆదరాభిమానాలు పొంది వారి హృదయాల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించుకున్న నాయకులు ఎందరో ఉన్నారు. మద్యం విషయంలో ఆదాయాన్ని పెంచుకునేందుకు పాలకులు వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యవాదుల్లో ఆవేదన వ్యక్తం అవుతున్నది. మద్యం సరే సారాను నిషేధించారు. ఏమాత్రం అమలువుతున్నదో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. గుడుంబా, నాటుసారా ఒక కుటీర పరిశ్రమగా వర్ధిల్లుతున్నది. ఈ అక్రమ సారా ధాటిని తట్టుకోలేక నిరోధించలేక ఏకంగా చీప్ లిక్కర్‌ను ప్రవేశపెట్టారు. తెలుగు రాష్ట్రాల్లో కానీ, మద్యనిషేధం అమలు కాని దేశంలోని అనేక రాష్ట్రాల్లో అమ్ముడవుతున్న మద్యంలో అధిక శాతం ఈ చీప్ లిక్కరే. ఈ చీప్ లిక్కర్ తాగి లక్షలాది మంది రకరకాల వ్యాధులకు లోనవుతున్నారు. దేశంలో జరుగుతున్న రోడ్డుప్రమాదాల్లో అధికశాతం వాహన చోదకులు మద్యం మత్తులోనే ఉన్నట్లు దర్యాప్తులో వెలుగు చూసింది. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో వేలాది మంది పట్టుబడుతున్నారు. జరిమానా చెల్లించి తిరిగి అదే పంథాలో వాహనాలు నడుపుతున్నారు. ఇక హత్యలు, అత్యాచారాలు లాంటి తీవ్ర నేరాలకు పాల్పడినవారిలో అధిక శాతం మద్యంమత్తులో ఉన్నవారేననేది పోలీసు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఒకనాడు వందల కోట్లలో ఉన్న ఆదాయం నేడు వేలాది కోట్ల రూపాయలకు చేరుకున్నది. యేడాది యేడాదికి పెంచుకుంటూనే పోతున్నారు. మద్యం ఆదాయమే మహాప్రసాదంగా మారిన దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. ఇలా మద్యాన్ని పాలకులే ఆదాయం కోసం పెంచిపోషిస్తుంటే ధూమపానాన్ని నియంత్రించేందుకు కొన్ని చర్యలు చేపడుతున్నారు. నిబంధనలు పెడుతున్నారు. కానీ అవేమీ వీటిని నిరోధించలేకపోతున్నాయి. మద్యపానం కంటే ధూమపానం ప్రజారోగ్యానికి అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తున్నది. ఊపిరితిత్తుల కేన్సర్, గుండెజబ్బులు, ఒకటేమిటి రకరకాల వ్యాధులకు ధూమపానం కేంద్ర బిందువుగా మారుతున్నది. అన్నిటి కంటే ముఖ్యంగా కేన్సర్‌ను విస్తరింపచేయడంలో ధూమపానం అగ్రస్థానంలో ఉందని చెప్పొచ్చు. పొగతాగేవారే కాదు, వారు తాగి వదిలిన పొగను పీల్చే చుట్టుపక్కల ఉన్నవారు కూడా రకరకాల వ్యాధులకు లోనవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా నూటముప్పైకోట్ల మందికిపైగా ధూమపానంలో మునిగితేలుతున్నారనే అంచనా. భారత దేశానికి సంబంధించి ఇరవై కోట్ల మందికిపైగా పొగాకుకు అలవాటుపడ్డారు. బీడీలు, సిగరెట్లు తాగడం సరదాగా ఆరంభమై ఆ తర్వాత అలవాటుగా మారిపోతున్నది. పదిహేనేళ్ల వయసులోనే పొగతాగడం ఆరంభం కావడం ఆందోళన కలిగించే అంశం. సిగరెట్ పొగలో నాలుగు వేల ఎనిమిదివందలకుపైగా విషవాయువులు ఉన్నాయని అవి అనేక రోగాలకు కారణాలవుతున్నాయని వైద్యనిపుణులు ఏనాటి నుంచో హెచ్చరిస్తున్నారు. పొగాను నిషేధించేందుకు గత రెండు దశాబ్దాలుగా ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. చట్టాలు చేస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధించి ఉత్తర్వులను కూడా జారీ చేశారు. కానీ అవేమీ అమలు కావడం లేదు. ఎవరు అమలు చేస్తారో స్పష్టత లేదు. ఆ చట్టంలో కూడాఎన్నో లొసుగులు ఉన్నాయి. మరోకపక్క ఈ బీడీ పరిశ్రమ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కోట్లాది మందికి బతుకు తెరువు ఇస్తున్నమాట కాదనలేని సత్యం. అడవుల్లో ఉన్న లక్షలాది మంది గిరిపుత్రులకు బీడీ ఆకుల సేకరణ ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటి. కొన్ని శతాబ్దాలుగా అదొక కుటీర పరిశ్రమగా వర్ధిల్లుతున్నది. పొగాకును నిషేధిస్తే ఆ సాగుపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్న వందలాది కుటుంబాలు లక్షలాది మందికూలీలుబజారున పడతారు. జీవనోపాధి కోల్పోతారు. యేటా దాదాపు నలభై వేలకోట్ల రూపాయలకుపైగా పొగాకు వ్యాపారం జరుగుతున్నది. ఈ కుటుంబాలను వీధిపాలు కాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. ఆ బాధ్యతను పాలకులు విస్మరించి కాగితాల్లో నిషేధాన్ని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. అందుకే అది ఆచరణకు నోచుకోలేదు. ప్రభుత్వానికి చిత్తశుద్ధిఉంటే జీవనోపాధి కోల్పోతున్నవారికి ప్రత్యామ్నాయం చూపి పొగాకు ఉత్పత్తులను, అమ్మకాలను, వినియోగాన్ని భూటాన్ దేశంలో లాగా పూర్తిగా నిషేధించాలి. అప్పుడే దీనికి పరిష్కారం దొరుకుతుంది. అంతేకానీ ఆచరణ సాధ్యం కానీ, అమలు చేయలేని చట్టాలు చేస్తే పాలకులు నవ్వులపాలు అవుతారు.

అవసరానికి ఆదుకొనే మిత్రులున్న వ్యక్తి అదృష్టవంతుడు. కానీ మిత్రుల సహాయాన్ని స్వీకరించాల్సిన అవసరం రాని వ్యక్తి ఇంకా అదృష్టవంతుడు.



వార్విక్

అతిథి అంటే ఇంటికొచ్చిన బంధువు మాత్రమే కాదు. ఆకలి బాధతో మిమ్మల్ని ఆశ్రయించిన ప్రతిజీవి, పశుపక్ష్యాదులు సైతం అతిథులే.



వి. జాన్సన్

## ప్రజావాక్కు

### పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రస్తుత కాలంలో పర్యావరణ కాలుష్యం రోజురోజుకు పెరుగుతోంది. అడవులు తగ్గిపోవడం, చెట్ల నరికివేత కారణంగా ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోంది. దీని వల్ల వర్షపాతం అస్థిరంగామారుతోంది. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితి మన ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంది. కాబట్టి మొక్కలు నాటడం మాత్రమే కాకుండా, వాటిని కాపాడటం కూడా ప్రతి పౌరుడి బాధ్యత. చిన్నస్థాయిలో అయినా మనం చేసే ప్రయత్నం భవిష్యత్తులో పెద్ద మార్పుకు దారి తీస్తుంది. మన చుట్టూ పచ్చదనం పెంచడం ద్వారా మనమే కాకుండా రాబోయే తరాలుపెరుగుతున్న కాలుష్యం నుంచి బయట పడతారు. వారికి ఆరోగ్యకరమైన, సురక్షితమైన వాతావరణాన్ని అందించగలుగుతాం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### ఉద్యోగుల కష్టాలు తీర్చండి

ఒక పే కమిషన్ నియమిచడానికి 10ఏళ్ళు. చాలా ఓర్పుగా వేచి ఉన్న సార్ ఉద్యోగుల జీవితాల వెలుగులు కోసం ఆశించిన సంవత్సర్ర వచ్చినా మళ్ళీ దాని మార్పులు చేర్పులు అర్హతలు అదాయాలు ఖర్చులు అంటూ ఇంకో రమారమి రెండు సంవత్సరాలు కాలం గడిపేసి ఇలోగా ప్రభత్వాలు మారయో కమిషన్‌కు మళ్ళీ కాలయాపన.. ఇది పరిస్థితిఉద్యోగుల కష్టాలు. అదే ఎమ్ఎల్ఏల, ఎమ్పీల జీతాల పెంపు క్షణాలలో జరిగిపోతాయి. రోజులతో కూడా పనిలేదు. వడ్డించేవాడు మనవాడైతే.. సామెత. ఉద్యోగుల జీతాలకు ఎలక్షన్స్ పెట్టేయండి సరిపోతుంది. నిరాశకు మాత్రం రెడీగా ఉంటే మంచిదేమో. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఉద్యోగుల కష్టాలు పెరుగుతూనే ఉన్నాయి. పెండింగ్‌లోనే ఉంటున్నాయి.

- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### నీ జీవితం నీదే

నేటి కాలంలో ఎవరి జీవితం వారిదే....నీకు నువ్వే జీవితం పట్ల పోరాడాలి, భరించాలి, సాధించాలి. విపత్కర పరిస్థితుల్లో అండగా ఉండాల్సిన అన్నదమ్ములు, తోటి బంధువులు ఆమడ దూరంలో వెళ్తున్నారు. దగ్గరికి వెళ్తే మనకు ఏమైనా డబ్బులు అవుతాయేమో అనే సందిగ్ధంలో ఉన్న సమాజం. కాబట్టి మనకు మనమే ధైర్యంగా ఉండి జీవితాన్ని ముందుకు సాగేలా మలచుకోవాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### సత్వర చర్యలు అవసరం

ఏ రాష్ట్రంలో అయినా ప్రభుత్వం విస్తృత పరిచే బృహత్కార్యాల్లో నూతన భవనాలకోసం భూమి సరిపడా లేనప్పుడు వ్యక్తుల నుండి కొన్ని, నియమాలు, షరతుల ప్రకారం భూమిని కొనుగోలు చేస్తారు. ఆవిధంగా ప్రభుత్వానికి తదుపరి పరిపాలన వేగంగా జరిగేందుకు ఆస్కారం, అవకాశం ఒక శుభ సూచకం. ఏపిలో పారిశ్రామిక సెజ్‌ల నిర్మాణానికి మొదటిసారి భూసేకరణ జరిగిన కొన్ని గ్రామాల వ్యక్తులు 20 ఏళ్లకు పైబడి ఏర్పడిన కాలుష్యంకారణంగా వందలు మరణించారు. పర్యావరణ సమతుల్యం ఒక పెద్ద సమస్య కావున నూతన వాతావరణ ప్రభావాన్ని నివారణ చర్యల ద్వారా సాధ్యమైన స్థాయిలో తగ్గించే అవకాశం ఉంది. అప్పుడు గ్రామ ప్రజలు కొన్ని జాగ్రత్తలు పాటిస్తారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సంప్రదించి ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవడం అవసరం.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### ప్లస్ టు అవసరం

ఈ మధ్య తెలంగాణ రాష్ట్ర నూతన విద్య విధానంలో ప్లస్ టు ఇంటర్మీడియట్ తప్పకుండా ఉండాలి. గురుకుల జూనియర్ లెక్చరర్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. గురుకుల లెక్చరర్‌లకు కుడా గెజిటెడ్ హోదా తప్పకుండా కలిపించాలి. గురుకుల జూనియర్ కళాశాలలో సామాజిక శాస్త్రాలు అయినా ఆర్ట్స్ గ్రూపులు, ఎకనామిక్స్, సివిక్స్, హిస్టరీ, కామర్స్ సబ్జెక్టులు వచ్చే విద్య సంవత్సరం 2026–2027 జూన్ నెల నుండి ప్రారంభం చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### క్రీడా వేదికను ఏర్పాటు చేయాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రీడలఅభివృద్ధికి చేపడుతున్న సమగ్ర చర్యలు రాష్ట్రయువతలో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. గ్రామస్థాయి నుంచే క్రీడాకారులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 90కోట్ల రూపాయల ప్రత్యేక నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఈనిధులతో మైదానాలు, వ్యాయామశాలలు అంతర్గత క్రీడా ప్రాంగణాల నిర్మాణం చేపట్టడమే కాకుండా, ఇప్పటికే ఉన్న వసతులను ఆధునీకరిస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక సమగ్ర క్రీడా వేదిక ఉండాలనేది ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా సామగ్రి అందజేత, శిక్షణా కార్యక్రమాల ద్వారా దాగిఉన్న ప్రతిభను వెలికితీస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో వ్యాయామాన్ని తప్పనిసరి చేస్తూ శారీరక దృఢత్వంపై ప్రత్యేక దృష్టి సారించారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# మెరుగైన ప్రణాళికలకు జనగణనే ఆధారం

*సమాజంలోని ప్రతివర్గం ఈప్రక్రియలో భాగస్వాములై,సరైన సమాచారాన్ని అందించినప్పుడే దేశాభివృద్ధి ఫలాలు అట్టడుగు స్థాయి వరకు చేరుతాయి. వనరుల కేటాయింపులో హేతుబద్ధత రావాలన్నా, విద్య, వైద్యం, ఉపాధి వంటి రంగాల్లో మెరుగైన ప్రణాళికలు రూపొందించాలన్నా ఈ గణాంకాలే ప్రాణాధారం. 2027 జనగణన కేవలం సంఖ్యల గణనకాదు, అది భారతదేశ భవిష్యత్ ప్రగతికి వేస్తున్న ఒక శాస్త్రీయ పునాది. ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి, ఈ డిజిటల్ యజ్ఞంలో పాలుపంచుకోవడం ద్వారా దేశా భివృద్ధికి తోడ్పడాలి. అప్పుడే మనం కలలు గనే 'వికసిత్ భారత్' సాకారం అవుతుంది.*

రామ కిష్టయ్య సంగన భట్ల

భారతదేశ పరిపాలనా ముఖచిత్రంలో జనగణన అనేది కేవలం అంకెల సమాహారం కాదు, అది ఒక దేశపు గతాన్ని విశ్లేషిస్తూ, వర్తమానాన్ని అంచనా వేస్తూ, భవిష్యత్తును నిర్మించే అత్యంత శక్తిమంతమైన శాస్త్రీయఆయుధం. ఒక దేశ ఆర్థిక పురోగతికి, సామాజిక న్యాయానికి, వనరుల సమతుల్య పంపిణీకి పునాదిగా నిలిచే ఈ ప్రక్రియ, మారుతున్న కాలంతో పాటు సాంకేతిక పరిమళాన్ని అద్దుకుంటూ సరికొత్త రూపును సంతరించుకుంటోంది. 1872లో ప్రయోగాత్మక పునాదులతో మొదలై, 1881 నుండి నేటి వరకు అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ వస్తున్న ఈ దశాబ్దాల సంప్రదాయం, కోవిడ్19 మహమ్మారి సృష్టించిన అనూహ్యవిరామం తర్వాత 2027లో సరికొత్త డిజిటల్ అధ్యాయాన్ని ప్రారంభించబోతోంది. ఈ నేపథ్యంలో, 2027జనగణన అనేది భారత ప్రజాస్వామ్యవ్యవస్థలో ఒక విప్లవాత్మక మలుపుగా, దేశాభివృద్ధికి దిక్సూచిగా నిలవనుంది. భారతదేశంలో జనగణన చరిత్రను అవలోకనం చేస్తే, బ్రిటీష్ పాలనా కాలంలో లార్డ్ మేయో హయాంలో 1872లో తొలి ప్రయత్నం జరగ్గా, డబ్ల్యూ.డబ్ల్యూ. హంటర్ నేతృత్వంలో 1881లో మొదటి సమగ్ర గణన నిర్వహించబడింది. నాటి నుండి నేటి వరకు యుద్ధాలు, కరవులు సంభవించినా ఆగని ఈ ప్రక్రియ, 2021లో మాత్రం కరోనా సెకండ్ వేవ్ తీవ్రత కారణంగా వాయిదా పడక తప్పలేదు. దాదాపు 150ఏళ్ల చరిత్రలో ఇలాంటి విరామం రావడం ఇదే తొలిసారి. అయితే, ఈ ఆలస్యం దేశ ప్రణాళికా రచనపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికీ 2011 గణాంకాలపైనే ఆధారపడి సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఈ సుమారు 15 ఏళ్ల అంతరంలో దేశ జనాభా నిర్మాణం, పట్టణీకరణ వేగం, అక్షరాస్యత నమూనాలు సమూలంగా మారిపోయాయి. అందువల్ల, 2027లో జరగబోయే గణన ఆ పాత వివరాలకు, నేటి వాస్తవాలకు మధ్య ఉన్న భారీ అంతరాన్ని పూరించే వారధిగా మారుతుంది. ఈసారి జరగనున్న గణనలో అత్యంత వినూత్నమైన, ప్రతిష్టాత్మకమైన అంశం స్వీయ గణన డిజిటల్ ఇండియా సఫలీకృతమవుతున్న తరుణంలో, పౌరులు తమ వివరాలను తామే నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించడం ఒక గొప్ప ప్రజాస్వామ్య సంస్కరణ. గతంలో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించేవారు. దీనివల్ల భాషా సమస్యలు, సమాచార సేకరణలో పొరపాట్లు, సమయభావంవంటి ఇబ్బందులు ఉండేవి. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ విప్లవం పుణ్యమా అని, ప్రభుత్వం కేటాయించిన పోర్టల్ ద్వారా ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల విద్య, వృత్తి, ఆదాయం, నివాస స్థితిగతులను పారదర్శకంగా నమోదు చేయవచ్చు. ఈ స్వీయ నమోదు ప్రక్రియను పూర్తి చేసి, పొందిన ప్రత్యేక ఐడీని భద్రపరుచుకోవడం ద్వారా, తర్వాత వచ్చే క్షేత్రస్థాయి సిబ్బందికి కేవలం ఆ సంఖ్యను చూపిస్తే సరిపోతుంది. ఇది దేశవ్యాప్తంగా లక్షలాది గంటల శ్రమను, కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఆదా చేయడమే కాకుండా, డేటా సేకరణలో ఖచ్చితత్వాన్ని గణనీయంగా పెంచుతుంది. గణాంకపరంగా చూస్తే, 2011లో భారత జనాభా 121.08 కోట్లుగా ఉండగా, ప్రస్తుత అంచనాల ప్రకారం అది 140 కోట్లు దాటి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ అవతరించింది. 2011లో అక్షరాస్యత 74.04శాతంఉండగా, నేడు అది 80శాతానికి పైగా చేరుకున్నట్లు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా స్త్రీ, పురుష నిష్పత్తిలో వస్తున్న మార్పులు, గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు జరుగుతున్న భారీ వలసలు, పెరుగుతున్న మధ్యతరగతి జనాభా వంటి అంశాలు 2027 గణన



ద్వారా స్పష్టమవుతాయి. ఈ డేటా లేకపోవడం వల్ల నేడు రేషన్ కార్డుల కేటాయింపు, గృహనిర్మాణ పథకాలు, నియోజక వర్గాల పునర్విభజన వంటి కీలక అంశాల్లో కొంత అనిశ్చితి నెలకొంది. 2027 గణాంకాలు వెలువడిన వెంటనే, 2029 తర్వాత జరగబోయే పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్వి భజనకు ఇది ప్రాతిపదికగా మారుతుంది. తద్వారా రాజ కీయ ప్రాతినిధ్యంలో సమతుల్యత ఏర్పడుతుంది. సాంకేతిక తతో కూడిన ఈ ప్రయాణంలో సవాళ్లు కూడా అదే స్థాయి లో ఉన్నాయి. భారతదేశం లాంటి భిన్నత్వంతో కూడిన దేశంలో డిజిటల్ విభజన ఒక ప్రధాన సమస్య. పట్టణాల్లో స్మార్ట్‌ఫోన్ వినియోగం అధికంగా ఉన్నప్పటికీ, మారుమూల గిరిజన ప్రాంతాల్లో, వెనుకబడిన గ్రామాల్లో ఇంటర్నెట్ లభ్యత, సాంకేతిక అవగాహన తక్కువ. వృద్ధులు, చదువు కోని వారు స్వీయ గణనలో పాల్గొనడం కష్టతరం కావచ్చు. ఇక్కడే ఎన్యూమరేటర్ల పాత్ర కీలకం కానుంది. స్వీయగణన అనేది సంప్రదాయ పద్ధతిని పూర్తిగా తొలగించదు, కానీ దానిని సులభతరం చేస్తుంది. ఎవరైతే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేరో, వారి వద్దకు సిబ్బంది నేరుగా వెళ్లి వివరాలు సేకరిస్తారు. అలాగే, సేకరించిన డేటా భద్రత గోప్యత విష యంలో ప్రజల్లోఉన్న ఆందోళనలను ప్రభుత్వం పటిష్టమైన సైబర్ భద్రతా చర్యల ద్వారా తొలగించాల్సి ఉంటుంది. మరోవైపు, వర్తమాన రాజకీయ సామాజిక కోణంలో కులగణన డిమాండ్ ఈసారి జనగణనకు మరింత ప్రాధాన్య తను తెచ్చిపెట్టింది. దేశంలోని ఓబీసీలు, ఇతర సామాజికవర్గాల వాస్తవ సంఖ్యను తెలుసుకోవడం ద్వారానే జనాభా ప్రాతిపదికన వాటా సాధ్యమని ఒక వర్గం వాదిస్తోంది. స్వతంత్ర భారత చరిత్రలో 1951 నుండి ఇప్పటివరకు కేవలం ఎస్సీ, ఎస్టీల గణాంకాలను మాత్రమే సేకరిస్తున్నారు. ఈసారి కులగణనను కూడా చేర్చాలన్న డిమాండ్‌పై కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం దేశ సామాజిక గమనాన్ని మార్చివేస్తుంది. వనరుల పంపిణీలో అర్హులైన వారికి ప్రాధాన్యత దక్కాలంటే ఖచ్చితమైన కుల ఆర్థిక గణాంకాలు అవసరమని విశ్లేషకులు భావిస్తున్నారు. జనగణన అనేది కేవలం ప్రభుత్వానికి సంబంధించిన విషయం కాదు, అది ప్రతి పౌరుడి బాధ్యత. మనం ఇచ్చే ప్రతి చిన్న సమాచారం ఒక పెద్ద జాతీయ విధానానికి రూపకల్పన చేస్తుంది. 2027 జనగణన ద్వారా లభించే డేటా, భారతదేశం 2047నాటికి వికసిత్ భారత్‌గా ఎదగాలన్న లక్ష్యానికి ఇంధనంగా పనిచేస్తుంది. పౌరులు తమ వివరాలను సులభంగా నమోదు చేసుకునేందుకుప్రభుత్వం రూపొందించిన ప్రక్రియ అత్యంత సరళంగా, పారదర్శకంగా ఉంది. ఈ ప్రక్రియ అంతటితో ముగిసిపోదు. ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో మీ ఇంటికి వచ్చినప్పుడు, మీరు ఆన్‌లైన్‌లో పొందిన ఎస్ఈ ఐడీని వారికి చూపించాలి. వారు తమ వద్ద ఉన్నడిజిటల్ పరికరాల్లో ఆ ఐడీని నమోదు చేయగానే మీరు ఇచ్చిన వివరాలు కనిపిస్తాయి. మీరు తెలిపిన సమాచారం, వారు ప్రత్యక్షంగా గమనించిన అంశాలు సరిపోలితే ప్రక్రియ ముగుస్తుం ది. ఒకవేళ ఏవైనా పొరపాట్లు ఉన్నా లేదా డేటా మ్యాచ్ కాకపోయినా, వారు తిరిగి కొత్తగా వివరాలను నమోదు చేసే అవకాశం ఉంటుంది. ఈ ద్విముఖ ధృవీకరణ పద్ధతి వల్ల సమాచారంలో తప్పులుదొర్లే అవకాశం ఉండదు. స్వీయ గణనద్వారా పారదర్శకతను పెంచుతూ, సాంకేతికతను జోడిస్తూ నిర్వహిస్తున్న ఈ మహాక్రతువు, భారతపరిపాలనా వ్యవస్థలో ఒక నూతన శకాన్ని ఆవిష్కరిస్తుంది. సమాజంలోని ప్రతివర్గం ఈప్రక్రియలో భాగస్వాములై, సరైన సమాచారాన్ని అందించినప్పుడే దేశాభివృద్ధి ఫలాలు అట్టడుగు స్థాయివరకు చేరుతాయి. వనరుల కేటాయింపులో హేతుబద్ధత రావాలన్నా, విద్య, వైద్యం, ఉపాధి వంటి రంగాల్లో మెరుగైన ప్రణాళికలు రూపొందించాలన్నా ఈ గణాంకాలే ప్రాణాధారం. 2027జనగణన కేవలం సంఖ్యల గణనకాదు, అది భారతదేశ భవిష్యత్ ప్రగతికి వేస్తున్న ఒకశాస్త్రీయ పునాది. ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి, ఈ డిజిటల్ యజ్ఞంలో పాలుపంచుకోవడం ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడాలి. అప్పుడే మనం కలలుగనే 'వికసిత్ భారత్' సాకారం అవుతుంది. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ప్రక్రియ, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని పౌరుడిని నేరుగా భాగస్వామిని చేయడం ఒక గొప్పప్రజాస్వామ్య విజయం. ఈచారిత్రాత్మక మార్పుకు సాక్ష్యంగా నిలవడమే కాకుండా, సకల సమాచారాన్ని సద్వినియోగం చేసుకుని ప్రగతి పథంలో పయనించాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉంది. ●

# సూపర్ ఎల్‌నినోతో దహిస్తున్న దక్షిణ భారతం

టి. శ్రీనివాస్

ప్రపంచ వాతావరణ వ్యవస్థలో జరుగుతున్న మార్పులు ఇప్పుడు కేవలం శాస్త్రీయ చర్చల స్థాయిలో మాత్రమే కాకుండా సాధారణ ప్రజల జీవితాల్లో కూడా ప్రత్యక్ష ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ముఖ్యంగా సూపర్ ఎల్‌నినో అనే వాతావరణ పరిస్థితి ఈసారి దక్షిణ భారతదేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండల తీవ్రత సాధారణ స్థాయిని దాటి, ప్రజల దైనందిన జీవితాన్ని కష్టతరం చేస్తోంది. ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరగడం, వర్షపాతం తగ్గిపోవడం, గాలిలో తేమ శాతం తగ్గడం వంటి పరిణామాలు ఒకేసారి కనిపిస్తున్నాయి. ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో నీటి ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి మించి పెరగడం వల్ల ఏర్పడే వాతావరణ అసమతుల్యత. ఇది ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం నమూనాలను ప్రభావితం చేస్తుంది. భారత్ వంటి వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఇది సాధారణంగా వర్షాభావ పరిస్థితులకు దారితీస్తుంది. ఈసారి 'సూపర్ ఎల్‌నినో'గా పిలవబడుతున్న స్థితి మరింత తీవ్రమైనదిగా భావిస్తున్నారు. సాధారణ ఎల్‌నినో కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు, దీర్ఘకాలిక ఎండలు, తక్కువ వర్షాలు ఈ పరిస్థితి ప్రత్యేక లక్షణాలు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. అనేక జిల్లాల్లో 43నుండి 46డిగ్రీలసెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మధ్యాహ్న సమయంలో బయటకు రావడం ప్రమాదకరంగా మారుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రతరం అవుతోంది. భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోవడం వల్ల బోర్లు ఎండిపోతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో కూడా వేడి గాలులు ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. హీట్ స్ట్రోక్ కేసులు పెరుగుతుండటం ఆసుపత్రులపై అదనపు ఒత్తిడిని సృష్టిస్తోంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, బయట పనిచేసే కార్మికులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. ఈ పరిస్థితి అత్యంత తీవ్రంగా ప్రభావితం చేస్తున్న రంగం వ్యవసాయం. ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే వర్షాలు ఆలస్యమవడం లేదా అసమానంగా పడటం వల్ల రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పంటలకు అవసరమైన నీరు సరిపడకపోవడంతో వరి, పత్తి, మొక్కజొన్న వంటి ప్రధాన పంటలసాగు కష్టతరంగా మారుతోంది. కొన్నిప్రాంతాల్లో విత్తనాలు మొలక దశలోనే ఎండిపోతున్నాయి. మరికొన్నిచోట్ల పూతరాకపోవడం లేదాపూత రాలిపోవడం వల్ల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా పంటల వృద్ధి మందగించడం కూడా గమనించవచ్చు. భూగర్భజలాలు తగ్గిపోవడం రైతులకు మరింత భారంగా మారింది. బోర్లపై ఆధారపడిన వ్యవసాయం ఖర్చును పెంచుతోంది. డీజిల్ మోటార్ల వినియోగం పెరగడంతో ఉత్పత్తివ్యయం అధికమవుతోంది. ఇదే సమయంలో పశుసంపద కూడా తీవ్రంగా ప్రభావితమవుతోంది. తగినంత నీరు, మేత అందక పాల ఉత్పత్తి తగ్గుతోంది. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై మరింత ఒత్తిడిని కలిగిస్తోంది. ప్రస్తుతపరిస్థితులు కొనసాగితే పంట దిగుబడిపై గణనీయమైన ప్రభావం పడే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వరి ఉత్పత్తి తగ్గితే ఆహార భద్రతపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. పత్తి, కందులు వంటి వాణిజ్య పంటలు కూడా నష్టపోవచ్చు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో రైతులు పంటలను తిరిగి విత్తాల్సిన పరిస్థితి రావడం వారి ఆర్థిక భారాన్ని పెంచుతోంది. పెట్టుబడి ఖర్చులు పెరిగి, దిగుబడి తగ్గితే రైతులు అప్పుల ఊబిలో పడే ప్రమాదం మరింత పెరుగుతుంది. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు తక్షణ, దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నీటి సంరక్షణ కార్యక్రమాలు బలోపేతం చేయడం, సూక్ష్మ సేద్య పద్ధతులను ప్రోత్సహించడం, వాతావరణ ఆధారిత పంట ప్రణాళికలు అమలుచేయడం వంటి చర్యలుఅత్యంత కీలకం. రైతులకు సమయానుకూల వాతావరణ సమాచారం అందించడం, పంటల బీమా సదుపాయాలను సులభతరం చేయడం కూడా అవసరం. నీటి కొరత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచడం తక్షణ అవసరంగా మారింది. ●

# ఏఐ విజృంభిస్తున్న వేళ.. ఉద్యోగాల దిశ ఎటు?

తరిగోపుల నారాయణస్వామి

ప్రపంచం ఒక గొప్ప మార్పు దశలో నిలిచింది. ఒకప్పుడు యంత్రాలు మనిషి శారీరక శ్రమను తగ్గించాయి. నేడు కృత్రిమ మేధస్సు, అనగా ఏఐ, మనిషి మేధో శక్తిని కూడా ప్రభావితం చేసే స్థాయికి ఎదిగింది. కంప్యూటర్ ముందు గంటల తరబడి చేసే అనేక పనులను కొన్ని క్షణాల్లో పూర్తి చేయగల సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా అనేక పేరొందిన సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉద్యోగులను తగ్గిస్తున్నాయి. వేలాది మంది ఉద్యోగాలు కోల్పోతున్న వార్తలు యువతలో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇక భవిష్యత్తులో ఉద్యోగాలు ఉంటాయా? అనే సందేహం విద్యార్థి నుంచి ఉద్యోగి వరకు ప్రతి ఒక్కరి మనసులో మొదలవుతోంది. అయితే చరిత్రను పరిశీలిస్తే ప్రతి సాంకేతిక విప్లవం తొలుత భయాన్ని కలిగించినా, చివరికి కొత్త అవకాశాలకు దారి తీసినదే. ఆవిరి యంత్రం వచ్చినప్పుడు చేతిపనులు అంతరించిపోతాయని భావించారు. కంప్యూటర్లు వచ్చినప్పుడు కార్యాలయ ఉద్యోగాలు పోతాయని అనుకున్నారు. కానీ ప్రతి మార్పు కొత్త నైపుణ్యాలకు, కొత్త రంగాలకు, కొత్త ఉపాధి మార్గాలకు ద్వారాలు తెరిచింది. ఇదే సత్యం ఏఐ విషయంలోనూ వర్తిస్తుంది. కాబట్టి యువత భయపడాల్సిన అవసరం లేదు. మార్పును అర్థం చేసుకుని దానికి తగ్గట్టు సిద్ధంకావాలి. ఏ సాంకేతికత వచ్చినప్పటికీ కొన్ని రంగాలు ఎప్పటికీ మానవ ఆధారంగానే ఉంటాయి. ఆరోగ్య రంగం అందులో ప్రధానం. వైద్యులు, నర్సులు, ఫిజియోథెరపిస్టులు, మానసిక ఆరోగ్య నిపుణులు, అత్యవసర సేవల సిబ్బంది వంటి వృత్తులు ఎప్పటికీ అవసరమే. యంత్రం పరీక్షా ఫలితాలు చెప్పగలదు కానీ రోగి బాధను అర్థం చేసుకుని ధైర్యం చెప్పేది మనిషే. అందువల్ల ఆరోగ్య రంగంలో అవకాశాలు ఎప్పటికీ నిలకడగాఉంటాయి. విద్యా రంగం కూడా మానవ స్పర్శను కోల్పోదు. ఉపాధ్యాయుడు కేవలం పాఠ్యాంశాన్ని బోధించేవాడు కాదు, విద్యార్థిలో ఆత్మవిశ్వాసం నింపేవాడు, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేవాడు. ఏఐ పాఠాలు చెప్పగలదు కానీ విలువలు నేర్పలేదు. గురువు చూపే మార్గదర్శకత్వం, ప్రేరణ, సహనం యంత్రం ద్వారా భర్తీ కావు. అందుకే మంచి ఉపాధ్యాయులకు భవిష్యత్తులో మరింత గౌరవం, మరింత డిమాండ్ ఉంటుంది. వ్యవసాయం ఆహార రంగం ఎప్పటికీ జీవనాధారం. అన్నంలేకుండా ఏ సమాజమూ నిలబడదు. ఆధునిక వ్యవసాయపద్ధతులు, ఆర్గానిక్ ఫార్మింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజ్, మార్కెటింగ్, వ్యవసాయ సలహా సేవలు వంటి రంగాల్లో విస్తారమైన అవకాశాలున్నాయి. గ్రామీణ యువత వ్యవసాయాన్ని సాంకేతికతతో మేళవిస్తే స్వయం ఉపాధి సాధించవచ్చు. నిర్మాణ రంగం, మౌలిక వసతుల రంగం కూడా ఎప్పటికీ కొనసాగుతాయి. ఇండ్లు, రహదారులు, వంతెనలు, విద్యుత్



వ్యవస్థలు, నీటి ప్రాజెక్టులు, పట్టణాభివృద్ధి పనులు నిరంతరం అవసరం. సివిల్ ఇంజినీర్లు, ఎలక్ట్రికల్ నిపుణులు, మెకానికల్ సిబ్బంది, టెక్నీషియన్లకు ఎల్లప్పుడూ డిమాండ్ ఉంటుంది. సేవారంగం మరో ముఖ్యమైన ఉపాధి ఆధారం. బ్యాంకింగ్, హోటళ్లు, పర్యాటకం, రవాణా, కస్టమర్‌సపోర్ట్, లాజిస్టిక్స్ రంగాల్లో మానవ సంబంధాలు కీలకం. వినియోగదారుడి అవసరాన్ని అర్థం చేసుకోవడం, సమస్యను ఓర్పుతో పరిష్కరించడం, విశ్వాసాన్ని కలిగించడం వంటి అంశాలు మానవ నైపుణ్యాలే. అందువల్ల ఈరంగాల్లో ఉద్యోగాలు కొనసాగుతూనే ఉంటాయి. సృజనాత్మక రంగాలు భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం పొందుతాయి. రచయితలు, జర్నలిస్టులు, కళాకారులు, సంగీతకారులు, డిజైనర్లు, సినీ రంగ నిపుణులు, ప్రకటన రంగ సృజనకర్తలు వంటి వారికి కొత్త అవకాశాలు ఏర్పడతాయి. యంత్రం సమాచారం సమకూర్చగలదు కానీ హృదయాన్ని తాకే సృజన మనిషి నుంచే పుడుతుంది. అదే సమయంలో ఏఐ పెరుగుతున్న కొద్దీ దానిని నిర్వహించే ఉద్యోగాలు కూడా పెరుగుతాయి. డేటా విశ్లేషకులు, సైబర్ భద్రత నిపుణులు, రోబోటిక్స్ ఇంజినీర్లు, ఏఐ ట్రైనర్లు, డిజిటల్ నైతికత నిపుణులు వంటి కొత్త వృత్తులు అభివృద్ధి చెందుతాయి. కాబట్టి సాంకేతికత ఉద్యోగాలను పూర్తిగా తొలగించదు. వాటి స్వరూపాన్ని మాత్రమే మార్చుతుంది. యువత ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి. డిగ్రీ ఒక్కటే భవిష్యత్తుకుసరిపోదు. నేర్చుకోవాలనే తపన, కొత్త నైపుణ్యాలు సంపాదించే అలవాటు, కమ్యూనికేషన్ నైపుణ్యం, సమస్య పరిష్కార దృక్పథం, సృజనాత్మక ఆలోచన ఇవే రేపటి ప్రపంచంలో విజయానికి పునాది. ఒకే ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి, స్టార్టప్‌లు, డిజిటల్ సేవలు, ఫ్రీలాన్సింగ్, గ్రామీణ పరిశ్రమలు వంటి మార్గాలను పరిశీలించాలి. ప్రభుత్వాలు, విద్యాసంస్థలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. పాత సిలబస్‌తో కొత్త ప్రపంచానికి యువతను సిద్ధం చేయలేం. పరిశ్రమలకు అనుగుణమైన కోర్సులు, నైపుణ్య శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, ఉపాధి మార్గదర్శక కేంద్రాలు, గ్రామీణ యువతకు సాంకేతిక శిక్షణ వంటి కార్యక్రమాలు అత్యవసరం. విద్య ఉద్యోగానికి దారి చూపాలి గాని కేవలం సర్టిఫికెట్‌కే పరిమితం కాకూడదు. సమాజం మొత్తం కూడా ఉద్యోగాన్ని కేవలం జీతంతో కొలవకూడదు. ఉద్యోగం అంటే గౌరవం, కుటుంబ భరోసా, ఆత్మవిశ్వాసం, దేశఆర్థికాభి వృద్ధికిపునాది. కాబట్టి సాంకేతికత మనిషికి తోడ్పడాలిగాని మనిషిని పక్కన పెట్టకూడదు. మానవ సంక్షేమం ప్రధానలక్ష్యంగా ఉండాలి. ఏఐ యుగం వచ్చింది. కానీ మానవ విలువల యుగం ఎప్పటికీ ముగియదు. యంత్రం వేగంగా పని చేస్తుంది. మనిషి అర్థవంతంగా పనిచేస్తాడు. మార్పును స్వాగతించి, నైపుణ్యాన్ని ఆయుధంగా చేసుకుని ముందుకు సాగే యువతే రేపటి భారతదేశాన్ని నిర్మిస్తుంది. భవిష్యత్తు ఉద్యోగాలు అంతరించవు. అవి రూపం మార్చుకుంటాయి. ఆ రూపాన్ని గుర్తించి అందిపుచ్చుకోవడం మన చేతుల్లోనే ఉంది. ●

గుంటూరు వార్త

# ఇంధనాన్ని బ్లాక్‌లో అమ్మితే క్రిమినల్ చర్యలు

## జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ



**గుంటూరు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంధనాన్ని బ్లాక్‌లో అమ్మడానికి ప్రయత్నిస్తే, క్రిమినల్ చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని సోషల్ మీడియాలో వచ్చిన వదంతులను నమ్మి జిల్లాలో పెట్రోల్ డీజిల్ కొరత ఉందని భావించి అవసరానికి మించి ఇంధనము కొనుగోలు చేశారని తెలిపారు. తద్వారా కొన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధనము నిల్వలు పడిపోయాయన్నారు. గుంటూరు జిల్లా మొత్తంలో 195 పెట్రోల్ బంకులు ఉన్నాయని, గత వారంలో రోజువారి అమ్మకాలకు మించి రెండింతలు అదనంగా వినియోగదారులు కొనుగోలు చేశారని అన్నారు. చాలా బంకుల్లో పూర్తిగా డీజిల్ నిల్వలు డ్రై అవుట్ స్టేజ్ కు వచ్చాయన్నారు. ఆసాధారణ అమ్మకాల వలన ఏర్పడిన పరిస్థితుల దృష్ట్యా ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో చర్చించి దిద్దుబాటు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. గత మూడు రోజులుగా కొండపల్లి ప్లాంట్ లోని ఐ ఓ సి ఎల్, బిపిసి ఎల్ అధికారులతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన పెట్రోల్ , డీజిల్ ట్యాంకర్లను రాత్రి సమయంలో కూడా రవాణా సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని నియోజకవర్గ ప్రత్యేక అధికారులకు, మండల ప్రత్యేక అధికారులకు, మండల తహసిల్దార్లకు, పెట్రోల్ బంకుల నిరంతర పర్యవేక్షణ బాధ్యతను అప్పగించడం జరిగిందని చెప్పారు. >> 11

# ఇంధన కంపెనీల సిబ్బందితో జేసీ భేటీ

**గుంటూరు ఏప్రిల్ 28, ప్రభాతవార్త ప్రతినిధి :** హెచ్.పి.సి.ఎల్, ఐ.ఓ.సి.ఎల్, బి.పి.సి.ఎల్ కంపెనీల సిబ్బందితో గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మంగళవారం భేటీ




అయ్యారు. కొండపల్లి ఇంధన నిల్వల ప్రదేశాన్ని జాయింట్ కలెక్టర్ సందర్శించారు. ఇంధన నిల్వలు అందుబాటు పరిస్థితి ఆరా తీసారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 195 బంకులలో ఇంధనం అందుబాటులో ఉందని, ఎక్కడా ఇంధనం లేని బంకులు లేవని స్పష్టం చేశారు. జిల్లాలో ఇంధన నిల్వలు సరిపడా ఉన్నాయని, ఎటువంటి ఆందోళన అవసరం లేదని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రజలకు అవసరమైన మేరకు ఇంధన సరఫరా నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు అపోహలకు ల ో న ు ు స ా వ కంపెనీల అధికారులు పాల్గొన్నారు.

# మసాజ్ ముసుగులో వ్యభిచారం

**గుంటూరు ఏప్రిల్ 28 ప్రభాతవార్త ప్రతినిధి :** మసాజ్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను గుంటూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం గుంటూరులోని నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని నగరాలులో లోటస్ సెలూన్ అండ్ స్పా సెంటర్ పై ఎస్పీ స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందం దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో మసాజ్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న లోటస్ సెలూన్ అండ్ స్పా సిబ్బందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో మసాజ్ సెంటర్ నిర్వాహకుడు శ్రీకాకుళం జిల్లాకు చెందిన మోకాళ్ళ వంశీగా గుర్తించారు. ఆర్గనైజర్ వంశీతోపాటు మరో వ్యక్తిని, ముగ్గురు మహిళలను నల్లపాడు పోలీస్టేషన్ కు తరలించి పోలీసులు విచారణ చేస్తున్నారు.



# నూతిబావిలో పడ్డ చుక్కల జింక..రక్షించిన అధికారులు



**క్రోసూరు,ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** గ్రామ శివారులో దారి తప్పి పొలాల్లో ఉన్న నూతి బావి లో పడిన చుక్కల జింకను ఎర్రబాలెం గ్రామ స్థానికులు గుర్తించారు. క్రోసూరు పోలీసులు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని జింకను బావి నుండి బయటకు తీశారు. పిడుగురాళ్ల ఫారెస్ట్ ఆఫీసర్ కె. నరసింహారెడ్డి సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని చుక్కల జింకను తీసుకెళ్లి అటవీ ప్రాంతంలో వదిలేశారు.

# పల్నాడు జిల్లాలో ఇంధన కొరతకు తెర

**గత రెండు రోజులుగా పల్నాడులో కలెక్టర్, జేసీ సుడిగాలి పర్యటనలు**

**3పెట్రోల్ బంకులను సీజ్ చేసిన జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా**

**రొంపిచెర్లలో మరో బంకును సీజ్ చేసిన జేసీ సంజన సింహా**

**నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలతో జిల్లా అధికారుల చర్యలు**

**గుంటూరు ఏప్రిల్ 28 ప్రభాతవార్త ప్రతినిధి :** పల్నాడు జిల్లా అధికారులు తీసుకున్న పటిష్టమైన చర్యలతో జిల్లాలో డీజిల్ కొరత సమస్యకు తెరపడింది. గత రెండు రోజులుగా జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా , జాయింట్ కలెక్టర్ సంజన సింహా డీజిల్ కొరత సమస్యను పరిష్కరించేందుకు పెట్రోల్ బంకుల్లో ఆకస్మికంగా తనిఖీలు చేస్తూ పల్నాడు వ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చేశారు. ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా ఇంధన అమ్మకాలు చేపడుతున్న నరసరావు పేటలోని శ్రీనిధి ఫిల్లింగ్ స్టేషన్, పిడుగురాళ్లలో తిరుమల ఫిల్లింగ్ స్టేషన్,చిలకలూరిపేటలోని జనతా ఫిల్లింగ్ స్టేషన్ లను కలెక్టర్ సీజ్ చేశారు. అదేవిధంగా నకరికల్లు అడ్డరోడ్డులో హెచ్ పి పెట్రోల్ బంకు, పిడుగురాళ్ల మండలం కొండమోడు గ్రామంలో భారత్ పెట్రోలియం బంకు, పిడుగురాళ్లలో ఇండియన్ ఆయిల్ బంకు, నడికుడి మాచర్ల క్రాస్ రోడ్డులోని హెచ్ పి పెట్రోల్ బంకులను జిల్లా కలెక్టర్ తనిఖీలు చేశారు. బంకు యజమానులతో మాట్లాడి వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్ అందించాలన్నారు. డీజిల్ నిల్వలు, సరఫరా, రికార్డులను పరిశీలించారు. పెట్రోల్ బంకుల్లో స్వయంగా వాహనాలకు కలెక్టర్ పెట్రోల్ నింపారు. నరసరావుపేటలోని కైలాష్ ఫ్యూయల్ ఫిల్లింగ్ స్టేషన్, యోగానంద లక్ష్మి నరసింహ ఫిల్లింగ్ స్టేషన్ ,శ్రీదత్త పెట్రోల్ బంకు, తిరుమల ఫిల్లింగ్ స్టేషన్ లను జాయింట్ కలెక్టర్ సంజన సింహా ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ క్రమంలో రొంపిచెర్లలోని గాయత్రి పెట్రోల్ బంకును తనిఖీ చేసిన జేసీ.. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేపడుతున్న వెంకట మురళీధర ఫిల్లింగ్ స్టేషన్ ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు మాట్లాడుతూ ఇంధన కృత్రిమ కొరత సృష్టించినా , అక్రమ వ్యాపారానికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఇంధన సరఫరాలో సమస్యలు ఉంటే ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని స్పష్టం చేశారు.జిల్లా అధికారులు తీసుకున్న చర్యలతో పల్నాడులో ఇంధన పంపిణీ సాధారణ స్థితికి చేరుకుంది. డీజిల్ నిల్వలు లేని బంకులను, నిల్వలు పూర్తిఅయ్యే బంకులను ముందుగానే గుర్తించి యుద్ధప్రాతిపదికన తీసుకున్న చర్యల ఫలితంగా మంగళవారం ఉదయం నుండి జిల్లాలోని పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులు రద్దీ తగ్గుముఖం పట్టింది. జిల్లావ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో డీజిల్ నిల్వలు సాధారణ అవసరాలకు సరిపడా ఉన్న కారణంగా ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

# చంద్రబాబుకు మద్దతుగా గిరిజనులు

## రాజధానిలో గిరిజనుల ఆత్మీయ సమ్మేళనం

**గుంటూరు ఏప్రిల్ 28 ప్రభాతవార్త ప్రతినిధి :**

రాష్ట్ర రాజధాని ప్రాంతంలోని తుళ్ళూరు మండలం మందడం సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన గిరిజన సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర గిరిజనుల ఆత్మీయ సమావేశం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు డాక్టర్ కొండారెడ్డి నరహరి వరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని గిరిజనులు చంద్రబాబుకు మద్దతుగా ఉన్నారని అన్నారు. రాజధాని అమరావతి కావాలని గిరిజనులు



కొరుకున్నారని ..అ ఆకాంక్షను ముఖ్యమంత్రి చంద్రబాబు నేరవేర్చారని అన్నారు. టిడిపి జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ గా నారా లోకేష్ ను నియామించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అమరావతి ఐక్య కార్యచరణ సమితి నాయకులు పువ్వాడ సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన గిరిజనులు రాజధాని అమరావతిలో గిరిజనుల సమ్మేళనం నిర్వహించటం అభినందనీయం అన్నారు. అమరావతికి మద్దతుగా

## అమరావతి రైతులకు ఘన సన్మానం

గిరిజనులు నిలవటం పట్ల వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

టిడిపి జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్‌గా నారా లోకేష్ నియమితులు కావటం గిరిజన వర్గాలలో సంతోషం వ్యక్తం అవుతుందన్నారు. బుధవారం నారా లోకేష్ ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా అభినందనలు తెలుపుతూ గిరిజన నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజధాని అమరావతి నిర్మాణానికి భూములు ఇచ్చిన 100 మంది రైతులుకు గిరిజన సంఘ నాయకులు, శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. అమరావతి దళిత జెఎసి నాయకురాలు అంకం



సువర్ణకుమారి, బండ్లమూడి ప్రియాంక, గిరిజన సలహామండలి సభ్యులు సోమ్లా నాయక్, రావులు కొండలు, గిరిజన కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు భీమ్లా నాయక్, నాగరాజు, నలగొండ్ల శ్రీనివాస్, రాష్ట్ర గిరిజన ఆత్మీయ సమావేశ నిర్వాహకులు తోకల నాగభూషణం, దేవరకొండ శంకరరావు, మేడా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 195 బంకుల్లో ఇంధనం అందుబాటులో ఉంది

**-జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ**

**మంగళగిరి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** జిల్లాలో డ్రైడ్ అవుట్ బంకులు లేవని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. మంగళవారం రాత్రి మంగళగిరిలో పలు పెట్రోల్ బంకులను జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్



మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 195 బంకులలో ఇంధనం అందుబాటులో ఉందని, ఎక్కడా డ్రైడ్ అవుట్ (ఇంధనం లేని) బంకులు లేవని స్పష్టం చేశారు. హెచ్.పి.సి.ఎల్, ఐ.ఓ.సి.ఎల్, బి.పి.సి.ఎల్ కంపెనీల అధికారులతో చర్చించామని, ఎటువంటి సమస్య ఉండదని అన్నారు. కొండపల్లి ఇంధన నిల్వల ప్రదేశాన్ని సందర్శించామని, ఇంధన నిల్వలు అందుబాటు పరిస్థితి ఆరా తీసామన్నారు. ఇంధన నిల్వలు సరిపడా ఉన్నాయని, ఎటువంటి ఆందోళన అవసరం లేదని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రజలకు అవసరమైన మేరకు ఇంధన సరఫరా నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# ప్రమాదకర గ్యాంగ్ అరెస్టు!

## బాపట్ల పోలీసుల షార్ప్ఆపరేషన్..

**త్రీడీ టెక్నాలజీ, సాంకేతిక ఆధారాలతో నిందితుల వేట**

**దక్షిణాది రాష్ట్రాల్లో 18 నేరాలకు పాల్పడిన కిలాడీలు**

**30.88 లక్షల విలువైన సొత్తు స్వాధీనం**

**బాపట్ల,ఏప్రిల్ 28,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వరుస దోపిడీలు, దాడుల కేసులో బాపట్ల జిల్లా పోలీసులు భారీ విజయాన్ని అందుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అత్యంత ప్రమాదకరమైన ధార్ గ్యాంగ్‌ను పోలీసులు కట్టుదిట్టంగా పట్టుకున్నారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో



ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఈ కేసు వివరాలను వెల్లడించారు.గత జనవరి 27న చీరాల మండలం గాంధీనగర్ ఎంజీహెచ్ కాలనీలో జరిగిన దోపిడీ పోలీసులకు సవాల్‌గా మారిందన్నారు. నిందితులు ఒక ఇంట్లోకి చొరబడి ఏపీపీగా విధులు నిర్వహిస్తున్న మహిళపై, ఆమె సోదరుడిపై దాడి చేసి 64 గ్రాముల బంగారం అపహరించారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ, సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్, చీరాల డీఎస్పీ మోయిన్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ధార్ జిల్లా, గంధ్వాని తహసీల్‌కు చెందిన బిల్లు తెగ వారు నేరాలు చేయడమే వృత్తిగా ఎంచుకున్నారు. వీరు తమ తెగలో అత్యంత వైభవంగా జరుపుకునే బోగోరియా పండుగ ఖర్చుల కోసం విచ్చలవిడిగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు భురు మక్వానా, రమేష్ మాచర్, సంతోష్ భూరియాలను అరెస్ట్ చేయగా, వీరిలో గ్యాంగ్ లీడర్ భురు మక్వానాపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం గతంలోనే రివార్డు ప్రకటించడం గమనార్హం అన్నారు.

### 18 నేరాలు.. 30 లక్షల రికవరీ

నిందితులు ఆంధ్రప్రదేశ్ లోని బాపట్ల, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో పాటు కేరళ, కర్ణాటక, రాజస్థాన్ రాష్ట్రాల్లోనూ 18 చోట్ల నేరాలకు పాల్పడినట్లు అంగీకరించారు. వారి వద్ద నుండి:137 గ్రాముల బంగారం,1.5 కిలోల వెండి వస్తువులు,రూ. 5 లక్షల నగదు,4 ద్విచక్ర వాహనాలుస్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ. 30,88,700 ఉంటుందని ఎస్పీ తెలిపారు.,సీసీ కెమెరా ఫుటేజీలు, వేలిముద్రలు, ఐటీ కోర్ విభాగం అందించిన సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుల కదలికలను ఎప్పటికప్పుడు పసిగట్టి, చీరాల వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్ బృందం వీరిని అదుపులోకి తీసుకుంది. ఈ కీలక కేసును ఛేదించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, రివార్డులు ప్రకటించారు.

# నగరంలో అనధికార లేఅవుట్‌ల పై చర్యలు తీసుకోవాలి

## నగర కమిషనర్ కె.మయూర్ అశోక్

**గుంటూరు కార్పొరేషన్,ఏప్రిల్ 28,ప్రభాతవార్త :** గుంటూరు నగరంలో విస్తరణ పెండింగ్ లో ఉన్న రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేయడానికి ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. అలానే నగరంలో అనధికార లేఅవుట్ లపై చర్యలు తీసుకోవాలని సిటీ ప్లానర్ ను ఆదేశించారు. మంగళవారం రెడ్డిపాలెం, నందివెలుగు రోడ్, ఏటి



అగ్రహారం రోడ్ల విస్తరణ పనుల్లో పెండింగ్ పోర్షన్లు, వాసవి నగర్ లో అనుమతి కోసం దరఖాస్తు చేసిన లేఅవుట్, వివిధ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేసి సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పలు ప్రాంతాల్లో విస్తరణ ప్రారంభించిన రోడ్లలో కొన్ని అసంపూర్తిగా ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో స్థానికులతో చర్చించి విస్తరణ పనులు పూర్తి కావడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అసంపూర్తి రోడ్లతో ప్రజల రాకపోకలకు కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని తమకు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఎక్కడైనా కోర్ట్ కేసులు ఉంటే అందుకు తగిన విధంగా వారితో మాట్లాడి, కేసులో ఏమైనా తీర్పులు ఉన్నాయా అని పరిశీలించాలని ఏసిపీలను ఆదేశించారు. చాలా ప్రాంతాల్లో విస్తరణ జరిగినప్పటికీ విద్యుత్ స్తంభాలు షిఫ్ట్ చేయకపోవడం గమనించామని, వాటిని షిఫ్ట్ చేసేలా విద్యుత్ శాఖ వారితో సమన్వయం చేసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రెడ్డిపాలెం చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్దం చేయాలని ఈఈని ఆదేశించారు. పారిశుధ్య పనులు పిన్ పాయింట్ గా జరగాలని, రోడ్లు, డ్రైన్లలో వ్యర్ధాలు వేసే వారిపై భారీ అపరాధ రుసుం విధించాలని శానిటరీ ఇన్స్పెక్టర్లకు స్పష్టం చేశారు. వాసవి నగర్ లో లే అవుట్ ని పరిశీలించి, రోడ్ల వెడల్పు, డ్రైనేజి సిస్టం, రిజర్వ్ సైట్, మార్ట్ గేజ్ ఫ్లాట్ లను తనిఖీ చేసి, ప్రతి లే అవుట్ నిర్దేశిత నిబందనల మేరకే ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనధికార లేఅవుట్ లపై చర్యలు తీసుకోవాలని సిటి ప్లానర్ ని ఆదేశించారు. ఈ పర్యటనలో సిటి ప్లానర్ రాంబాబు, ఏసిపీ రెహ్మాన్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# భద్రతా చర్యల పై సమీక్ష సమావేశం

**గుంటూరు క్రైమ్,ఏప్రిల్28,ప్రభాతవార్త:** అమరావతి రాజధాని ప్రాంతంలోని తుళ్లూరు డిఎస్పీ కార్యాలయంలో గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులతో భద్రతా అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాజధాని ప్రాంతంలో అమలవుతున్న భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, రాత్రి వేళల్లో పెట్రోలింగ్, చెక్‌పోస్టుల పనితీరు, డ్రోన్ నిఘా తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో ప్రతి ముఖ్య ప్రాంతంలో సీసీ కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు.చెక్‌పోస్టుల వద్ద కఠిన తనిఖీలు నిర్వహించి వాహనాల పరిశీలనను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు.డ్రోన్ నిఘాను సమర్ధవంతంగా వినియోగించి సున్నిత ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను బలోపేతం చేయాలని, ముఖ్యంగా వేగ నియంత్రణ, హెల్మెట్,సీటుబెల్ట్ వినియోగంపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజలతో సమన్వయం పెంచుకొని అనుమానాస్పద కార్యకలాపాలపై తక్షణ సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.అమరావతి ప్రాంతంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల ద్వారా నిరంతర తనిఖీల నిర్వహణను పటిష్టం చేయాలని,భద్రతను మరింత బలోపేతం చేయడానికి సాంకేతిక పర్యవేక్షణకు ఉపయోగించుకోవాలన్నారు.అమరావతి వంటి సున్నితమైన రాజధాని ప్రాంతంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలను సహించబోమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (ఏఆర్) ఏ హనుమంతు,తుళ్లూరు డిఎస్పీ మురళీకృష్ణ,ఎస్బీ డిఎస్పీ అలహరి .శ్రీనివాస్,ఏఆర్ డిఎస్పీ సంకురయ్య,తుళ్లూరు సీఐ శ్రీనివాసరావు,తుళ్లూరు ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు,తాడేపల్లి సీఐ వీరేంద్రబాబు,మంగళగిరి రూరల్ సీఐ బ్రహ్మాం, ఆర్.ఐ (అడ్మిన్) శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పిడిఎస్ బియ్యం పట్టివేత



**కొల్లిపర, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** కొల్లిపర మండలంలోని అత్తోట గ్రామంలో ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యం నిల్వలు ఉన్నాయనే సమాచారం మేరకు కొల్లిపర ఎస్ఐ ఎన్‌సి ప్రసాద్ తన పోలీస్ సిబ్బందితో మంగళవారం రాత్రి విస్తృత తనిఖీలు నిర్వహించారు.దాసరి వెంకటరావుకు చెందిన 31 బస్తాల బియ్యాన్ని సీజ్ చేశారు.ఒక్కో బస్తాలో 50 కిలోల రేషన్ బియ్యం నింపి ఉన్నాయి.

1550 కిలోల బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎన్‌సి ప్రసాద్ వెల్లడించారు.

# భరోసా ఇస్తున్నాం..భయపడకండి

**మోతీలా నగర్ నిర్వాసితులకు అన్యాయం జరగనివ్వం**

**శాశ్వత ఇళ్ల కేటాయింపునకు చర్యలు తీసుకుంటాం**

**ఎమ్మెల్యే నసీర్**

**గుంటూరు, ఏప్రిల్ 28,ప్రభాతవార్త :** గుంటూరు నగరంలోని మూడు వంతెనలను నాలుగు వంతెనలుగా మార్చేందుకు రైల్వే అధికారులు తీసుకున్న నిర్ణయంలో భాగంగానే మోతీలాల్ నగర్ వాసుల ఇళ్లు ఖాళీ చేయించామని, వారందరికీ భరోసా ఇస్తున్నానని, భయపడాల్సిన అవసరం లేదని గుంటూరు



తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మోతిలాల్ నిర్వాసితులకు ముందుగా చెప్పిన విధంగా ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున స్థానిక తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మోతిలాల్ నగర వాసులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వబోనని స్పష్టం చేశారు. రైల్వే అధికారులు డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకునే క్రమంలో ముందుగానే వారితో మాట్లాడి ఇళ్ల కూల్చివేతను నిలిపివేశామని గుర్తు చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో, అభివృద్ధిలో భాగంగానే అధికారులు ముందడుగు వేశారన్నారు. ఇళ్లు ఖాళీ చేయించక ముందే చోడవరంలో 106 కుటుంబాలకు నివాసం కల్పించామని తెలిపారు. మోతిలాల్ నగరవాసుల్లో ఎక్కువ మంది కూలీలు కావడంతో తమకు ప్రయాణ ఖర్చులు భారంగా మారతాయనే ఉద్దేశంతో ప్రాంతానికి వెళ్లలేదన్నారు. ఈ క్రమంలో స్థానికంగానే అద్దెలకు నివాసాలు ఉంటున్నారని, వారందరికీ తాము అండగా నిలుస్తామని తెలిపారు. ఇదే సమయంలో కొర్నెపాడు ప్రాంతంలో వారికి కేటాయించిన ప్లాట్లలో ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, అవకాశం ఉన్నంత వరకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మరో ప్రాంతంలోనైనా ఇళ్ల సముదాయానికి ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. మోతిలాల్ నగర వాసులంతా తమ కుటుంబ సభ్యులతో సమానమని, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా కూటమి నాయకులంతా వెంట నిలుస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది**

వట్టిచెరుకూరు మండలం, ముట్లూరు గ్రామం, డోర్ నెంబర్ 14-150 కాపురస్తులు అల్లం మహాలక్ష్మి, భర్త అల్లం శ్రీనివాసరావు (లేట్) పేరుతో ఉన్న య.1.15సెంట్లకు చెందిన ఒరిజినల్ విక్రయ దస్తావేజు 1756/2020, ఎస్ఆర్ఓ చేబ్రోలు, మార్చి 20వ తేదీన ముట్లూరు నుండి చేబ్రోలుకు వెళుతుండగా పోయినావి. ఎక్కడ వెతికినా దొరకలేదు. డాక్యుమెంట్ దొరికిన వారు 98491 14705 సెల్ నెం.ను సంప్రదించగలరు.

## ఎమ్మెల్యే గళ్ళా మాధవిపై సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తి పై కఠిన చర్యలు తీసుకోవాలి : ఎస్సీ సెల్ నేతలు

**గుంటూరు, ఏప్రిల్ 28,ప్రభాతవార్త :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మరియు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి పై సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు



దర్శనపు యాకోబు, లామ్ వర్ధన్ రావు, గాడిదపాటి కోటేశ్వరరావు, సాల్మన్ రాజు, మల్లవరపు రవి కిరణ్ లు మంగళవారం నగరంపాలెం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ నాయకులు మాట్లాడుతూ ఇటీవల గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఒక ట్రాన్స్ జెండర్ వ్యక్తిని తమ పి ఏ గా నియమించుకోవడం పట్ల రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ నారా లోకేష్ గారు ఫేస్‌బుక్ వేదికగా అభినందనలు తెలియజేస్తూ పోస్టు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే ఆ పోస్టుపై కిషోర్ ఆశిష్ నల్ల ఆశిష్ అనే పేరుతో ఉన్న ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారిని అవమానించేలా, అసభ్య పదజాలంతో దూషిస్తూ కామెంట్లు చేయడం అత్యంత దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ప్రజాప్రతినిధిని కించపరిచే విధంగా చేసిన ఈ వ్యాఖ్యలు వ్యక్తిగత అవమానానికి మాత్రమే కాకుండా, మహిళా సమాజాన్ని అవహేళన చేసే చర్యగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి అసభ్యకర పోస్టులు మరియు వ్యాఖ్యలు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసేలా ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా సమాజంలో తప్పుడు సందేశాలు పంపుతూ, వర్గ విద్వేషాలను రెచ్చగొట్టి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల "కిషోర్ ఆశిష్ నల్ల ఆశిష్ " పేరుతో ఉన్న ఫేస్‌బుక్ అకౌంట్ వెనుక ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని వెంటనే గుర్తించి, ఐటీ చట్టాల ప్రకారం మరియు ఇతర సంబంధిత చట్టాల మేరకు కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ సెల్

## గంజాయి,గృహ వేధింపులు,రోడ్లు,డ్రైన్ల సమస్యల పై
# ఎమ్మెల్యే మాధవికు మహిళల ఫిర్యాదు

**గుంటూరు, ఏప్రిల్ 28,ప్రభాతవార్త :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీమతి గళ్ళా మాధవి మంగళవారం మహిళా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి మహిళల నుండి నేరుగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇటీవల టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలిగా నియమితులైన గళ్ళా మాధవిని మిర్చి



యార్డు చైర్మన్ కుర్రా అప్పారావు, రాష్ట్ర రజక సంఘం నాయకులు ప్రత్యేకంగా సత్కరించారు. అదేవిధంగా ట్రాన్స్ జెండర్ వర్షిణిని పీఏగా నియమించినందుకు ట్రాన్స్ జెండర్ సంఘాల నాయకులు ఎమ్మెల్యే గళ్ళా మాధవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ అభినందనలు తెలిపారు. గుంటూరు నగరానికి చెందిన మార్తమ్మ జీజీహెచ్‌లో సెక్యూరిటీ ఉద్యోగం కల్పించాలని కోరగా, పొన్నగంటి కోటేశ్వరరావు తనకు వినికిడి సమస్య ఉందని హియరింగ్ ఎయిడ్ అందించాలని విజ్ఞప్తి చేశారు. వీఐపీ రోడ్డుకు చెందిన పరిమళ అనే మహిళ తమ ఇంటి ఎదుట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా తమ కుటుంబాన్ని, ముఖ్యంగా తన కుమార్తెను వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. పట్టాభిపురంకు చెందిన కొండవీటి శ్రీనివాసరావు తన షాపులో కంప్యూటర్లు చోరీకి గురయ్యాయని న్యాయం చేయాలని కోరగా, కృష్ణదేవరాయ నగర్ మహిళలు తమ ప్రాంతంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కోరిటెపాడుకు చెందిన జీ.గోపినాథ్ తమకు ఫ్లాట్ కేటాయించాలని విజ్ఞప్తి చేయగా, జీ.వెంకాయమ్మ తన భర్త అనారోగ్యంతో కాళ్లు తొలగించాల్సి వచ్చిందని, పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. రాజేంద్రనగర్‌కు చెందిన ఓ మహిళ ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేయగా,



శ్రీనివాసరావుపేటకు చెందిన పలువురు మహిళలు గొర్రెల లీలావతి పేరుతో చిట్టీల మోసానికి గురయ్యామని ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ మహిళల నుంచి ప్రధానంగా గంజాయి విక్రయాలు, గృహ వేధింపులు, భర్తల హరాస్మెంట్, రోడ్లు-డ్రైన్లు, మంచినీటి సమస్యలు ఎక్కువగా తమ దృష్టికి వస్తున్నాయని, గృహ వేధింపుల సమస్యలపై వెంటనే మహిళా పోలీస్ స్టేషన్‌కు బాధితులను పంపించి కౌన్సెలింగ్ ఇప్పించే చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. గంజాయి నియంత్రణ కోసం ఇప్పటికే డ్రైవ్స్ నిర్వహించినప్పటికీ కొన్ని శివారు ప్రాంతాల్లో ఇంకా సమస్య కొనసాగుతోందని, అక్కడ నిరంతర పెట్రోలింగ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో నీటి సమస్యలు, రోడ్లు లేకపోవడం వంటి సమస్యలు పరిష్కారమ య్యాయని చెప్పేందుకు మహిళలు తిరిగి రావడం సంతోషకరమన్నారు. ఉపాధి కోసం వచ్చిన మహిళలకు తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రయత్నం చేస్తున్నామని, ఇల్లు లేని మహిళలకు టిడ్కో ఇళ్లలో అవకాశం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి మంగళవారం మహిళా గ్రీవెన్స్ ద్వారా మహిళలు తమ సమస్యలను నేరుగా తెలియజేస్తుండగా, వాటి పరిష్కారం కోసం పశ్చిమ కార్యాలయం నిరంతరం పనిచేస్తోందన్నారు. రానున్న నెలలలో మహిళలు తమ సమస్యలను ఆన్లైన్‌లో నమోదు చేసుకునేలా ప్రత్యేక యాప్ తీసుకురావాలని యోచిస్తున్నామని వెల్లడించారు. పశ్చిమ నియోజకవర్గాన్ని సమస్యల రహితంగా అభివృద్ధి పథంలో నడిపిస్తూ, సంక్షేమ పథకాలను ఎటువంటి వివక్ష లేకుండా అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఇటీవల ట్రాన్స్ ఉమెన్‌కు ఉద్యోగం కల్పించిన నేపథ్యంలో ట్రాన్స్ జెండర్ సంఘాల నాయకులు స్వయంగా వచ్చి అభినందించడం ఆనందంగా ఉందన్నారు. అలాగే ఉద్యోగ సంఘాల నాయకులు కూడా తమ సమస్యలతో గ్రీవెన్స్‌కు రావడం జరుగుతోందని పేర్కొన్నారు. రోడ్లు, డ్రైన్లు పూర్తి కాలేదనే సమస్యలు పునరావృతమవుతున్నాయని, గత ఆరు నెలలుగా బిల్లుల చెల్లింపులు, కాంట్రాక్టర్ల సమస్యలు, రీటెండర్ల కారణంగా జీఎంసీలో కొంత ఆలస్యం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం కమిషనర్ ఆధ్వర్యంలో ప్రాధాన్యత ఆధారంగా పనులను దశలవారీగా పూర్తి చేసే చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. కొంతమంది కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్ చేయడం జరిగిందని, కొత్త టెండర్లు పిలవాల్సి రావడంతో పనుల్లో ఆలస్యం జరిగిందన్నారు. అయితే ప్రజల సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి ఎక్కువ శాతం సమస్యలకు వెంటనే పరిష్కారం అందిస్తున్నామని తెలిపారు.

## ఎమ్మెల్యే గల్లా మాధవిను మర్యాదపూర్వకంగా కలిసిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు

**గుంటూరు విద్య ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు, గళ్ళా మాధవి తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులుగా ఎంపికైన శుభ సందర్భంగా అభినందనలు తెలియజేశారు . వారు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సత్వర సమస్య పరిష్కార దృక్పథాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి .హైమారావు కొనియాడారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులుగా ఎంపికైన శుభ సందర్భంగా అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో అత్యున్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. గుంటూరు జిల్లా అధ్యక్షులు సాయి విశ్వనాథ్ మాట్లాడుతూ గళ్ళా మాధవి ఎమ్మెల్యేగా క్షేత్రస్థాయి పర్యటనలు ,పచ్చదనం పరిశుభ్రత కోసం తీసుకుంటున్న చర్యలు, రోడ్ల నిర్మాణాలు, ప్రతి మంగళవారం గ్రీవెన్స్ నిర్వహించి సమస్యలు పరిష్కరించడం, నిత్యం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టడం తదితర కార్యక్రమాలు వెస్ట్ ఇస్ బెస్ట్ అనే స్థాయిలో నియోజకవర్గానికి రాష్ట్రస్థాయిలోనే గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తున్నందుకు అభినందన పూర్వక ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్



అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖలీల్, రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ పి లలిత బాబు, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ ,గుంటూరు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎన్ .వేణుగోపాల్, గుంటూరు నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెవి రాఘవులు, టి శ్రీనివాసరావు ఉపాధ్యక్షులు టి రవి, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఇంధన కొరత కృత్రిమంగా సృష్టించబడిందే : దొంతి రెడ్డి వేమారెడ్డి

**మంగళగిరి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రస్తుతం కనిపిస్తున్న ఇంధన కొరత కేవలం కృత్రిమంగా సృష్టించబడిందని మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. మన నియోజకవర్గ



సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరత వల్ల సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకొని, వారి పక్షాన నిలిచే విధంగా కార్యాచరణ రూపొందించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంధనం కొరత వల్ల వాహనదారులు సామాన్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పర్యవేక్షణ లోపం, ఇంధన నిల్వలను ముందస్తుగా అంచనా వేయడంలో వైఫల్యం చెందడం వల్లే పెట్రోల్ బంకుల వద్ద గంటల తరబడి క్యూలైన్ లో ప్రజలు వేచి ఉండాల్సి వచ్చిందని విమర్శించారు. ఇదే కొరతను సాకుగా చూపి కొన్ని చోట్ల అధిక ధరలకు విక్రయించే ప్రయత్నం చేశారని ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని నిరంతర సరఫరా జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ప్రజల కష్టాలను తాము నిశితంగా గమనిస్తున్నామని, ఈ సమస్య పరిష్కారం అయ్యే వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు బుర్రముక్క వేణుగోపాల సోమి రెడ్డి, అమర నాగయ్యలతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, సయ్యద్ గౌస్ మొహిద్దిన్, మల్లవరపు సుధారాణి, విజయశ్రీ, చిన్నారి, సింకా గంగాధారావు, మదాల గోపి, సాంబిరెడ్డి, హుస్సేన్, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## సెల్ ఫోన్ వదలండి.. పుస్తకాలు చదవండి..

**పెదనందిపాడు ఏప్రిల్ 28, (ప్రభాతవార్త) :** పౌర గ్రంథాలయ శాఖ, ఆంధ్రప్రదేశ్ వారి ఉత్తర్వుల మేరకు గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో శాఖా గ్రంథాలయం, పెదనందిపాడు లో ఈనెల 28 నుండి జూన్ 6వ తేదీ వరకు నిర్వహించనున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని మంగళవారం ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వహకులు డి శివ నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మోహనరావు మాట్లాడుతూ కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాలు నిర్వహించడం వలన విద్యార్థులలో నైతిక విలువలు పెరుగుతాయని, సృజనాత్మకత పెరుగుతుందని తెలిపారు. పుస్తక పఠనం వలన ప్రపంచ జ్ఞానం కలుగుతుందని విద్యార్థులు ఈ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని కోరారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో కథలు వినుట, పుస్తక పఠనము, పుస్తక సమీక్షలు, స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం, క్విజ్, డాన్స్, జీకే,పేపర్ ఆర్ట్స్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వంటి సృజనాత్మక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని




తెలిపారు. గ్రంథాలయ నిర్వహకులు డి శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో, ఏప్రిల్ 28వ తేదీ నుండి జూన్ 6వ తేదీ వరకు 40 రోజులు పాటు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు ఈ వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం నిర్వహించుట జరుగుతుందని, విద్యార్థులు ఈ వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వేసవి విజ్ఞాన తరగతుల పై అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎన్ శ్రీనివాస్, వెలినేని శివయ్య, పర్వతనేనీ సుబ్బారావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లో అలసత్వం వహిస్తే కఠినచర్యలు : మున్సిపల్ కమిషనర్

**తెనాలి మున్సిపాలిటీ,ఏప్రిల్28,ప్రభాతవార్త:** విధుల్లో అలసత్వం వహిస్తే,కఠినచర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమీషనర్, రామ



అప్పలనాయుడు, సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు పట్టణం లోని సుల్తానాబాద్, ఉడా కాలనీ సచివాలయ లను సందర్శించారు. సచివాలయాలలోని రికార్డులను, హాజరు పట్టి నీ పరిశీలించారు. ప్రజలకు సచివాలయం ద్వారా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సమయపాలన పాటించని ,విధుల పట్ల అలసత్వం గా ఉన్న సిబ్బందికి షోకాజు నోటీసులు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పట్టణంలోని 30 వార్డు జిల్లా ప్రభుత్వ వైద్యశాలరోడ్డులోజరుగుతున్న కాలువ పూడికతీత పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాలువలో ఉన్న షిల్ట్ ను పూర్తిగా తొలగించాలని సిబ్బందికి సూచించారు. తొలగించిన షిల్టును వీలైనంత త్వరగా తరలించాలని చెప్పారు. కాలువలలో చెత్త ఇతర వ్యర్థాలు వేయకుండా చూడాలని, వ్యర్థాలు వేయడం వలన నీటిపారుదలకు ఆటంకం కలిగి పూడిక ఏర్పడుతుందని అన్నారు. 34 వార్డులో గల పురపాలక సంఘ గృహ నిర్మాణ వర్గాల కేంద్రాన్ని పరిశీలించి ఆ ప్రాంగణంలో మట్టిని తోలించాలని సిబ్బందికి సూచించారు. వివిఎస్ఆర్ కళాశాల సమీపంలో గల పురపాలక సంఘ ప్రధాన మంచినీటి సరఫరా కేంద్రాన్ని పరిశీలించి మంచినీటి సరఫరా జరుగుతున్న విధానంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని, నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కమీషనర్ వెంట అసిస్టెంట్ ఇంజనీర్ కల్యాణ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంధన కొరత పై మంత్రి నాదెండ్ల వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం : మాజీ ఎమ్మెల్యే శివకుమార్

**తెనాలి,ఏప్రిల్28,(ప్రభాతవార్త):** రాష్ట్రంలో పెట్రోల్ డీజిల్ కొరతపై మాజీ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం తెనాలి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్లో మాత్రమే పెట్రోల్ డీజిల్ సంక్షోభం రావటానికి కారణం కూటమి ప్రభుత్వామేనని,ఇది కేవలం ప్రభుత్వం సృష్టించిన సంక్షోభమేనని,ఇంధన కొరతను కృత్రిమంగా సృష్టించి తద్వారా దోచుకుంటానికి కూటమి ప్రభుత్వం నాయకులు చేసిన ప్రయత్నమేనని మాజీ ఎమ్మెల్యే శివకుమార్ ధ్వజమెత్తారు. దీనిపై స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బాధ్యతారాహిత్యం గా మాట్లాడుతూ ఇదంతా సోషల్ మీడియా నిర్వాకం అని తప్పును వారిపై నెట్టే ప్రయత్నం చేయటం ఎంతవరకు సమంజసమని, మీ ప్రభుత్వ అసమర్ధ పాలనతో రాష్ట్రంలో పెట్రోల్ డీజిల్ కొరత ఏర్పడిందని, ఆయిల్ కంపెనీలతో మీ ప్రభుత్వం చేసుకున్న అక్రమ ఒప్పందాల కోసం సామాన్యులను బలి చేస్తారా? మన ప్రక్క రాష్ట్రాలైన తెలంగాణ కర్ణాటక తమిళనాడు లాంటి ఇతర రాష్ట్రాల్లో పెట్రోలు డీజిల్ కొరతలేదని,కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న ఒక్క ఆంధ్ర ప్రదేశ్ లో మాత్రమే ఈ దుస్థితి నెలకొందని మాజీ ఎమ్మెల్యే శివకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వదంతుల వల్లనే ఇంధన కొరత ఏర్పడిందని మంత్రి నాదెండ్ల మనోహర్ బాధ్యత రాహిత్యంగా మాట్లాడుతున్నారని, సమస్యను చిన్నదిగా చూపే ప్రయత్నం చేయటం తగదన్నారు. రాష్ట్రంలో ఏ పెట్రోల్ బంకులు చూసిన నో స్టాక్ బోర్డులు కని పిస్తున్నాయని ఇంధన కొరత రవాణా రంగంపై తీవ్ర ప్రభావం పడు



తుందని అంతేకాకుండా నిత్యవసర ధరలు కూడా పెరిగి సామాన్యులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఒకపక్కన ప్రభుత్వం ఎక్కడ డీజిల్ పెట్రోల్ కొరత లేదని చెబుతున్న క్షేత్రస్థాయిలో పరిస్థితి దానికి భిన్నంగా ఉందని కావున తక్షణమే ప్రభుత్వం రాష్ట్రంలో పెట్రోల్ డీజిల్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని మాజీ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిళా నేతలు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

## విలేఖరి జగన్మోహన్ రెడ్డి హత్యకు నిరసనగా,జర్నలిస్ట్స్ సంఘాల ర్యాలీ

**తెనాలి ఏప్రిల్28(ప్రభాతవార్త):** చిత్తూరు జిల్లా వీ.కోటలో ఆంధ్రజ్యోతి విలేఖరి జగన్మోహన్రెడ్డిని అత్యంత దారుణంగా హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ తెనాలి ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మంగళవారం సాయంత్రం స్థానిక శివాజీ చౌక్ వద్ద నుండి ఏపియూడబ్ల్యూజే ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ప్రదర్శనకు టీడీపీ, జనసేన, బీజేపీ, సిపిఐ సిపిఎం, స్వచంద సంస్థలు మద్దతు తెలిపి పాల్గొన్నాయి. శివాజీ చౌక్ నుంచి గాంధీ చౌక్, బోస్ రోడ్డు మీదగా తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఎమర్వో కె.వి. గోపాలకృష్ణకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యుజే తెనాలి



నియోజకవర్గం అధ్యక్షుడు చందు సుబ్బారావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దుస్, టిడిపి నాయకులు, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, సిపిఎం నాయకులు కే బాబు ప్రసాద్, రైతు సంఘ నాయకులు ములకా శివ సాంబిరెడ్డి, బిజెపి నాయకులు అడపా సంపత్ రాయుడు, పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం నాయకుడు దరిశి శివకోటేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ నాయకుడు లోకం భాస్కర రావు తదితరులు మాట్లాడుతూ పాత్రికేయుడు జగన్మోహన్ రెడ్డి హత్యను తీవ్రంగా ఖండించారు. హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా జర్నలిస్టులపై దాడులు మారనకాండలు ఆగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో,ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సభ్యులు,పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. నిరసన ప్రదర్శనను ఏపీయూడబ్ల్యూజే తెనాలి కార్యదర్శి ఎం.గోపీచంద్, ఆంధ్రజ్యోతి తెనాలి స్టాఫ్ రిపోర్టర్ టి.శేషగిరి,ఏబీఎన్ ఛానల్ పాత్రికేయుడు బి. మురళీకృష్ణ పర్యవేక్షి ంచారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు బొల్లిమంత కృష్ణ, ఉపాధ్యక్షుడు టి శరత్ బాబు, బత్తుల కమలాకర్, ట్రెజరర్ దీపాల తారక సాయినాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సిద్దుల సాయినాథ్, యూనియన్ సభ్యులు,ఏపీడబ్ల్యూజెఫ్ సభ్యులు కనపర్తి రత్నాకర్, సుభాష్ బాబు,రెడ్రౌతు వెంకట్రావు,వి.లక్ష్మణరావు, వివిఆర్.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగ చలివేంద్రంను ప్రారంభించిన తహాశీల్దార్

**తెనాలి,ఏప్రిల్28,(ప్రభాతవార్త):** తెనాలి పట్టణం రైల్వే స్టేషన్ వద్ద శ్రీశివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవాసమితి వారిచే ఏర్పాటు చేయబడ్డ చలివేంద్రం నందు, తెనాలి మహాప్రస్థాన సేవా సమితి కార్యదర్శి జెట్టి శివరామకృష్ణ సతీమణి శ్రీమతి జెట్టి నాగ ప్రత్యూష జన్మదినం సందర్భంగా పాదచారులకు, ప్రయాణికుల కు, తెనాలి మండల



తహసీల్దార్ కెవి గోపాలకృష్ణ చేతుల మీదుగా, ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం తాసిల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి ద్వారా గత 18 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్న సేవాసమితి అధ్యక్షులు కుర్రా శ్రీను కి అభినందనలు తెలియజేస్తున్నాన న్నారు. అలాగే మిత్రుడు శివరామకృష్ణ తన భార్య నాగ ప్రత్యూష జన్మదినోత్సవం పురస్కరించుకొని ప్రయాణికులకు పాదచారులకు ఈ వేసవికాలంలో మజ్జిగ పంపిణీ చేయడం అభినందించదగ్గ విషయమని, మీరు భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని కోరుకుంటున్నాను అన్నారు. జెట్టి శివరామకృష్ణ మాట్లాడుతూ ఈరోజు నా భార్య నాగ ప్రత్యూష పుట్టినరోజు సందర్భంగా, శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవాసమితి అధ్యక్షులు పర్యవేక్షణలో రైల్వే స్టేషన్ వద్ద ప్రయాణికులకు పాదచారులకు మజ్జిగ పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందని, రాబోయే రోజుల్లో ఇలాంటి సేవా కార్యక్రమాల్లో నా వంతుగా పాల్గొంటానని ,దాతలు కూడా ఇలాంటి కార్యక్రమాలకు ముందుకు రావాలని కోరుకుంటున్నాను అన్నారు. సేవాసమితి అధ్యక్షులు కుర్రా శ్రీను మాట్లాడుతూ, సేవా సమితి నిర్వహిస్తున్న వేసవి చలివేంద్రం నందు మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెనాలి మండల తహసిల్దార్ కేవీ. గోపాలకృష్ణ చేతులమీదుగా ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సందర్భంగా తాసిల్దార్ గోపాలకృష్ణకు ధన్యవాదాలు తెలుపు తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మల బాపయ్య చౌదరి, వి.ప్రవీణ్, సునీల్, సి హెచ్.శ్రీనివాస్, బి. పోతురాజు మరియు శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## కొలకలూరులో మజ్జిగ చలివేంద్రం ప్రారంభించిన ఎంపిడిఓ అత్తోట దీప్తి

**తెనాలి ఏప్రిల్28(ప్రభాతవార్త):** వేసవి లో ప్రజలు, బాటసారుల దాహార్తి తీర్చుటకు ముందుకు రావడం అభినందించదగ్గ విషయమని తెనాలి మండల అభివృద్ధి అధికారి, కొలకలూరు గ్రామ ప్రత్యేక అధికారి,అత్తోట దీప్తి పేర్కొన్నారు. మంగళవారం తెనాలి




మండల కొలకలూరు గ్రామంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మజ్జిగ ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆమె అభినందించారు. వేసవికాలంలో ప్రజలకు బాటసారులకు మంచినీటి ఏర్పాటు గురించి ఆలోచన రావటం దానిని అమలులో పెట్టడం లాంటి సేవా కార్యక్రమాలు చేయటానికి ఆసక్తి కలిగిన వారందరూ ముందుకు రావాలని ఇలాంటి మరెన్నో సేవా కార్యక్రమాలు ఇంకా కొనసాగించాలని,గ్రామ ప్రత్యేక అధికారి అత్తోట దీప్తి ఆకాంక్షించారు.

## బ్రమ్మంగారి ఆరాధనలో భాగంగా 2వ రోజు సత్కారాలు

**పెదనందిపాడు,ఏప్రిల్ 28, (ప్రభాతవార్త) :** పెదనందిపాడు లోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవస్థానంలో రెండవ రోజు. స్వామివారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు అర్చక స్వాములు శనగపాటి వీరభద్రచారి అత్యంత వైభవంగా నిర్వహించారు అనంతరం రాత్రికి నిర్వహించిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి కోలాట సమాజం వారు నిర్వహించిన కోలాటం భక్తులను ఆకట్టుకున్నది ఈ కోలాట



సమాజం టీచరు కొత్త నాగలక్ష్మి ని వినుకొండ పద్మావతి పట్టు శాలువా తో ఘనంగా సత్కరించారు. సంఘ సభ్యులు విశ్రాంత పోస్టుమాన్ ఉండవల్లి భ్రమరాచార్యులు. మండల విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కోసూరి సుబ్బారాయుడు లు. శ్రీమద్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన కార్యక్రమాలు విజయవంతం అవటానికి విశేష కృషిచేసిన సంఘ ఉపాధ్యక్షులు నందిపాటి ధనుంజయ చారి. అర్చక స్వాములు శనగపాటి వీరభద్ర చారి లను. పట్టు శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు నందిపాటి చిన్నశాస్త్రులు. కోడూరు శ్రీనివాస్. వరగాని సుబ్బారావు. రావినూతల వెంకటసుబ్బయ్య. మచ్చ శంకరాచారి. నందిపాటి బ్రహ్మాజీ బాబు. ప్రముఖ ఎనౌన్సర్ ఉండవల్లి వీర బ్రహ్మాచారి. గుండిమెడ కుమార్. వరగాని మురళి. నందిపాటి శ్రీనివాసు. పాటోజు పూర్ణాచారి. మామిడిపాక ఆదిశేషు. వరగాని రాజేశ్వరి .అంజనాదేవి. ఫణిదపు భువనేశ్వరి. నందిపాటి లీలావతి. శివకుమారి. సుజాత. తదితరులు పాల్గొన్నారు.

## నిలువెత్తు నిర్లక్ష్యానికి నిదర్శనం పెట్రోల్ బంకుల వద్ద అవస్థలు

**గుంటూరు కల్చరల్,ఏప్రిల్ 28,ప్రభాతవార్త :** పెట్రోల్ బంకుల మూసివేత,ఉన్న బంకుల వద్ద కిలోమీటర్ల మేర కనపించే క్యూలు,ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమని,సంక్షోభ నిర్వహణ వైఫల్యమని అవగాహన సంస్థ ఖండిస్తుంది.రాష్ట్రంలో ఉన్న 4,500పెట్రోల్ బంకుల్లో 1500బంకులు మూతబడ్డాయంటే పరిస్థితి తీవ్రత అర్ధమవుతుందని దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కడాలేని ఈ దురవస్థ మన రాష్ట్రంలోనే ఉండటం దారుణమని,ఇరాన్‌పై ఇజ్రాయేల్,అమెరికా దేశాలు ఏకపక్షంగా యుద్ధానికి దిగిన వెంటనే ఇంధన రంగంలో సంక్షోభం తప్పదనే సంకేతాలు వచ్చినా ప్రభుత్వం నుంచి స్పందన లేకుండా పోయిందని అయిల్ కంపెనీలు పెట్రోల్ బంకులు అరువు ఇవ్వడం మానేయటంతో చాలా రోజుల నుండి బంకుల ముందు "నో స్టాక్" బోర్డులు కనిపిస్తున్న విషయం అధికారులు పట్టలేదని అవగాహన సంస్థ విమర్శిస్తుంది.ఆయిల్ కంపెనీల సరఫరా ను కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని సరఫరా పై ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం అందించాలని అవగాహన సంస్థ డిమాండ్ చేస్తుంది.

# పల్నాడు జిల్లా వార్త



## ఘనంగా శ్రీ బొల్లు మొరవెంకటేశ్వరస్వామి వారి స్వామివారి కళ్యాణం

**యడ్లపాడు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలోని కొండవీడు కొండలపై వేంచేసియున్న శ్రీ బొల్లు మొరవెంకటేశ్వరస్వామి వారి 46వ వార్షిక మరియు కళ్యాణ మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల నుండి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండే ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించటం జరిగిందని అలయ ప్రధాన అర్చకులు రాజేంధ్ర శర్మ తెలుపుతున్నారు. స్వామివారి కళ్యాణ మహోత్సవంలో దంపతులు పాల్గొన్నారు. కొండవీడు కొండల శిఖరంపైన సుమారు నేల నుండి నాలుగు వేల మీటర్ల ఎత్తులో ఈ దేవాలయం నిర్మించారు. నాడు రెడ్డి రాజులు నిర్మాణం గావించిన వాటిలో ఒక్క ఈ దేవాలయం నేటికి నిత్యపూజలు అందు కుంటున్న స్వామి శ్రీ బొల్లు మొరవెంకటేశ్వరస్వామి. భక్తులు కోరిన కోర్కెలు తీర్చేస్వామిగా అయన ప్రసిద్దిచెందారు. అన్ని మీటర్లు ఎత్తునుసైతం భక్తులు సునాయాసంగా వెళ్ళి స్వామివారిని దర్శించుకుంటున్నారు. సోమవారం రాత్రి గ్రామంలో స్వామివారి తిరుణాల ఘనంగా నిర్వహించారు. ప్రభలు, భజనలతో గ్రామంలో అధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు భారీగా తరలి వచ్చారు. కార్యక్రమాలను దేవాదయ మరియు గ్రామస్థులు పర్యవేక్షించారు.





## బంకులకు చేరిన ఇంధనం..
## వాహన దారుల హడావిడికి విరామం

**యడ్లపాడు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బోయపాలెం, యడ్లపాడు, తిమ్మాపురం, చెంఘీస్ఖాన్‌పేట గ్రామాల వద్ద నున్న పెట్రోల్ బంకులలో నిల్వలు రావటంతో గత నాలుగు రోజుల నుండి వాహన దారులు పడుతున్న ఇబ్బందులకు కొంత మేర ఉపశమనం కలిగినట్టు అయ్యింది.



మండలంలోని రైతులు, ద్విచక్ర వాహన దారులు తమ వాహనాలకు కొంత మేరకు సరిపడా డీజిల్, పెట్రోల్ వారికి అందటం జరిగింది. అయా పంపుల వద్ద రెవిన్యూ అధికారులు దగ్గర ఉండి పంపిణీ ప్రక్రియకు ఎటువంటి ఇబ్బందులు కలుగ కుండా పర్యవేక్షించారు. వీరికి సహాయంగా స్ధానిక పోలీసులు గస్తీలు నిర్వహించారు. అయితే స్ధానికంగా ఉండే పెద్ద వాహన దారులు రెండు రోజుల పాటు సమన్వయం పాటించి ఇబ్బందులు రాకుండా చూడాలని, వారు ప్రభుత్వం నిర్ణయించిన మోతాదులో అయిల్ నింపుకోవాలని కోరుతున్నారు.

## చికిత్స పొందుతూ బస్సు డ్రైవర్ మృతి

**యడ్లపాడు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** మండల పరిధిలోని నూతన ఎన్‌హెచ్ 16 జాతీయ రహదారి బైపాస్ వద్ద జరిగిన బస్సు డ్రైవర్ ప్రమాదంలో గాయపడి మృతి చెందిన సంఘటనం చోటు చేసు కుంది. సంఘటనకు సంబంధించి స్ధానిక ఎస్సై టి శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 21 తేది కొత్త బైపాస్ వద్ద రాయల్ క్రూజ్ బస్సులో తలెత్తిన సాంకేతిక సమస్యఅయిన ఎయిర్ సస్పెషన్ పనిచేయకపోవడంతో అయన బస్సు దిగివచ్చి బస్సు క్రింద భాగంలో ఎయిర్ సస్పెషన్‌ను సరిచేయుచున్న తరుణంలో ప్రమాదవ శాత్తు అది అతని ఛాతీపై పడటంతో తీవ్రమైన అంతర్గత గాయాలు అయ్యాయని, అతనిని వెంటనే గుంటూరు ప్రైవేటు వైద్యశాలకు తరలించటం జరిగిందన్నారు. అక్కడ చికిత్స పొందుతూ 27వ తేది మృతి చెందాడన్నారు. మృతుడు యండ్రాసి శివ శంకర్ బాబు(42) ఇతనిది మాచవరం మండలం యర్రంవారి వీధి, ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడ వాసిగా గుర్తించటం జరిగిందన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టటం జరుగుతుందన్నారు.



## ప్రభుత్వ వైఫల్యంతో ఇంధన కొరత
### వైసీపీ నేత శ్రీకాంత్

**క్రోసూరు,ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే పెట్రోల్ బంకుల్లో ఇంధన కొరత ఏర్పడిందని పల్నాడు జిల్లా ఎస్సీ విభాగం జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ చిలక శ్రీకాంత్ అన్నారు. మంగళవారం క్రోసూరులోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలోని ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. గ్రామాల్లో రేషన్ డీలర్ల వద్ద నుండి బియ్యం తెచ్చుకోవాలన్న క్యూ లైన్ లో నిలబడాల్సిందే. వ్యవసాయ రైతులు యూరియా తెలుసుకోవాలన్న క్యూ లైన్ లో నిలబడాల్సిందే. గృహ అవసరాల నిమిత్తం గ్యాస్ బండ తెచ్చుకోవాలన్న క్యూ లైన్ లో నిలబడాల్సిందే. గత నాలుగు రోజుల నుండి రాష్ట్రంలో పెట్రోలు. డీజిల్ తెచ్చుకోవాలన్న క్యూ లైన్ లో నిలబడాల్సిందే. దేశంలో ఇంధన కొరత ఏ రాష్ట్రంలో లేదు ఒక్క ఆంధ్రప్రదేశ్లో మాత్రమే ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రజలు త్రాగునీరు కోసం కూడా క్యూ లైన్ లో నిలబడాల్సిన దుస్థితి ఈ పాలకుల పాలన కనబడుతుంది. ఇకనైనా యూరియా. పెట్రోలు. డీజిల్. తో పాటు రాష్ట్రంలోని ప్రజలకు త్రాగునీరు ఎద్దడి నివారించి త్రాగునీరు అందించాలని శ్రీకాంత్ డిమాండ్ చేసినారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు పెరుమళ్ళపల్లి కోటయ్య. క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గార్లపాటి దాసు. ఎంపీటీసీలు కంభంపాటి నాగయ్య. చిలక ప్రసన్న రవికుమార్.నాయకులు దుగ్గి చినబాబు. చిలకా భాస్కర రావు పాల్గొన్నారు.



## యానిమేటర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ

**పెదకూరపాడు,ఏప్రిల్28,ప్రభాతవార్త :** మండలం 75 తాళ్లూరులో యానిమేటర్లకు ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మంగళవారం పంపిణీ చేశారు.నియోజకవర్గం వ్యాప్తంగా 187 మంది యానిమేటర్లకు సెల్ ఫోన్లు ఎమ్మెల్యే అందించారు.ప్రభుత్వం అందిస్తున్న డ్వాక్రా రుణాలు మహిళలు సద్వినియోగం చేసుకునేలా యానిమేటర్లు కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు.ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులకు పథకాలు అందేలా కృషి చేయాలన్నారు..



## చారిటబుల్ ట్రస్ట్‌కు నాతాని ఆర్ధిక సహాయం

**నరసరావుపేట, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** కృష్ణవేణి విద్యాసంస్థల చైర్మన్ నాతాని వెంకటేశ్వరరావు తన పుట్టినరోజు సందర్భంగా చారిటబుల్ ట్రస్ట్ కు విరాళం అందజేశారు.కృష్ణవేణి డిగ్రీ కాలేజీ మరియు కేరిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ గా వారు సామాజిక సేవలో భాగంగా విరాళం అందించామని తెలియజేశారు.నరసరావుపేట పట్టణంలోని మూడు అన్నా క్యాంటీన్లలో భోజన పంపిణీ కార్యక్రమానికి మద్దతుగా ఈ మొత్తం ఇచ్చామన్నారు.హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు విరాళం అందించారు. ఈ విరాళం ద్వారా అవసరమైన ప్రజలకు ఉచిత భోజనం అందించ పడుతుందని చైర్మన్ నాతాని వెంకటేశ్వరరావు తెలియజేశారు. ట్రస్టు నిర్వాహకులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.



## ఉప్పలపాడు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

**నరసరావుపేట టౌన్,ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** ఉప్పలపాడు శాఖా గ్రంథాలయం లో వేసవి విజ్ఞాన శిబిరం మంగళవారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి కే వెంకట్రావు అధ్యక్షత వహించారు. తొలి రోజు విద్యార్థులచే ర్యాలీ నిర్వహించుట జరిగినది. ఈ ర్యాలీ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శనివారపు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో యన్నం వీరాంజనేయరెడ్డి , నంద్యాల కోటిరెడ్డి , వెలుగోటి సత్యనారాయణ రెడ్డి మరియు గ్రంథాలయ పాఠకులు విద్యార్థులచే నిర్వహించడం జరిగింది. వేసవి విజ్ఞాన శిబిరం లో మొదటి రోజు విద్యార్థుల చే కథలు పుస్తకాలు చదివించడం, దిన పత్రికలు చదివించుట, ఇండోర్ గేమ్స్ నిర్వహించారు.ప్రతి విద్యార్థి ఈ అవకాశం ఉపయోగించుకోవాలని గ్రంథాలయాధికారి వెంకట్రావు విజ్ఞప్తి చేశారు.

## పెట్రోల్ బంకును సీజ్ చేసిన జాయింట్ కలెక్టర్

**రొంపిచర్ల, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** మండలంలో అన్ని పెట్రోల్ బంక్ లను మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ సంజన సింహ తనిఖీ చేశారు. రెండు రోజుల క్రితం మండలంలో అన్ని పెట్రోల్ బంక్ లలో పెట్రోల్, డిజిల్ రాలేదని చెప్పి నో స్టాక్ బోర్డులు పెట్టటం వలన, పెట్రోల్ బంక్ ల వద్ద భారీగా వాహనాలు నిలిచి పోయాయి. సమాచారం తెలుసుకున్న జిల్లా జాయింట్ కలెక్టర్ సంజన సింహ పెట్రోల్ బంక్ లను తనిఖీ చేశారు. ఆయా పెట్రోల్ బంక్ లలో రికార్డులను పరిశీలించగా, మండల కేంద్రమైన రొంపిచర్లలో గల వెంకట మురళీధర ఫిల్లింగ్ స్టేషన్‌లో నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేపట్టడు తున్నారని నిర్ధారించి సీజ్ చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ సంజన సింహ తనిఖీల అనంతరం పెట్రోల్ బంక్ లలో పెట్రోల్, డీజిల్ అమ్మకాలు సజావుగా జరిగాయి. ఆయా పెట్రోల్ బంక్ లలో రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని నియమించి వాహనదారులకు పెట్రోల్, డీజిల్ అమ్మకాలు చేపట్టం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బాలకృష్ణ, తహశీల్దార్ బండి నిర్మల,ఆర్ ఐ కోటేశ్వరరావు, విఆర్ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## గూగుల్ భారీ పెట్టుబడి రాష్ట్ర ఆర్ధిక వ్యవస్థకు కొత్త ఊపిరి
### -రూ.1.35 లక్షల కోట్ల విదేశీ పెట్టుబడితో రాష్ట్రానికి భారీ ఆర్ధిక, సాంకేతిక ప్రయోజనాలు : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** పెట్టుబడిదారులు, దిగ్గజ పారిశ్రామికవేత్తలను రాష్ట్రంవైపు మళ్లించడం వెనకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ల పాత్ర, కృషి మాటల్లో వర్ణించలేనిదని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ ప్రభుత్వ సులభతర వాణిజ్య విధానాలు, ఇండస్ట్రియల్ పాలసీలు అంతర్జాతీయ పారిశ్రామిక వర్గాల దృష్టిని విశేషంగా ఆకర్షించడంలోనూ వారిరువురి పనితీరు అద్భుతం అని అనాననరు. వారు సాధించిన అతిపెద్ద విదేశీ పెట్టుబడి అయిన గూగుల్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపరి పోసిందనే చెప్పాలన్నారు. నేడు ముఖ్యమంత్రి చేసేది గూగుల్ సంస్థ శంకుస్థాపన కాదని, రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి నూతన ప్రతిష్టాపన అని వ్యాఖ్యానించారు.

దేశంలోని పలు ప్రధాన రాష్ట్రాల కంటే వేగంగా ఏపీ నాయకత్వం సకాలంలో స్పందించినందునే రాష్ట్రానికి అతిపెద్ద భారీ విదేశీ పెట్టుబడి వచ్చింది. గూగుల్ సంస్థ రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో రాష్ట్రానికి భారీ ఆర్థిక, సాంకేతిక ప్రయోజనాలు చేకూరనున్నాయని తెలిపారు. ఈ పెట్టుబడి గ్రౌండింగ్ తో వెనుకబడిన ప్రాంతమైన ఉత్తరాంధ్ర ప్రాంతం భవిష్యత్ లో ప్రపంచ ఏఐ గ్లోబల్ హబ్ గా మార్చే దిశగా తొలి అడుగు పడనుందని, ఈ ప్రాజెక్ట్ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ముఖ్యంగా రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి ఏఐ నైపుణ్యాలపై అవగాహన ఏర్పడుతుందని, అదేవిధంగా సబ్ మెరైన్ కేబుల్ కనెక్టివిటీ ద్వారా రాష్ట్రానికి అంతర్జాతీయ సమాజంతో ధృఢమైన అనుసంధానం ఏర్పడుతుందని తెలిపారు. . హైస్పీడ్ ఫైబర్ నెట్ వర్క్ తో విశాఖ నగరం ఏఐ సాంకేతికతకే ప్రపంచ డెస్టినేషన్ గా మారుతుందని అన్నారు. ఉత్తరాంధ్రఅభివృద్ధికి అదనపు బలం గూగుల్ పెట్టుబడి సాధనలో కూటమి ప్రభుత్వం చూపిన విజన్ పట్ల ప్రపంచ పారిశ్రామిక వర్గాలే విస్మయం వ్యక్తం చేస్తున్నాయని వెల్లడించారు. విశాఖ నగరానికి ఉన్న భౌగోళిక ప్రాధాన్యతలు పారిశ్రామిక వర్గాల్ని విశేషంగా ఆకర్షిస్తూ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి అదనపు బలంగా మారుతున్నాయి. పారిశ్రామికవేత్తల అంతరంగంతో, రాష్ట్ర భవిష్యత్ దృష్ట్యా ప్రభుత్వం వారికి తగిన ప్రోత్సాహకాలు, రాయితీలు అందించడం నిజంగా చాలా గొప్ప పరిణామమనే చెప్పాలని, ప్రపంచం గర్వించే గూగుల్ కు ప్రభుత్వం కేటాయించిన 600 ఎకరాల భూమి, విద్యుత్, నీటి వనరులతో రాష్ట్రానికి వివిధ మార్గాల్లో ఒనగూరే ప్రయోజనాలు అపారమైనవని తెలిపారు.



## మే1న సింగరుట్ల
## నరసింహస్వామి కళ్యాణం

**కారంపూడి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామ శివారులోని నల్లమల అడవిలో స్వయంభువుగా వెలిసిన శ్రీసింగరుట్ల లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవం మే1న జరగనున్నట్లు దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షులు గుండాల శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి చపారపు శివనాగిరెడ్డి మంగళవారం తెలిపారు. ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాలతో సింగరుట్ల క్షేత్రానికి తీసుకెళ్లడం, శ్రీసుదర్శన నాగసింహ హోమం జరుగుతుందని నృసింహ జయంతి కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు ఎదుర్కోల ఉత్సవం జరుగుతుందని తెలిపారు. లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందని ఈ సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కల్యాణ మహోత్సవం కార్యక్రమంలో పాల్గొనే దంపతులు దేవాదాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు.





## పిడుగుపాటుకు పూర్తిల్లు దగ్ధం

**వెల్దుర్తి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెల్దుర్తి గ్రామంలో మండ్లి నాసరయ్యకు చెందిన పూరిగుడిసెపై పిడుగుపడి మంటలు చెలరేగడంతో గుడిసె పూర్తిగా కాలిపోయింది. సంఘటన జరిగిన సమయంలో గుడిసెలో ఎవరూ ఉండకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. పిడుగుపడి గుడిసె పూర్తిగా దగ్ధం కావడంతో నష్టం సంభవించిన సంఘటనా స్థలాన్ని ఎమ్మార్వో రాజశేఖర్‌నాయక్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు తక్షణమే సందర్శించి పరిశీలించారు. బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా బియ్యం, కందిపప్పు, నూనె వంటి నిత్యావసర సరకులను మండ్లి నాసరయ్య కుటుంబానికి అందించారు.





## హంస వాహనం పై రంగనాయక స్వామివారి గ్రామోత్సవం

**యడ్లపాడు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** మండల పరిధిలోని సొలస గ్రామంలో వేంచేసి యున్న శ్రీ భూసమేత శ్రీ రంగనాయక స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీ రంగనాయక స్వామివారు గ్రామంలో హంసవాహనంపై ధర్శన మిచ్చారు. ఉదయం నుండే బిందె తీర్థము, నిత్యార్చన, విశేష హోమములు, గ్రామ బలిహరణ అనంతరం రంగనాయక స్వామి సామూహిక సహస్ర నామ పూజలు మరియు తీర్థ ప్రసాద వితరణ గావించటం జరిగిందని అలయ అర్చకులు పరుచూరి రామకృష్ణమాచార్యులు తెలిపారు. సాయంత్రం అర్చన, నిత్యహోమం, గ్రామ బలిహరణతోపాటు స్వామివారికి హంసవానంపై గ్రామోత్సవము నిర్వహించటం జరిగిందన్నారు. అలయ వ్యవస్ధాపక ధర్మకర్త అర్వపల్లి మనోహర దంపతులు నాగజ్యోతి మరియు అర్వపల్లి బ్రదర్స్, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ఘనంగా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

**నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** నరసరావుపేట శాఖ గ్రంథాలయంలో మంగళవారం శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ శిబిరాలు విద్యార్థులను పోటీ ప్రపంచంలో ముందు ఉండేలా తీర్చి దిద్దటానికి దోహదపడతాయని కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథి రత్నాకరం రాము అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలోనర్సరావుపేట గ్రంథాలయంలో 45 రోజులు నిర్వహించనున్న వేసవి శిక్షణా శిబిరాన్ని గ్రంథాలయ అధికారి యడ్లపాటి రాధ ఆధ్వర్యంలో ప్రారంభించారు.గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.విద్యార్థులనుద్దేశించి సెల్ ఫోన్స్ వదలండి, పుస్తకం పట్టండి అనే నినాదం తో గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ప్రాముఖ్యమైనదని వక్తలు తెలిపారు.గ్రంథాలయం అనేది మన పూర్వీకులు మనకు యిచ్చిన ఆస్తిగా భావించి చరిత్రను కాపాడుకోవడంతో పాటు భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ఈ సమాజంలో ప్రతి పౌరుడి పైన ఉంది అని ముఖ్య అతిథి గా పాల్గొన్న అభ్యుదయ భారతి అధ్యక్షులు రత్నాకరం రాము అని పేర్కొన్నారు . గ్రంథాలాధికారి రాధ మాట్లాడుతూ శిబిరాన్ని పట్టణ విద్యార్థిని విద్యార్థులు అందరూ వినియోగించు కోవాలన్నారు.కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు , పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు న్యాయవాదులు విధులకు గైర్హాజరు

**నరసరావుపేట క్రైమ్, ఏప్రిల్28, ప్రభాతవార్త: :** నరసరావుపేట న్యాయవాద సంఘ న్యాయవాదులు బుధవారం విధులకు గైర్హాజరు కానున్నారు. పట్టణానికి చెందిన న్యాయవాది గుండా రాజేష్ పై ఇచ్చిన ఫిర్యాదు ఏకపక్షంగా రిజిస్టర్ చేసి న్యాయవాది పట్ల అన్యాయంగా ప్రవర్తించారని నిరసిస్తూ సదరు న్యాయవాదిపై బనాయించిన అక్రమ కేసును తొలగించేందుకు తీసుకోవాల్సిన కార్యాచరణ ప్రణాళికను మంగళవారం నిర్వహించిన న్యాయవాద సంఘ సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. ఈ మేరకు బుధవారం విధులకు గైర్ హాజరు కానున్నారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘ అధ్యక్షుడు జీవీ. సుబ్బారావు , సీనియర్ న్యాయవాదులు కట్ట నారపరెడ్డి, శ్రీగిరిరాజు నాగేశ్వరరావు, కాకుమాను బాల హనుమంత రెడ్డి, మోరా ప్రతాప్ రెడ్డి, మేదరమెట్ల నాగేశ్వరరావు, నసీమా బేగం, చెన్నుపాటి నాగేశ్వరరావు,కే. విజయ్ కుమార్, పాల్గొన్నారు.

## మాట్లాడే అర్హత నీకు ఉందా..?

**-జూలకంటి వ్యాఖ్యలకు పిన్నెల్లి ఘాటు కౌంటర్**
**-15 ఏళ్లు పారిపోయిన వ్యక్తివి.. ఇప్పుడు నీతులు చెబుతావా?**
**మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సవాల్**

**మాచర్ల, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** మాచర్ల నియోజకవర్గంలో రాజకీయలు సెగలు మరోసారి రాజుకున్నాయి. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేసిన వ్యాఖ్యలపై పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మగతనం గురించి మాట్లాడే అర్హత జూలకంటికి లేదని మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జూలకంటిపై ప్రశ్నల వర్షం కురిపించారు.

**అభివృద్ధి నాదా... నీదా?**

ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన తర్వాత 15 ఏళ్లపాటు నియోజకవర్గానికి ముఖం చాటేసి, ఇప్పుడు వచ్చి ప్రగల్భాలు పలకడం విడ్డూరంగా ఉందని పిన్నెల్లి ఎద్దేవా చేశారు. ఎవరి హయాంలో మాచర్ల అభివృద్ధి చెందిందో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. మా పాలనలో మెరుగైన రోడ్లు, కేంద్రీయ విద్యాలయం, జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి నీరు, ప్రభుత్వ ఆసుపత్రికి 50 పడకలను పెంచడం వంటి ఎన్నో పనులు చేశాం. చేసిన పనులను ఇప్పుడు తమ ఖాతాలో వేసుకోవాలని చూడటం హాస్యాస్పదం అని పేర్కొన్నారు.



**అరాచకాలపై చర్చకు సిద్ధం**

గతంలో జూలకంటి కుటుంబ హయాంలో జరిగిన హత్యలు, ప్రైవేటు సైన్యం అరాచకాలు, రేషన్ బియ్యం మాఫియాపై చర్చించేందుకు తాను సిద్ధమని పిన్నెల్లి ప్రకటించారు. గ్రామాల్లో బెల్టు షాపులు, గంజాయి విక్రయాలతో యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పశర్లపాడులో మద్యం మత్తులో యువకులు గొడవ పడితే, దాన్ని వైసీపీకి ఆపాదించడం చిల్లర రాజకీయమని కొట్టిపారేశారు.

**వరికపూడిసెల మా ఘనతే!**

వరికపూడిసెల ప్రాజెక్టుపై మాట్లాడే నైతిక హక్కు టీడీపీకి లేదని పిన్నెల్లి స్పష్టం చేశారు. గతంలో చంద్రబాబు అసెంబ్లీలో ఈ ప్రాజెక్టు సాధ్యం కాదని చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తూ, వైఎస్ జగన్ చొరవతోనే అన్ని అనుమతులు సాధించామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి దాదాపు రూ.3 వేల కోట్లు వెచ్చించామని వివరించారు.

**త్వరలోనే ఆట మొదలుపెడతా!**

డైవర్షన్ పాలిటిక్స్ మానుకో లేదంటే నీ పార్టీ నాయకులే నిన్ను నమ్మరు. వయసును గౌరవించి సంయమనంతో ఉన్నాను. పద్ధతి మార్చుకోకపోతే నీకంటే గట్టిగా సమాధానం చెప్పగలను. మీ అరాచకాల చిట్టా త్వరలోనే బయటపెడతాను, అసలు ఆట ముందుంది అని పిన్నెల్లి హెచ్చరించారు.

## వైభవోపేతంగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం

సత్తెనపల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త: కూరగాయల మార్కెట్ వద్ద వేంచేసి ఉన్న శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయంలో ఆరాధన మహోత్సవాలను సత్తెనపల్లి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు పోతులూరయ్యాచారి మాట్లాడుతూ.. కాలజ్ఞాన రచయిత శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 333వ ఆరాధన మహోత్సవం నిర్వహించడంతో పాటు మహా అన్నసంతర్పణ కార్యక్రమం లో పట్టణ విశ్వబ్రాహ్మణ కుటుంబంలో అందరూ పాల్గొనటం ఆనందదాయకంగా ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమం ఇంతటి ఘన విజయం సాధించడానికి సంఘ సభ్యుల చేసిన శ్రమ మాటలో చెప్పలేనిది అని సభ్యులను కొనియాడారు. ఈ మహా అన్న సంతర్పణ కార్యక్రమంలో సుమారు 4000 మంది భక్తులు పాల్గొన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అద్దంకి శ్రీనివాసచారి, మహంకాళి శ్రీనివాసరావు, అత్తలూరు కోటేశ్వరరావు, తిప్పర్తి శంకరబాబు, దాసు భాస్కరాచారి, కోటగిరి గోపి, మహంకాళి గిరిధర్, మహంకాళి మాల్లేశ్వరాచారి, మహంకాళి విజయ్ కుమార్, కొమ్మూరి గోవర్ధనాచారి,వానపాముల నాగ రత్నాచారి, వంగిపురపు రామ కోటేశ్వరరావు, వంగిపురపు సూర్య నారాయణ, క్రోసూరి చిన్న అంకయ్య తదితర ప్రముఖులు భక్తులు పాల్గొన్నారు.



## గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభం

సత్తెనపల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభించామని శాఖా గ్రంథాలయ అధికారి కె.ఎస్.ఎస్.ప్రసాద్ తెలిపారు. మంగళవారం పలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. వారికి రిసోర్స్ పర్సన్ ఏ.పూర్ణిమాదేవి స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో పట్టణంలో 'సెల్ ఫోను వదలండి... పుస్తకాలు పట్టండి' అనేనినాదంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది వై.రజని, ఎన్.రమేష్ విశ్వాంత ఉపాధ్యాయులు కేబిఆర్జె ప్రసాద్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎస్‌కె కరిముల్లా, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.



## వైభవంగా జలక్రీడలు, పసుపు బండ్లు



**నిజాంపట్నం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన నిజాంపట్నం గ్రామదేవత శ్రీ మొగదారమ్మ తల్లి శిడిమాను ఉత్సవాలలో భాగంగా మంగళవారం జల క్రీడలు, పసుపు బండ్లు కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అమ్మవారి ఆలయం నుంచి బయలుదేరిన జల క్రీడల బండ్లు బస్టాండ్ సెంటర్, సంతబజార్, శివాలయం, ఫిషర్‌మెన్ కాలనీ, మెయిన్‌బజార్, ఎజికె పేట మీదుగా అమ్మవారి ఆలయం వరకు సాగింది. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలలో డ్రమ్ములలో నీటిని నింపి పంపింగ్ పైపులతో ఒకరిపై ఒకరు చల్లుకుంటూ ఉత్సాహంగా నిర్వహించారు.రాత్రి పసుపు బండ్లు, ఘటములను భక్తులు గ్రామంలో నగరోత్సవం నిర్వహించారు.

బాపట్ల జిల్లా

వార్త



## శక్తి యాప్ డౌన్లోడ్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు అధికారులు



**కొల్లూరు, ఏప్రిల్ 28 (ప్రభాతవార్త) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా భద్రతా కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొల్లూరులో శక్తి యాప్ డౌన్లోడ్ మరియు దాని ఉపయోగాలను గురించి అవగాహన కార్యక్రమంలో భాగంగా వేమూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీవీ ఆంజనేయులు, భట్టిప్రోలు ఎస్సై శివయ్య, కొల్లూరు ఎస్సై పి.కోటేశ్వరరావు, వేమూరు ఎస్సై శ్రీనివాసరావు మరియు రేపల్లె సబ్ డివిజన్ శక్తి టీం కానిస్టేబుల్ వై.గోపినాధ్ మహిళా కానిస్టేబుల్ కుమారి ఈ కార్యక్రమంలో పాల్గొని శక్తి ఉపయోగాలను గురించి తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు, భట్టిప్రోలు మహిళా పోలీసులు మరియు కొల్లూరు మండలంలోని డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

# అక్షర రూపం..ఉజ్వల భవిష్యత్తుకు మార్గం

**బాపట్ల.ఏప్రిల్ 28: ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆరేళ్ళ నిండిన ప్రతి పిల్లాడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పిలుపునిచ్చారు. మంగళవారం బాపట్ల పట్టణంలోని డి.యం.పల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బడి పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు .కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఒకటో తరగతిలోకి ప్రవేశం పొందుతున్న చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కృత్యాలు, వివిధ విద్యా ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారుల సృజనాత్మకతను ఎమ్మెల్యే స్వయంగా తిలకిం చారు. వారిని తీర్చిదిద్దిన అంగన్‌వాడీ టీచర్లను, ఉపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ బడుల్లో సకల వసతులు, నాణ్యమైన విద్యాబోధన అందుబాటులో ఉన్నాయన్నారు.ప్రభుత్వం విద్యారంగం కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.చిన్నారుల బంగారు భవిష్యత్తుకు ప్రాథమిక విద్యే పునాది అని, ఇందులో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు



సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాసులు.ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ .బాపట్ల మండల విద్యాశాఖాధికారులు .అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, ఉపాధ్యాయులు, కూటమి పార్టీల నేతలు మరియు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రిమాండ్ ఖైదీ పరారీతో ఇరువురు అధికారుల పై చర్యలు

**రేపల్లె, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** గుంటూరు ప్రభుత్వ వైద్యశాల నుంచి పరారైన రేపల్లె సబ్‌జైలు రిమాండ్ ఖైదీ వ్యవహారంపై సబ్‌జైలు అధికారులపై గుంటూరు రేంజ్ జైళ్ళశాఖ డిఐజి ఎం.వరప్రసాద్ చర్యలు తీసుకున్నారు.రిమాండ్ ఖైదీ భీముడు అజిత్‌కుమార్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.ఈ కేసు దర్యాప్తులో భాగంగా వరుస వారీగా రేపల్లె సబ్ జైలు సూపరింటెండెంట్ మన్నెం వెంకటేశ్వరరావు,హెడ్ వార్డర్ గురవరావులను విధుల నుండి సస్పెండ్ చేశారు.ఆన్‌లైన్ నగదు లావాదేవీలలో దొరికిన ఆధారాల కారణంగా సబ్‌జైలు సూపరింటెండెంట్‌పై వేటు పడింది.ఖైదీ కస్టడీలో ఉన్నప్పుడు,సబ్‌జైలు నుండి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించే వ్యవహారంలో నిబంధనలు పాటించలేదనే కారణం చూపుతూ హెడ్ వార్డర్ గురవరావును సస్పెండ్ చేశారు.ప్రొసీజర్ ల్యాప్స్‌కు బాధ్యుడుగా గురవరావును డిఐజి గుర్తించారు.గుంటూరు జిజిహెచ్ నుండి రిమాండ్ ఖైదీ అజిత్ కుమార్ పరారైన దృశ్యాలు సిసి ఫుటేజ్‌లో కనుగొన్నారు.రిమాండ్ ఖైదీ పరారీ వ్యవహారంపై రేపల్లె సబ్ జైలులో గత శుక్రవారం డిఐజి వరప్రసాద్ దర్యాప్తు చేసి వెళ్ళాక నాలుగు రోజులకే హెడ్‌వార్డర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు.నాలుగు రాష్ట్రాలలో నేరాలు చేసిన అజిత్‌కుమార్ కోసం గుంటూరు,తెనాలికి చెందిన





పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి అన్వేషణ ముమ్మరం చేశారు.తమిళనాడు రాష్ట్రంలోని అజిత్‌కుమార్ సోదరి నుంచి రూ.60 వేలు ఆన్‌లైన్ ద్వారా రేపల్లె సబ్ జైల్ సూపరింటెండెంట్‌కు అందిన నేపథ్యంలో ఆ కోణంలో కూడా దర్యాప్తును ముమ్మరం చేశారు.రిమాండ్ ఖైదీ పరారీ, అధికారులపై ఉన్నతాధికారులు తీసుకుంటున్న చర్యలలో భాగంగా రేపల్లె సబ్‌జైల్‌లో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది.ఎటువంటి సమాచారం బయటకు రానివ్వడంలేదు.గుంటూరు రేంజ్ జైళ్ళశాఖ డిఐజి వరప్రసాద్ మా త్రమే రిమాండ్ ఖైదీ పరారీ వ్యవహారంపై చోటుచేసు కున్న పరిణామాలను బహిర్గతం చేస్తున్నారు.ఇదిలా ఉంటే ఎవరిపై ఎటువంటి చర్యలు ఉంటాయోనని రేపల్లె సబ్ జైలు సిబ్బందిలో భయాందోళన నెలకొంది.గుంటూరు ప్రభుత్వ వైద్యశాల నుంచి రిమాండ్ ఖైదీ పరారీకి కారకులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో రిమాండ్ ఖైదీ అజిత్‌కుమార్ పారిపోయేంత వరకు విధి నిర్వహణలో ఉన్న ఎఆర్ పోలీసులు,వారి బంధువుల బ్యాంకు ఖాతాలను పరిశీలించి అనుమానస్పద లావాదేవీలు లేవని సంబంధిత అధికారులు గుర్తించారు.ఆన్‌లైన్ నగదు లావాదేవీలకు రేపల్లె సబ్ జైల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు పాల్పడిన ఉదంతాన్ని దృష్టిలో ఉంచుకునే గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో రిమాండ్ ఖైదీకి కాపలాగా ఉన్న పోలీసుల బ్యాంకు ఖాతాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సి వచ్చింది.ఏలూరు జిల్లా పెదవేగి మండలంలోని నాగన్నగూడెంకు చెందిన భీముడు అజిత్‌కుమార్‌పై నాలుగు రాష్ట్రాలలోనూ 32 కేసులు ఉన్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. తెనాలి 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఓ నేరంపై అజిత్‌కుమార్‌ను అరెస్ట్ చేసిన నేపథ్యంలో తెనాలి కోర్టు రిమాండ్ విధించడంతో రేపల్లె సబ్ జైలుకు తరలించారు.రిమాండ్ ఖైదీగా ఉంటూ అనారోగ్యం కారణం చూపుతూ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చేరడం అక్కడి నుండి పరారవడం రేపల్లె సబ్‌జైలు సూపరింటెండెంట్, హెడ్ వార్డర్‌లపై డిఐజి చర్యలు తీసుకోవడం జరిగింది.రిమాండ్ ఖైదీ అజిత్‌కుమార్‌ను పోలీసులు అదుపుతీసుకోవడంలో ఈ కేసు పరిణామాలు ఎటుదారితీస్తాయో వేచిచూడాల్సిందే.

# పరిశోధనలతోనే రైతుకు భరోసా

**బాపట్ల,ఏప్రిల్ 28: ప్రభాతవార్త ప్రతినిధి:** వ్యవసాయ రంగంలో విద్యార్థులు చేసే వినూత్న పరిశోధనలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా, రైతాంగానికి మేలు చేసే ఆవిష్కరణలుగా మారాలని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ పి.వి. సత్యనారాయణ



అన్నారు.బాపట్ల వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన పీజీ విద్యార్థుల జాతీయ సదస్సు ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూవిధాన నిర్ణేతలకు దిక్సూచిపీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు సమర్పించే ప్రతి పరిశోధన పత్రాన్ని ప్రచురించడం ద్వారా వారి మేధస్సు ప్రపంచానికి తెలుస్తుందన్నారు.ఈ పరిశోధనలు ప్రభుత్వ విధానాల రూపకల్పనలో, కొత్త చట్టాలు తీసుకురావడంలో పాలసీ మేకర్లకు ఒక అవగాహనను కల్పిస్తాయన్నారు.తద్వారా క్షేత్రస్థాయిలో రైతులకు లబ్ధి చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.దేశవ్యాప్తంగా 14 విశ్వవిద్యాలయాల నుంచి సుమారు 810 మంది పీజీ విద్యార్థులు పాల్గొని తమ పరిశోధనలను సమర్పించారు.విద్యార్థుల డిమాండ్ దృష్ట్యా వర్సిటీలో పీజీ సీట్ల సంఖ్యను పెంచే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు.అత్యాధునిక వసతులు: వినూత్న ఆవిష్కరణల దిశగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ల్యాబ్‌లలో అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ, దేశంలోనే మొట్టమొదటిసారిగా 'నేచురల్ ఫార్మింగ్' (ప్రకృతి వ్యవసాయం) డిగ్రీ కోర్సును ప్రవేశ పెడుతున్నామన్నారు.సేంద్రియ పద్ధతుల ద్వారా భూసారాన్ని పెంచడం, భావితరాలకు విషరహిత పౌష్టికాహారాన్ని అందించడమే ఈ కోర్సు ప్రధాన ఉద్దేశమన్నారు.రైతు ఆదాయం పెంపుప్రస్తుతం 1.3 గా ఉన్న నేల సామర్థ్యాన్ని 1.5 కు పెంచడమే లక్ష్యంగా పరిశోధనలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. పండించిన పంటకు విలువ ఆధారితం జోడించడం ద్వారా రైతు నికర ఆదాయం పెరిగేలా విశ్వవిద్యాలయం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

# క్యాన్లలో పెట్రోల్,డీజిల్ పోయరాదు : కలెక్టర్

**నిజాంపట్నం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** పెట్రోల్, డీజిల్ ఆయిల్ కోసం వచ్చే ప్రజలకు క్యాన్లలో పోయరాదని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం మండలంలోని కూచినపూడిలో ఉన్న లక్ష్మీ శ్రీనివాస ఫిల్లింగ్ స్టేషన్లో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ఆయిల్‌లను క్యాన్లలో నిల్వ చేయటం నేరమన్నారు. ప్రజలకు అవసరమైనంత ఆయిల్ నిల్వలు ఉన్నాయని తెలియజేశారు. అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రజలు సహకరించాలని కోరారు. ప్రమాదం జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మోటార్ వాహనాలలో మాత్రమే పెట్రోల్, డీజిల్ ఆయిల్‌ను పోయించుకోవాలని సూచించారు. క్యాన్లలో పోయరాదని బంక్ యజమానులను ఆదేశించారు. అనంతరం బొర్రావారిపాలెంలో నిర్మాణంలో ఉన్న పలు ప్రభుత్వ పనులను ఆయన పరిశీలించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. మంచినీటి చెరువు చుట్టూ పూల మొక్కలు





నాటాలని సూచించారు. గ్రామాన్నిపరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ అనంతరాజు, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎఇ చక్రవర్తి, పంచాయితీ కార్యదర్శి, విఆర్‌ఓ, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ సంపద కేంద్రాల పై అవగాహన అవసరం

**కొల్లిపర, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** స్వచ్ఛ సంపద కేంద్రాల పనితీరుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఇన్‌ఛార్జి ఎంపిడివో భార్గవ్ అన్నారు.మంగళవారం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డిప్యూటీ ఎంపిడివో దానయ్య అధ్యక్షతవహించారు.ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ రహదారుల పక్కన చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు.స్వచ్ఛ సంపద ప్రాధాన్యత గురించి ప్రజలలో అవగాహన పెంపొందించాలని సూచించారు.గ్రామీణ ప్రాంత ప్రజలు మరుగుదొడ్లను వినియోగించుకునేలా చూడాలని చెప్పారు.బహిరంగ మల విసర్జన చట్టరీత్యా నేరమని ఆయన తెలిపారు.ఈ దిశగా పంచాయతీ కార్యదర్శులు ప్రజలను చైతన్యపర్చాలని చెప్పారు.అంటువ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదాన్ని తెలియజేయాలన్నారు.కాల్వల్లో మురుగునీరు తొలగింపుపై





చర్యలు తీసుకోవాలని చెప్పారు.పారిశుధ్యంపై తగిన శ్రద్ధ తీసుకోవాలని భార్గవ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి కిశోర్‌కుమార్,హౌసింగ్ ఎఇ పద్మావతి,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇంధనం కొరత నివారించాలని సిపిఎం నిరసన

**రేపల్లె, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** ఇంధనం కొరత నివారించాలని వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా డీజిల్,పెట్రోల్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం,సిఐటియుల ఆధ్వర్యంలో మంగళవారం రేపల్లె ఆర్టీసీ బస్టాండ్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆటోలకు తాళ్ళు కట్టి లాగుతూ ఆవేదన వెలుబుచ్చారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య మాట్లాడుతూ అంతర్జాతీయ యుద్ధ పరిస్థితుల కారణంగా ఇంధనం,గ్యాస్ సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమస్యలను అధిగమించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.తమిళనాడు ,కర్నాటక రాష్ట్రాలలో ప్రజల అవసరాలకు తగిన విధంగా





డీజిల్ సరఫరా జరుగుతుంటే ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు రోజులుగా ఇంధనం కొరత నెలకొందని చెప్పారు.రవాణా రంగంలో ఆటో డ్రైవర్లు, వ్యవసాయానికి డీజిల్ పై ఆధారపడిన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని ఆయన తెలిపారు.ప్రభుత్వం,ఉన్నతాధికారులు డీజిల్ కొరత లేదని ప్రకటించడం వాస్తవాలకు విరుద్ధంగా ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వం ఆయిల్ ధరలు పెంచే పరిస్థితి కన్పిస్తున్నదన్నారు.అమెరికా వైఖరిపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టమైన వైఖరి ప్రకటించకపోవడం శోచనీయమన్నారు.సిఐటియు జిల్లా కోశాధికారి సిహెచ్.మణిలాల్ మాట్లాడుతూ ప్రజల అవసరానికి సరిపడా డీజిల్ సరఫరా జరగడం లేదన్నారు.బాపట్ల జిల్లా తీరప్రాంతం అయినందున ఆక్వా ఉత్పత్తుల రవాణా, వ్యవసాయానికి డీజిల్ అవసరం కీలకమని చెప్పారు.రేపల్లెలో ఏ పెట్రోల్ బంకులో కూడా డీజిల్ లేదని మణిలాల్ తెలిపారు.ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు టి.కృష్ణమోహన్,జె. దర్మరాజు,బి.ఆగస్టీన్,కె.ఆశీర్వాదం,వై.నవీన్,కె.రమేష్,ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు .విజయ్, చినబాబు,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ కార్యదర్శికి సత్కారం

**కొల్లిపర, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** మండలంలోని తూములూరు సచివాలయం కార్యదర్శి జి.రవికుమార్‌ను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు.100 శాతం ఇంటి పన్ను వసూలు చేసిన



సందర్భంగా రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నందుకు రవికుమార్‌ను సత్కరించారు.గుంటూరు జిల్లాలో మొదటి ఐదు స్థానాలలో పన్ను రికవరీలో తూములూరు గ్రామం ఉండటం అభినందనీయమని వక్తలు ప్రశంసించారు.రవికుమార్ సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఉయ్యూరు ఉమామహేశ్వరరెడ్డి, కె.శ్రీహరిరెడ్డి,ఉయ్యూరు మాధవరెడ్డి,కొల్లా సత్యనారాయణ,మర్రెడ్డి సుధీర్‌రెడ్డి,పంచాయతీ బోర్డు మాజీ సభ్యులు మర్రెడ్డి బ్రహ్మారెడ్డి,అవుతు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి మల్లెపూల పూజ

**పెదనందిపాడు ఏప్రిల్ 28 (ప్రభాతవార్త) :** నాగులపాడు లో శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా



మంగళవారం స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు. రాత్రికి సుహాసినిలచే స్వామివారికి మల్లెపూల పూజ కన్నులు పండుగ నిర్వహించారు. మల్లెల పూజా కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవాలయ పాలకవర్గ సభ్యులు. స్వామి వార్ల పూజకు అన్ని విధాల సహకరిస్తూ భక్తుల మన్ననలను పొందుతున్నారు.

## రాజుకాల్వలో రొయ్యలకు విబ్రియో వ్యాధి లక్షణాలు

**రేపల్లె, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** రొయ్యల సాగుదారుల సమస్యలను పరిశీలించేందుకు మంగళవారం రేపల్లె మండలంలోని రాజుకాల్వ ప్రాంతంలో కాకినాడ ఎస్ఐఎఫ్‌టి కేంద్రంకు చెందిన ఎన్ఎస్‌పిఎఎడి బృందం పర్యటిం చింది.రొయ్యల చెరువుల తీరు తెన్నులను గమనించింది. రొయ్యలకు విబ్రియో వ్యాధి సోకినట్లు భావించారు. ఈ వ్యాధిని నిర్ధారించేందుకు రైతు శ్రీనివాస్ చెరువు నుండి రొయ్యల నమూనాలను సేకరించారు.ప్రయోగశాలకు పంపి తదుపరి చర్యలు తీసుకుంటామని రైతులు టి.రాజబాబు, వై.వి. నరసింహారావులకు ఎన్ఎస్‌పిఎఎడి



బృందం అవగాహన కల్పించింది.ట్రాన్స్ లూసెంట్ పోస్ట్ లార్వల్ డిసీజ్ గురించి వివరించారు.వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు రొయ్యల పెంపకంలో జీవభద్రతా చర్యలను పాటించడం గురించి తెలియజేశారు.రొయ్యల ఉత్పాదకతను మెరుగుపరచడానికి అవసరమైన సలహాలు,సూచనలిచ్చారు.ఈ బృందంలో సహాయ సంచాలకులు పి.కిరణ్‌కుమార్,మత్స్య శాఖ అభివృద్ధి అధికారి ఎస్.కె.కౌసర్,ఎన్ఎస్ చైతన్య,డి.వంశీ,సిహెచ్.బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులలో సృజనాత్మక శక్తిని వెలికితీయాలి

**రేపల్లె, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** విద్యార్థులలోని సృజనాత్మక శక్తిని బాలవికాస్ కేంద్రాలు వెలికితీస్తాయని సమరసతా సేవ సమితి జిల్లా సంస్కృతి ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ చెప్పారు.మంగళవారం అద్దేపల్లి శ్రీ రామనామ క్షేత్రం కళ్యాణ మండపంలో బాలవికాస్ కేంద్రాల వార్షికోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మరదాప కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులలో ప్రతిభను గుర్తించేందుకు ఆటల,పాటల



పోటీలు దోహదపడతాయని చెప్పారు.సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ బహుమతులను అందజేయడం అభినందనీయమన్నారు.చదువు సంస్కారం,ఆట,పాట,కళల బడిగా బాలవికాస కేంద్రాలు పనిచేస్తున్నాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో బి.విజయలక్ష్మి,వెంకటేశ్వర్లు,బి.శ్రీనివాసరావు,ధర్మ ప్రచారక్‌లు జంజనం హేమశంకరరావు,చింతల మురళీకృష్ణ,వేల్పూరి శ్రీనివాసరావు,జాతీయ ఉత్తమ కళాకారుడు అవార్డు గ్రహీత,లిమ్కా బుక్ రికార్డు గ్రహీత వల్లభనేని సత్యసాయిబాబు,ౕకె.రవికుమార్, బి.శ్రీనివాసరావు,కె.భార్గవి,ఎస్.నిర్మల జ్యోతి, అనూష,బి.శ్రీదేవి, వి.అనసూయ,లక్ష్మి,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

**కొల్లిపర, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** విద్యార్థులు సెల్ ఫోన్లను దూరంగా పెట్టి విజ్ఞానాన్ని పెంపొందించే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారిణి ఎం.సత్యమ్మ కోరారు.మంగళవారం మండలంలోని తూములూరు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని





చెప్పారు.ఉదయం 8 గంటల నుండి ఉదయం 11 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు.జూన్ నెల 6వ తేదీ వరకు 40 రోజుల పాటు శిక్షణ తరగతులను విద్యార్థులు ఉపయోగించుకోవాలని సత్యమ్మ సూచించారు.వల్లభాపురం,మున్నంగి గ్రామాలలోని లైబ్రరీలలో విజ్ఞాన సదస్సులు జరిగాయి.ఈ కార్యక్రమాలలో జ్యోతి,బి.సాంబశివ నాయక్,విద్యార్థులు,ప్రజలు పాల్గొన్నారు.

## బుర్రి కుమార్ రాజుకు ఘన సన్మానం

**గుంటూరు కల్చరల్,ఏప్రిల్ 28,ప్రభాతవార్త :** గుంటూరు జిల్లా రచయితల సంఘం కార్యదర్శి,కవి బుర్రి కుమార్ రాజు విశాఖపట్నం జిల్లా పరిషత్ హాల్లో దక్షిణ నియోజకవర్గ శాసనసభ సభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్,ప్రముఖ గాయకులు డాక్టర్ గజల్ శ్రీనివాస్,శ్రీశ్రీ జయంతి సందర్భంగా నిర్వహించిన వైశాఖీ కవితా తరంగిణీ జాతీయ కవి సమ్మేళనంలో విశాఖ పట్నం విశ్వసాహితీ అధ్యక్షుడు మరోచరిత్ర అను వచన



కవిత్వంతో కవితాగానం చేసి అలరించిన బుర్రి కుమార్ రాజును విశ్వసాహితీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు కొల్లి రమావతి,జాతీయ కార్యదర్శి శ్రీకాంత్ మరియు ముఖ్య అతిథుల సమక్షంలో మెమెంటో,దుశ్శాలువా, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా గుంటూరు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభానీ,బండికల్లు జమదగ్ని మరియు నానా,బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి,జానీభాషా,ప్రభాకర్ పలువురు సాహితీ మిత్రులు అభినందనలు తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం

**కొల్లిపర, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** మండలంలోని దావులూరిపాలెంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై హైదరాబాద్ సిఆర్ఐఎస్‌పి సంస్థ,అఘాఖాన్



ఫౌండేషన్‌కు చెందిన 20 మంది అధ్యయనం చేశారు.ఈ బృందానికి ప్రకృతి వ్యవసాయ శాఖ ఎడిఎ రాజకుమారి స్వాగతం పలికారు.రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రకృతి వ్యవసాయం అమలు,పురోగతితో పాటు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు,నేల సారవంతం,రైతు స్థిరత్వం తదితర అంశాలను రాజకుమారి వివరించారు.బాజీమృతం,ఘన జీవామృతం,ద్రవ జీవామృతం తయారీ గురించి ప్రదర్శనల ద్వారా వారికి తెలియజేశారు.ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన అరటి,కూరగాయల పంటలను సిఆర్ఐఎస్‌పి సంస్థ,అఘాఖాన్ ఫౌండేషన్ బృందం సభ్యులు పరిశీలించారు.రైతుల అనుభవాలను తెలుసుకుని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎడిపిఎం సత్యనారాయణ,ఆర్‌వైఎస్ఎస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ విజయకుమార్,మహిళా అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ మోసాలపై ప్రజలను నిరంతరం చైతన్యం చేయడమే పరిష్కారం

**గుంటూరు కల్చరల్,ఏప్రిల్ 28,ప్రభాతవార్త :** విపరీతంగా పెరుగుతున్న డిజిటల్ మోసాల నేపథ్యంలో రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చొరవతో 4ప్రతిపాదనలతో కూడిన ఒక చర్చాపత్రాన్ని విడుదల చేసిందని దీనిపై అందరూ చర్చించి తమ అభిప్రాయాలను తెలియజేయాలని అవగాహన సంస్థ సభ్యుల సమావేశంలో పాల్గొన్న వక్తలు విజ్ఞప్తి చేశారు.డిజిటల్ మోసాలు రిజర్వ్ బ్యాంక్ తీసుకుంటున్న చర్యలు అన్న అంశంపై అభిప్రాయ సేకరణ జరిగింది.సీనియర్ సిటిజన్స్ నాయకులు ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ డిజిటల్ మోసాల సమస్య దృష్ట్యా ఆర్‌బిఐ తీసుకుంటున్న చర్యలు అవసరమేనని అయితే కొద్దిమంది మోసగాళ్ళను పట్టుకోవడానికి కోట్లాదిమంది సామాన్య ప్రజలను చిరువ్యాపారులను ఇబ్బందులకు గురిచేయకుండా నిర్ణయాలు తీసుకోవాలన్నారు.

# ఈశాన్య ప్రాంతం 'భారత్ అష్టలక్ష్మి'

- సిక్కిం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- 'యాక్ట్ ఈస్ట్' దాటి 'యాక్ట్ ఫాస్ట్'గా చేస్తున్నాం
- రాష్ట్ర అవిర్భావ 50వ వార్షికోత్సవ ముగింపు వేడుకల్లో ప్రధాని మోడీ
- రూ.4 వేల కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం



**గ్యాంగ్‌టక్, ఏప్రిల్ 28:** సిక్కిం, ఈశాన్య ప్రాంతం భారత దేశానికి ముఖ్య భాగాలే కాదని, అవి అష్టలక్ష్మి లాంటివి అని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. మంగళవారం పాల్జోర్ స్టేడి యంలో నిర్వహించిన సిక్కిం రాష్ట్ర అవిర్భావ 50వ వార్షికోత్సవ వేడుక ముగింపు కార్యక్రమంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సిక్కింలో రూ. 4,000 కోట్లకు పైగా మొత్తం వ్యయంతో 30కి పైగా అభివృద్ధి ప్రాజెక్ట్ లను ప్రారంభించి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రజాసభలో ప్రధాని ప్రసంగిస్తూ, ఈశాన్య ప్రాంతం భారతదేశపు 'అష్టలక్ష్మి ' అని, ఈ హిమాలయ రాష్ట్రం అందులో ఒక ముఖ్యమైన భాగమని ఆయన ఉద్ఘాటించారు. ఈశాన్య ప్రాంతంలో అభివృద్ధిని వేగవంతం చేయడానికి కేంద్రం 'యాక్ట్ ఈస్ట్' విధానాన్ని దాటి 'యాక్ట్ ఫాస్ట్' విధానానికి మారిందని ఆయన అన్నారు. సిక్కిం పర్యాటక సామర్థ్యాన్ని వెలికితీయడంలో అనుసంధానం పాత్రను ప్రధాని మోడీ నొక్కి చెప్పారు. నిర్మాణంలో ఉన్న సెవోక్‌రాంగ్‌పో రైల్వే లైన్ గురించి ప్రస్తావిస్తూ, ఇది రాష్ట్రానికి మొదటిసారిగా రైలు అనుసంధానాన్ని తీసుకువస్తుందని ఆయన పేర్కొన్నారు. బాగ్డోగ్రాను గాంగ్‌టక్‌తో కలిపే ప్రతిపాదిత ఎక్స్‌ప్రెస్‌వే ప్రయాణ సమయాన్ని తగ్గిస్తుందని వివరించారు. సిక్కిం దట్టమైన అటవీ విస్తీర్ణం, పక్షులు, సీతాకోకచిలుకల జాతుల వైవిధ్యం కారణంగా, దాని జీవవైవిధ్యం, సహజ ప్రకృతి దృశ్యాలు సందర్శకులను ఆకర్షిస్తూనే ఉన్నాయని ఆయన అన్నారు. రాష్ట్రంలో పర్యాటకం ఒక కీలకమైన జీవనోపాధి వనరుగా ఉందని పేర్కొన్నారు. సిక్కిం పూర్తి సేంద్రియ రాష్ట్రంగా ఉన్న స్థితిని ప్రధాని మోడీ ప్రముఖంగా ప్రస్తావిస్తూ, దానిని సుస్థిర వ్యవసాయానికి ఒక నమూనాగా అభివర్ణించారు. ప్రాసెసింగ్ మౌలిక సదుపాయాల మద్దతుతో పెద్ద యాలకులు, అల్లం, పసుపు వంటి స్థానిక ఉత్పత్తులు విస్తృత మార్కెట్లకు చేరు తున్నాయని ఆయన అన్నారు. సమాజం నేతృత్వంలోని పర్యా వరణ కార్యక్రమాలను కూడా ఆయన ప్రస్తావించారు. పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి దిశగా నిరంతర కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిక్కిం పర్యాటకాన్ని, కనెక్టివిటీని ప్రధానమంత్రి ప్రశంసించారు. దేశ ప్రజలు కనీసం ఒక్కసారైనా సిక్కింను సందర్శించాలని ప్రధాని మోడీ కోరారు.

'ఆ రాష్ట్రం ప్రశాంతంగా, పరిశుభ్రంగా ఉంటుందని ఆయన అభినందించారు,' అని ఆయన అన్నారు. అంతేకాకుండా, వందే భారత్ రైలు కనెక్టివిటీ త్వరలోనే సిక్కింకు చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నేడు ప్రారంభించిన ప్రాజెక్టులు మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తాయని, ఉపాధిని కల్పిస్తాయని, జాతీయ వృద్ధి నెట్‌వర్క్‌లతో రాష్ట్ర అనుసంధానాన్ని బలోపేతం చేస్తాయని ప్రధానమంత్రి అన్నారు. 'వికసిత్ భారత్' విస్తృత దార్శనికతకు అనుగుణంగా అభివృద్ధి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి సమిష్టి కృషి చేయా లని ఆయన పిలుపునిచ్చారు.

**'ప్రధానమంత్రే మా ఆదర్శం'**

సిక్కిం రాష్ట్ర అవిర్భావ 50వ వార్షికోత్సవాల ముగింపు వేడుకల్లో ప్రదర్శన ఇచ్చిన కళాకారులు, తమ ప్రసంగంలో తమను గుర్తించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధాని మోడీ రాష్ట్ర పర్యటన సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శన ఇచ్చిన బృందంలో భాగమైన 'మ్యూజిక్ ఇన్ మోషన్ డాన్స్ అకాడమీ' ఆర్ట్ డైరెక్టర్ ప్రవేశ్ తమాంగ్ మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి పేరు చెప్పి వారిని గుర్తించినందుకు ప్రధాని మోడీని ప్రశంసించారు. 'మా ప్రతిభను గుర్తించినందుకు ప్రధానమంత్రికి చాలా ధన్యవాదాలు. ఆయన ప్రసంగం విన్న తర్వాత మాలో చాలా ఉత్సాహం నిండింది. ఆయన ప్రసంగం యువతకు కూడా స్ఫూర్తినిస్తుంది. ప్రధానమంత్రి మా ఆదర్శం,' అని పేర్కొన్నారు.

### అమెరికా దిగ్బంధనాన్ని

# తప్పించుకున్న 34 ట్యాంకర్లు

### వాటిలో 14 భారత్ నౌకలు కూడా

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** హర్మ్యూజ్ జలసంధిలో ఇరాన్‌ను కట్టడి చేసేందుకు అమెరికా విధించిన నౌకా దిగ్బంధనం పూర్తిగా ఫలించడం లేదు. అమెరికా నౌకాదళ నిఘా ఉన్నప్పటికీ డజన్ల కొద్దీ ఆయిల్ ట్యాంకర్లు ఈ మార్గం గుండా తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాయి. ఇటీవల ఇరాన్ నుంచి వస్తున్న దేశ్ గరిమ అనే భారత నౌక మార్గమధ్యంలో కాల్పులకు గురైనా సురక్షితంగా ముంబై తీరానికి చేరుకుంది. ఈ నౌక ఖతార్‌లోని రాస్ లఫాన్ నుంచి 97వేల టన్నుల ముడి చమురును తీసుకువచ్చింది. ఈనెల 13న అమెరికా దిగ్బంధనం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 30కి పైగా ట్యాంకర్లు హర్మ్యూజ్ జలసంధిని దాటినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇరాన్‌తో సంబంధం ఉన్న 34 ట్యాంకర్లు అమెరికా దిగ్బంధనాన్ని తప్పించుకున్నాయని ఇటీవల వార్తలు వెలువడ్డాయి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 14 భారత నౌకలు ఉన్నాయని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. దిగ్బంధనాన్ని తప్పించుకోవడానికి నౌకలు రెండు ప్రధాన మార్గాలను అనుసరిస్తున్నట్లు నిపుణులు చెపుతున్నారు. మొదటిది, ఇరాన్ తీరం వెంబడి ప్రయాణించి, పాకిస్థాన్ ప్రాదేశిక జలాల్లోకి ప్రవేశించి, ఆ తర్వాత అంతర్జాతీయ జలాల ద్వారా అరేబియా సముద్రంలోకి రావడం. రెండోది, ఇరాన్‌లోని చాబహార్ ఓడరేవు వరకు తీరం వెంబడి ప్రయాణించి, అక్కడి నుంచి నేరుగా అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించి భారత్ వైపు రావడం. అంతర్జాతీయ సముద్ర చట్టాల ప్రకారం, ఒక దేశ ప్రాదేశిక జలాల్లోకి మరో దేశ నౌకాదళం అనుమతి లేకుండా ప్రవేశించలేదు. ఇదే ఇరాన్ నౌకలకు కలిసొస్తున్న అంశం. అయితే, భారత నౌకలు పాకిస్థాన్ జలాలను ఉపయోగించడం అసంభవమని, అనవసరమైన రిస్క్ అని భారత నౌకాదళానికి చెందిన ఒక రిటైర్డ్ సీనియర్ అధికారి అభిప్రాయపడ్డారు. అమెరికా దిగ్బంధం ఇరాన్ ఓడరేవుల నుంచి వచ్చే నౌకలను లక్ష్యంగా చేసుకున్నప్పటికీ, భారత నౌకల వంటి తటస్థ నౌకలకు ప్రత్యక్ష ముప్పు పరిమితంగానే ఉంటుందని ఆయన తెలిపారు. భారత విదేశాంగ శాఖ దౌత్యపరమైన చర్చల ద్వారా నౌకల రాకపోకలకు మార్గం సుగమం చేస్తుందని, ఆ తర్వాత భారత నౌకాదళం గల్ఫ్ ఆఫ్ ఒమాన్‌లో ఆ నౌకలను కలుసుకుని సురక్షితంగా భారత తీరాలకు ఎస్కార్ట్ చేస్తుందని వివరించారు. ఈ పద్ధతిలో పాకిస్థాన్ జలాల్లోకి ప్రవేశించాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. మొత్తం మీద, అమెరికా నౌకాదళ శక్తికి కూడా కొన్ని పరిమితులు ఉన్నాయని, ప్రాదేశిక జలాలను ఉపయోగించుకుని ఇరాన్ నుంచి ముంబైకి చమురు రవాణా సాధ్యమవుతోందని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.



# ఉగ్రవాదులకు సాయంచేసేవారిపైనా చర్యలు

### ఎస్‌సిఒ రక్షణ మంత్రుల సమావేశంలో రాజ్‌నాథ్‌సింగ్

**బిష్కెక్, ఏప్రిల్ 28:** ఉగ్రవాదులకు సాయపడుతూ, ఆశ్రయం కల్పించేవారిపై చర్యలు తీసుకోవడంలో షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) వెనుకాడకూడదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలు అందుకు తగిన పరిణామాలను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కిర్గిస్థాన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రక్షణమంత్రి మాట్లాడుతూ గత సంవత్సరం జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి యావత్ మానవాళిని కుదిపేసిందని అన్నారు. ఆ తర్వాత భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి, ఉగ్రవాదులు ఎక్కడున్నా తప్పించుకోలేరని నిరూపించిందని అన్నారు. ఉగ్రవాదం ప్రపంచానికి ప్రధాన సమస్యగా మారిం దని ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్రవాదం, ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఉగ్రవాద బెదిరింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందని అన్నారు. ప్రభుత్వ మద్దతుతో జరిగి సీమాంతర ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించకూడదని ఈ సందర్భంగా కోరారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదని వ్యాఖ్యానించారు.



ఉగ్రవాదులకు సాయపడుతూ, ఆశ్రయం కల్పించేవారిపై చర్యలు తీసుకోవడంలో షాంఘై సహకార సంస్థ ముందుండాలని కోరారు. గత కొన్నేళ్లుగా జరుగుతున్న వరుస ఘర్షణల కారణంగా ఎంతోమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ఇటీవలి యుద్ధాలను ఉద్దేశించి అన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలు అందుకు తగిన పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

పహల్గామ్ ఉగ్రదాడి ఘటన యావత్ మానవాళిని కుదిపేసిందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆ దాడి అనంతరం ఆపరేషన్ సింధూర్ చేపట్టి ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తప్పించుకోలేరని భారత్ నిరూపించిందని తెలిపారు. ఉగ్రవాదమే ప్రపంచానికి ప్రధాన ముప్పుగా మారిందని వ్యాఖ్యానించారు. తీవ్రవాదం, ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ పేరు ప్రస్తావించకుండా ప్రభుత్వ మద్దతుతో జరిగే సీమాంతర ఉగ్రదాడులను అస్సలు విస్మరించకూడదని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని అన్నారు.

ఉగ్రవాదులకు సాయపడుతూ ఆశ్రయం కల్పించే వారిపై చర్యలు తీసుకోవడంలో ఎస్‌సీవో వెనకాడకూడదని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభం గురించి రక్షణమంత్రి మాట్లాడారు. గత కొన్నేళ్లుగా జరిగిన వరుస ఘర్షణల్లో అనేకమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, భారీ ఆస్తి నష్టం కూడా వాటిల్లిందని చెప్పారు. ఉగ్రవాద బెదిరింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఈ క్రమంలో ఉద్రిక్తతల పరిష్కారానికి దౌత్య మార్గాలను అనుసరించాలన్నారు.

# మూడు షరతులు అంగీకరిస్తే యుద్ధం ముగిస్తాం

### హర్మ్యూజ్ జలసంధిని తెరుస్తాం: ఇరాన్

**టెహ్రాన్, ఏప్రిల్ 28:** అమెరికాతో నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించుకుని, యుద్ధానికి ముగింపు పలికేందుకు ఇరాన్ ముందుకు వచ్చింది. ప్రస్తుతం అమెరికా ఫోకస్ ఎక్కువ ఉన్న హర్మ్యూజ్ జలసంధిని తిరిగి తెరుస్తామని, అందుకు తమ షరతులను అంగీకరించాలని అమెరికాకు ప్రతిపాదించింది. ఒమన్, పాకిస్థాన్ వంటి మధ్యవర్తుల ద్వారా టెహ్రాన్ తన ప్రణాళికను పంపింది. ఇరాన్ పెట్టిన షరతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి మధ్యవర్తిత్వ దేశాల ద్వారా అమెరికాకు మూడు షరతులతో కూడిన ప్రతిపాదనను పంపారు. ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన నౌకా దిగ్బంధనాన్ని పూర్తిగా ఎత్తివేయాలి, ఇరాన్ అణు కార్యక్రమంపై జరగాల్సిన చర్చలను వాయిదా వేయాలి. ఈ రెండు ప్రధాన షరతులకు అంగీకరిస్తే హర్మ్యూజ్ జలసంధిని వాణిజ్యానికి తెరిచి, యుద్ధ వాతావరణానికి తెరదించుతామని ఇరాన్ తెలిపింది. ఇరాన్ అణ్వాయుధాలను సొంతం చేసుకోకుండా నిరోధించడమే తన ప్రధాన లక్ష్యమని ట్రంప్ మొదటి నుంచి స్పష్టం చేస్తున్నారు. ఈ కారణంతోనే ఆయన యుద్ధానికి దిగారు. ఇప్పుడు ఇరాన్ ప్రతిపాదనలో అణు చర్చలను వాయిదా వేయాలన్న నిబంధన ఉండటమే ట్రంప్ అసంతృప్తికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. దీనిపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా స్పందించారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని మినహాయించి ఎలాంటి ఒప్పందాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఏ ఒప్పందం జరిగినా, అది ఇరాన్‌ను అణ్వాయుధం వైపు వెళ్లకుండా కచ్చితంగా నిరోధించేలా ఉండాలని ఆయన ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో అన్నారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ అమల్లో ఉంది. ప్రపంచ వాణిజ్యంలో ఐదో వంతు చమురు, గ్యాస్ రవాణా అయ్యే హర్మ్యూజ్ జలసంధి మూసివేత ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

# అమెరికా అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తోంది

### ట్యాంకర్ల స్వాధీనంపై ఇరాన్ రుసరుసలు

**టెహ్రాన్, ఏప్రిల్ 28:** అమెరికా, ఇరాన్ మధ్య సముద్ర జలాల్లో ఉద్రిక్తతలు మరోసారి తారస్థాయికి చేరాయి. ఇరాన్‌కు చెందిన రెండు ఆయిల్ ట్యాంకర్లను అమెరికా దళాలు స్వాధీనం చేసుకోవడం వివాదానికి దారి తీసింది. ఇది నడిసముద్రంలో జరిగిన సాయుధ దోపిడీ అని, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అమెరికా చర్య పైరసీని, సముద్రపు దోపిడీని చట్టబద్ధం చేయడమేనని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ ఆరోపించారు. అమెరికా ఈ చర్యను సమర్థించుకుంది. కోర్టు ఆమోదించిన వారెంట్ల ప్రకారమే చట్టబద్ధంగా ట్యాంకర్లను స్వాధీనం చేసుకున్నట్లు అమెరికా ప్రతినిధి జీనిన్ ఫెర్రిస్ పిర్రో తెలిపారు. హిందూ మహాసముద్రంలో అడ్డగించిన మెజెస్టిక్ ఎక్స్, టిఫానీ అనే రెండు నౌకల్లో దాదాపు 19 లక్షల బ్యారెళ్ల ఇరాన్ చమురు ఉందని ఆమె వెల్లడించారు. అక్రమ చమురు నెట్‌వర్క్‌లను అడ్డుకోవడంలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఇరాన్ విమానయాన సంస్థలకు ఇంధనం, క్యాటరింగ్ వంటి సేవలు అందించే కంపెనీలపై ఆంక్షలు విధిస్తామని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ హెచ్చరించారు. ఆపరేషన్ ఎకనామిక్ ఫ్యూరీ పేరుతో ఇరాన్‌పై గరిష్ఠ స్థాయిలో ఒత్తిడి పెంచుతామని ఆయన తెలిపారు. ఈ పరిణామాల్లో హర్మ్యూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి. చర్చలకు తాము తొందరపడటం లేదని, అణ్వాయుధాలు తయారు చేయబోమని ఇరాన్ హామీ ఇస్తేనే ఒప్పందం సాధ్యమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇరు దేశాలు తమ వైఖరికే కట్టుబడి ఉండటంతో, ప్రపంచంలోని అత్యంత కీలకమైన షిప్పింగ్ మార్గంలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.

# భారత్‌కు దావూద్ ఇబ్రహీం కింగ్‌పిన్ సలీమ్‌డోలా

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** అంతర్జాతీయ డ్రగ్ సిండికేట్‌పై భారత దర్యాప్తులో టర్కీలో అరెస్టైన దావూద్ ఇబ్రహీమ్ అనుచరుడు సలీమ్ డోలా ను భారత్‌కు తీసుకొచ్చారు. భారత్‌లో మాదకద్రవ్యాల స్మగ్లింగ్ కేసులో కీలక సూత్రధారిగా ఉన్న సలీమ్ డోలా రెండు రోజుల క్రితం టర్కీ లోని ఇస్తాంబుల్‌లో అరెస్టయ్యాడు. అతడిని తాజాగా భారత్‌కు అప్పగించడంతో అధికారులు ఈ తెల్లవారుజామున ఢిల్లీకి తీసుకొచ్చారు. డోలాను తరలించిన ప్రత్యేక విమానం మంగళవారం తెల్లవారుజామున ఢిల్లీ టెక్నికల్ ఎయిర్‌పోర్టులో దిగిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం అతడిని విచారణ నిమిత్తం సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థల ప్రాథమిక విచారణ పూర్తయిన అనంతరం.. డోలాను ముంబై పోలీసులకు లేదా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోకు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. కాగా సలీమ్ డోలా అరెస్టు అండర్‌వరల్డ్ డ్రగ్ మాఫియాకు గట్టి ఎదురుదెబ్బే అని చెప్పొచ్చు. దావూద్ ఇబ్రహీంకు చెందిన డికంపెనీ విదేశాల్లో నిర్వహించే డ్రగ్ ఆపరేషన్లకు డోలానే ప్రధాన సూత్రధారి. డోలా కనుసన్నల్లో ఏడాదికి రూ.5 వేల కోట్ల డ్రగ్స్ వ్యాపారం సాగుతోందనే అంచనాలు ఉన్నాయి. కొన్ని నెలల క్రితం డోలా నెట్‌వర్క్‌కు చెందిన సలీమ్ సోహైల్ షేక్ అనే డీలర్ దుబాయ్‌లో అరెస్టయ్యాడు. అతడిని భారత్‌కు అప్పగించిన తర్వాత ఈ డ్రగ్ నెట్‌వర్క్ తీగ లాగితే గత ఏడాది జూన్‌లో సలీమ్ డోలా కుమారుడు తాహెర్ పట్టుబడ్డాడు. తాహెర్‌ను కూడా యూఏఈ నుంచి భారత్‌కు తీసుకొచ్చి విచారించారు. ఈ క్రమంలోనే సలీమ్ డోలా ఆచూకీ లభించినట్లు తెలుస్తోంది.



# మతం అడిగి మరీ సెక్యూరిటీ గార్డులను కత్తితో పొడిచిన ఉన్మాది

**ముంబై, ఏప్రిల్ 28:** నగరంలో ఓ ఉన్మాది కత్తితో ఇద్దరు సెక్యూర్టీ గార్డులను మతం అడిగి మరీ దాడికి పాల్పడ్డాడు. నయా నగర్‌లో జరిగిన ఈ ఘటనలో నిందితుడిని 31 ఏళ్ల జైయిబ్ జుబీర్ అన్సారీగా గుర్తించారు. అయితే దాడికి ముందు అతను బాధితులను ఇస్లాం ప్రవచనం కల్మా చదవాలని బెదిరించినట్లు తెలిసింది. రాజ్‌కుమార్ మిశ్రా, సుబ్రోతో సేన్ వాక్‌హర్డ్ ఆస్పత్రి వద్ద ఓ బిల్డింగ్‌లో గార్డులుగా పనిచేస్తున్నారు. వారికి వద్దకు వెళ్లిన అన్సారీ అటాక్ చేశాడు. సోమవారం ఉదయం 4 గంటలకు ఆ దాడి జరిగినట్లు భావిస్తున్నారు. బాధితులు ఇద్దరూ ఆ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. మిశ్రా స్వయంగా ఆస్పత్రికి వెళ్లారు. తీవ్రంగా గాయపడ్డ సేన్‌ను నయాబ్ షేక్ అనే మరో వ్యక్తి ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అటాక్ జరిగిన 90 నిమిషాల తర్వాత అన్సారీని అరెస్టు చేశారు. సీసీటీవీ ఫూటేజ్‌ను స్కాన్ చేసి నిందితుడిని పట్టుకున్నారు. నయానగర్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ కేసు నమోదు చేశారు. హత్యాయత్నం, రెండు గ్రూపుల మధ్య శత్రుత్వం రెచ్చగొట్టే కేసులు పెట్టారు. థానే కోర్టులో నిందితుడిని ప్రవేశపెట్టారు. మే 4వ తేదీ వరకు అతన్ని కస్టడీలోకి తీసుకున్నారు.

దాడి పట్ల పోలీసులు, యాంటీ టెర్రర్ స్క్వాడ్ దర్యాప్తు కొనసా గిస్తు న్నారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయవద్దు అని పోలీసులు ప్రకటిం చారు. నిందితుడు అన్సారీకి చెందిన మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ డివైస్‌లను సీజ్ చేశారు. ఐసిస్, లోన్ వూల్ఫ్, జిహాద్, గాజా అన్న పదాలు అతని మొబైల్‌లో రాసి ఉన్నట్లు గుర్తించారు. అన్సారీ కుటుంబం ఇంకా అమెరికాలోనే ఉంటున్నది. అయితే అక్కడ అతనికి జాబ్ దొరక్కపోవడంతో ఇండియాకు రిటర్న్ వచ్చేశాడు. మీరా రోడ్డు ఏరియాలో అతను ఒంటరిగా నివస స్తున్నాడు. ఆన్‌లైన్‌లో కెమిస్ట్రీ పాఠాలు బోధిస్తూ సంపాదిస్తున్నాడు.

## న్యాయవాదిగా మారిన పెరరివలన్

**చెన్నై, ఏప్రిల్ 28:** భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో దోషిగా జైలుశిక్ష అనుభవించిన ఎమ్‌జీ పెరరివలన్ ఇపుడు న్యాయవాదిగా మారారు. తమిళనాడుపుదుచ్చేరి బార్ అసోసియేషన్ లో న్యాయవాదిగా ఆయన తన పేరు నమోదు చేసుకున్నారు. నాడు రాజీవ్ గాంధీ హత్య కేసులో 31 ఏళ్లపాటు జైలు జీవి తం గడిపిన పెరారివాళన్ 2022లో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు విడుదలయ్యారు. ఆ తర్వాత బెంగళూరులోని డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ లా కాలేజీలో న్యాయవిద్యను అభ్యసిం చారు. అక్కడ డిగ్రీ పూర్తి చేసి 2025లో ఆల్ ఇండియా బార్ నిర్వహించిన పరీక్షలో ఉత్తీరు ణలయ్యారు. త్వరలో ఆయన మద్రాస్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయ నున్నారు. ఈ సందర్భంగా పెరారివాళన్ మీడియాతో మాట్లాడుతూ సరైన న్యాయ సహా యం అందక జైళ్లల్లో మగ్గిపోతున్న వేలాది మంది ఖైదీల గొంతుకగా మారడమే తన లక్ష్య మని చెప్పారు. న్యాయం అందని నిరుపేద జీవిత ఖైదీల కోసం తాను పనిచే యాలనుకుంటున్నట్లు తెలిపారు. 1991 మే 21న తమిళనాడులోని శ్రీ పెరంబదూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న రాజీవ్ గాంధీపై ఓ మహిళ ఆత్మాహుతి దాడికి పాల్ప డింది. ఆ బాంబు తయారీకి అవసరమైన రెండు బ్యాటరీలను నాటి 19 ఏళ్ల పెరారివాళన్ కొను గోలు చేసి ఇచ్చారు. ఈ కేసులో పెరారివాళన్‌కు 1998లో తొలుత ఉగ్రవాద వ్యతిరేక కోర్టు మరణశిక్ష విధించింది. 2014లో సుప్రీంకోర్టు దాన్ని జీవిత ఖైదుగా మార్చింది. ఆ తర్వాత తమిళనాడు గవర్నర్ క్షమాభిక్ష ప్రసాదించడంతో ఆయన్ను విడుదల చేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది.

## నిందితుడి హిట్‌లిస్ట్‌పై అన్ని కోణాల్లో దర్యాప్తు

### ఎఫ్‌బిఐ డైరెక్టర్ పేరు లేకపోవడంపైనా అనుమానాలు

**వాషింగ్టన్, ఏప్రిల్ 28:** హిల్టన్ హోటల్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ లక్ష్యంగా కాల్పులు జరిపిన నిందితుడు ఒక హిట్‌లిస్ట్ తయారు చేసుకున్నాడు. ట్రంప్‌తో సహా ప్రభుత్వ పెద్దలు ఆ లిస్టులో ఉన్నారు. కానీ ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ పేరు మాత్రం ఆ లిస్టులో లేదు. 1052 పదాలతో షూటర్ అల్లెన్ ఓ డాక్యుమెంట్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ మెయిల్‌లో అతనో హిట్‌లిస్టు పేర్కొన్నాడు. అతని టార్గెట్‌లో కాష్ పటేల్ పేరు లేకపోవడం పట్ల చర్చ మొదలైంది. ముఖ్యమైన వ్యక్తుల్లో ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ ఒకరు. అతని పేరులేకుండా హిట్‌లిస్టు ఎలా తయారు చేశా దన్న దానిపై దర్యాప్తు అధికారులు ఆలోచనల్లో పడ్డారు. అన్ని కోణాల్లో దర్యాప్తును కొన సాగిస్తున్నారు. ఐడియాలజీ నుంచి ఆపరేషనల్ స్ట్రాటజీ కోణంలో విచారిస్తున్నారు. మతపరమైన కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోంది. ఇక ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ ఓ హిందువు. కాష్ పటేల్ హిందువు కావడం వల్లే అతన్ని హిట్‌లిస్టు నుంచి తప్పించి ఉంటాడని భావి స్తున్నారు. పటేల్ మతవిశ్వాసం భిన్నమైంది కాబట్టి అతన్ని నిందితుడు వదిలేసి ఉంటాడని అంచనా వేస్తున్నారు. కేవలం ట్రంప్ మీద ఫోకస్ పెట్టడం వల్ల శాంతిభద్రత విభాగానికి చెందిన పటేల్‌ను విస్మరించి ఉంటాడని కొన్ని వర్గాలు భావిస్తున్నాయి. లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను టార్గెట్ చేయాలన్న ఆలోచన తనకు లేదని అల్లెన్ పేర్కొన్న విషయాన్ని కొందరు గుర్తు చేశారు. అందుకే పటేల్ పేరును ఆ లిస్టు నుంచి తీసేసినట్లు అనుమానిస్తున్నారు. డిన్నర్ టైంలో దాడి జరిగినప్పుడు కాష్ పటేల్ కూడా అక్కడే ఉన్నారు. కాల్పుల శబ్దం వినబడగానే పటేల్ తన గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి టేబుల్ కింద దాక్కున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ నిందితుడు ఎందుకు దాడికి ప్రయత్నించాడన్న కోణంలో విచారణ కొనసాగుతున్నట్లు రిపోర్టులో తెలిసింది.

## రక్షణరంగ వ్యయంలో ప్రపంచంలోనే ఐదోస్థానంలో భారత్ !

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** ప్రపంచ దేశాల్లో రక్షణ రంగం పై అత్యధికంగా ఖర్చు చేస్తున్న దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో నిలి చింది. గడిచిన ఏడాది మన దేశం రక్షణ రంగంపై 92.1 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తే, అమెరికా, చైనా, రష్యా, జర్మనీ దేశాలు ఈ జాబితాలో భారత్ కంటే ముందు స్థానాల్లో ఉన్నాయి. ఈ మేరకు స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధక కేంద్రం ప్రస్తుత వివరాలతో నివేదికను విడుదల చేసింది.

గత ఏడాదిలో ప్రపంచవ్యాప్తంగా రక్షణ వ్యయం 2.9 పెరిగి 2,887 బిలియన్ డాలర్లుగా ఉందని ఆ నివేదిక తెలిపింది. ఇక 2025లో భారత్ తన రక్షణ వ్యయాన్ని 92.1 బిలియన్ డాలర్లకు పెంచింది. ఇది 2024 కంటే 8.9 అధికమని పేర్కొన్నది. దాంతో ప్రపంచవ్యాప్తంగా రక్షణ రంగంపై అత్యధికంగా ఖర్చుచేసే దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో నిలిచింది. ఇక రక్షణ రంగం కోసం 954 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తూ అమెరికా అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత 336 బిలియన్ డాలర్ల వ్యయంతో చైనా రెండో స్థానంలో ఉన్నది. ఇక ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో 190 బిలియన్ డాలర్ల ఖర్చుతో రష్యా మూడో స్థానంలో, 114 బిలియన్ డాలర్ల ఖర్చుతో జర్మనీ నాలుగో స్థానంలో ఉన్నాయి. 2025లో ప్రపంచవ్యాప్తంగా సైనిక వ్యయం పెరగడంలో యూరప్‌ది కీలకపాత్ర అని నివేదిక పేర్కొన్నది. యూరప్ తన వ్యయాన్ని 14 శాతం పెంచి 864 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు వెల్లడించింది. కాగా పాకిస్థాన్ కూడా తన రక్షణ వ్యయాన్ని 11 శాతం పెంచింది. 11.9 బిలియన్ డాలర్లతో ఈ జాబితాలో 31వ స్థానంలో ఉన్నట్లు వెల్లడించింది.

# డిజిటల్ అరెస్టుల కట్టడికి కేంద్రం కఠిన నిబంధనలు

### సుప్రీంకోర్టుకు తాజా నివేదిక అందచేత

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** దేశంలో గడిచిన కొన్ని నెలలుగా డిజిటల్ అరెస్ట్ మోసాలు పెరిగి పెను ముప్పుగా మారుతున్నాయి. సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు అనేకమంది ఈ మోసాల బారిన పడుతుండటంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలోనే డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లను అరికట్టేలా కేంద్రం పలు నిబంధనలను రూపొందించింది. ఈ నిబంధనలకు సంబంధించిన నివేదికను తాజాగా సుప్రీం కోర్టుకు సమర్పించింది. ఈ డిజిటల్ అరెస్ట్ మోసాల కట్టడికి బయోమెట్రిక్ సిమ్ వెరిఫికేషన్, అనుమానాస్పద బ్యాంకు ఖాతాల నిలిపివేత వంటి ప్రతిపాదనలను కేంద్రం తన నివేదికలో పేర్కొన్నది. వివిధ రంగాల నిపుణులు, ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరిపిన అనంతరం కేంద్రం ఈ నివేదికను రూపొందించింది. తమ నివేదికను పరిశీలించిన అనంతరం ప్రతిపాదనల అమలు కోసం టెలీకమ్యూనికేషన్ విభాగం, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ, ఆర్‌బీఐ అధికారులకు ఆదేశాలు జారీచేయాలని కేంద్రం సుప్రీంకోర్టును కోరింది. కేంద్రం తరఫున అటార్నీ జనరల్ ఈ నివేదికను న్యాయస్థానానికి సమర్పించారు. ఆ నివేదికలోని సిఫారసులను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించి సంబంధిత విభాగాలకు ఆదేశాలు ఇవ్వనుంది. కేంద్ర ప్రభుత్వ సిఫారసులు సిమ్ కార్డు జారీ చేసే సమయంలో టెలీకమ్యూనికేషన్ (యూజర్ ఐడెంటిఫికేషన్) రూల్స్, బయోమెట్రిక్ ఐడెంటిటీ వెరిఫికేషన్ వ్యవస్థను కఠినంగా అమలు చేయాలి. టెలికామ్ సర్వీస్ ప్రొవైడర్లు నిబంధనలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలి, సిమ్ యాక్టివేషన్ చేసే పాయింట్ ఆఫ్ సేల్స్ విక్రయదారులను ఎప్పటికప్పుడు వెరిఫికేషన్ చేయాలి. కేసుల దర్యాప్తు సమయంలో సబ్‌స్క్రైబర్ యాక్టివేషన్ వివరాలు అందించాలని పీఓఎస్, టెలికామ్ ఆపరేటర్లను ఆదేశించాలి. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లతో సహా సైబర్ క్రైమ్ నేరాలకు ఉపయోగించే మోసపూరిత సిమ్ కార్డులను వీలైనంత త్వరగా బ్లాక్ చేయాలి. వాట్సప్ వంటి యాప్‌లు సిమ్ బైండింగ్ మెకానిజంను కఠినంగా అమలుచేయాలి. ఎక్కువసేపు సాగే మోసపూరిత కాల్స్‌ను గుర్తించేలా యాప్‌లో అధునాతన ఫీచర్లను తీసుకురావాలి. మోసాలకు ఉపయోగించిన డిజిటల్ డివైజ్‌ల ఐడీలను గుర్తించి వెంటనే బ్లాక్ చేయాలి. అప్పుడే ఆ డివైజ్ నుంచి వేరే ఖాతాతో నిందితులు మోసాలకు పాల్పడే అవకాశాన్ని నిరోధించవచ్చు. సైబర్ నేరాలకు ఉపయోగించే అనుమానాస్పద బ్యాంకు ఖాతాల నుంచి డబ్బు డెబిట్ కాకుండా తాత్కాలికంగా వాటిని నిలిపివేయాలి. అందుకోసం ఆర్‌బీఐ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను రూపొందించేలా ఆదేశాలు ఇవ్వాలి.



# శంభు అంబాలలో రైల్వేట్రాక్ పేలుడుకు కుట్ర

### విస్ఫోటనానికి తునాతునకలయిన వ్యక్తి మృతదేహం

**శంభు అంబాలా(పంజాబ్), ఏప్రిల్ 28:** పంజాబ్‌లోని పాటియాలా సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద జరిగిన పేలుడులో ఆ బాంబును పేల్చేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించి ఆ పేలుడుకే బలైపోయాడు. కుట్రపూరితంగా జరిగిన సంఘటనగా భావిస్తున్నట్లు తేలింది. తక్కు తీవ్రతకలిగిందే అయినప్పటికీ ఆ బాంబును పేల్చడంలో ఆ ఆ వ్యక్తి కూడా చనిపోయినట్లు సీనియర్ పోలీసు ఆఫీసర్ ఒకరు తెలిపారు. రైల్వే ట్రాక్‌ను పేల్చుదామని ప్రయత్నించిన ఆ వ్యక్తి గురించి కొన్ని వివరాలను పోలీసులు వెల్లడించారు. శంబూ, రాజ్‌పురా మార్గంలో ఉన్న బొతోనియా గ్రామం వద్ద రైల్వే ట్రాక్ సమీపంలో పేలుడు జరిగింది. అయితే అక్కడ ఓ వ్యక్తి శరీర భాగాలు చెల్లాచెదురుగా పడి ఉన్నట్లు గుర్తించారు. బాంబునే పేల్చే క్రమంలో అతను చనిపోయి ఉంటాడని పాటియాలా ఎస్ఎస్పీ వరుణ్ శర్మ తెలిపారు. శంబూఅంబాలా రైల్వే ట్రాక్ మార్గంలో ప్రస్తుతం రిపేర్ వర్క్ చేస్తున్నారు. బాంబు పేలుడులో మరణించిన వ్యక్తిని జగరూప్ సింగ్‌గా గుర్తించారు. అతను తరన్ తారన్‌కు చెందినట్లు అనుమానిస్తున్నారు. రైల్వే ట్రాక్‌ను పేల్చబోయి, నిందిత ఆపరేటర్ కూడా పేలినట్లు విచారణలో తేలిందని పోలీసులు చెప్పారు. సోమవారం రాత్రి 10 గంటలకు ఈ ఘటన జరిగింది. పేలుడు వల్ల రైల్వే ట్రాక్ కాస్త ధ్వంసం అయ్యింది. కొన్ని రైళ్లను దారి మళ్లించారు. తక్కువ తీవ్రతతో బాంబు పేలిందని తొలుత భావించామని, కానీ దాన్ని పేల్చే ప్రయత్నంలో నిందితుడు కూడా పేలి ముక్కలైనట్లు ఎస్పీ వెల్లడించారు. ఆ స్పాట్ నుంచి ఓ సిమ్ కార్డును రికవరీ చేశామన్నారు. దీని ఆధారంగా టెక్నికల్ దర్యాప్తు మొదలుపెట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన వెనుక ఉన్న కుట్రను చేధించనున్నట్లు పోలీసులు చెప్పారు. జీఆర్పీఎఫ్, ఆర్పీఎఫ్ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నాయి. ఫతేఘర్ సాహిబ్ జిల్లాలోని రైల్వే ట్రాక్‌పై జనవరిలో పేలుడు జరిగింది. ఆ ఘటనలో ఇంజిన్ ధ్వంసం కాగా, లోకో పైలెట్ గాయపడ్డాడు.

## ఆకలికి తట్టుకోలేక నరమాంస భక్షకులుగా రష్యా సైనికులు..!

**క్యీవ్, ఏప్రిల్ 28:** తూర్పు ఉక్రెయిన్‌లోని రష్యా సైనికులు చలికాలంలో ఆహార కొరత వల్ల నర మాంస భక్షకులుగా మారి తోటి సైనికులను చంపి తింటున్నారని ఉక్రెయిన్ ఆరోపించింది. అటువంటి ఘటనలు కనీసం ఐదు తమ దృష్టికి వచ్చాయని ఉక్రెయిన్ నిఘా వర్గాలు తెలిపాయి. గత ఏడాదినవంబర్‌లో డొనెట్స్ ప్రాంతంలోని మర్నోహ్రాడ్ సమీపంలో ఖ్రోమోయ్ అనే సైనికుడు తన సహచర సైనికులు ఇద్దరిని చంపి వారిలో ఒకరి కాళ్లను తినడానికి ప్రయత్నించినట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. నరికిన కాలు ఫొటోలను టెలిగ్రామ్ ద్వారా తన కమాండర్లకు ఒక గుర్తు తెలియని అధికారి షేర్ చేశాడు. ఒక బేస్‌మెంట్‌లో తోటి సైనికుడి శరీర భాగాలను తినేందుకు ప్రయత్నస్తున్న ఖ్రోమోయ్‌ను నిర్బంధించేందుకు ప్రయత్నించగా జరిగిన కాల్పుల్లో అతను మరణించినట్లు ఆ అధికారి తన కమాండర్లకు వివరించాడు. చనిపోయిన సైనికుల మృతదేహాలను పరిశీలించిన ఓ సైనిక సర్జన్ శరీరంపై ఉన్న గాయాలు యుద్ధం వల్ల ఏర్పడిన గాయాలు కావని, పదునైన వస్తువుతో కోసినవని తెలిపారు. రష్యా సైనికులు తీవ్ర ఆహార కొరతతో అల్లాడుతున్నట్లు ఆ అధికారి పేర్కొన్నారు. మరో ఘటనలో ఒక సైనికుడు తన తోటి సైనికుడు మానవ మాంసం తినడం గురించి ఫిర్యాదు చేశాడు. అతను గనక మనిషే అయితే తనకు నచ్చినంత కాలం ఇక్కడ ఉండొచ్చు. కానీ అతను ఒక శవాన్ని తిన్నాడు అని ఆ సైనికుడు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ నివేదికల మధ్య ఒక యూనిట్ కమాండర్ తన కింది అధికారిని నరమాంస భక్షణకు వ్యతిరేకంగా హెచ్చరిస్తూ మనుషులను తినడం ఆపండి అని ఆదేశించాడు. అయితే ఈ ఆరోపణలను లండన్‌లోని రష్యాన్ ఎంబసీ కొట్టివేసింది.

## రెండు రైళ్లు ఢీ..14 మంది మృతి, 84 మందికి గాయాలు

**జకార్తా, ఏప్రిల్ 28:** ఇండోనేషియాలో రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో 14 మంది మృతిచెందగా, 84 మంది గాయపడ్డారు. దేశ రాజధాని జకార్తా శివారులో ఉన్న బెకాసి వద్ద ఈ ప్రమాదం జరిగింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని తొలగించే ప్రయత్నం జరుగుతుందని రైల్వే అధికారులు చెప్పారు. ఓ కమ్యూటర్ ట్రైన్‌తో పాటు లాంగ్ డిస్టాన్స్ రైలు సోమవారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 14కు చేరుకున్నట్లు ఇండోనేషియా రైల్వే శాఖ సీఈవో బాబీ రసియిదిన్ తెలిపారు. గాలింపు ప్రక్రియ ముగిసినట్లు రెస్క్యూ ఏజెన్సీ అధిపతి మొహమ్మద్ స్యాఫి తెలిపారు. రైల్వే బోగీలు నుజ్జు నుజ్జు అయ్యాయని, వాటిల్లో చిక్కుకున్న వారిని తొలగించడం పెద్ద సమస్యగా మారిందన్నారు. రైలుకు చెందిన మహిళా బోగీ దెబ్బతిన్నదని, బాధితుల్లో అందరూ మహిళలే ఉన్నట్లు అధికారులు తెలిపారు. బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసేందుకు ఇనుపకడ్డీలను గ్రైండర్లతో కట్ చేశారు. స్థానికంగా తిరిగే లోకల్ కమ్యూటర్ రైలు తొలుత ఓ ట్యాక్సీ ఢీకొన్నదని, ఆ తర్వాత అది మళ్లీ దూరం వెళ్లే మరో రైలును ఢీకొన్నట్లు స్యాఫీ తెలిపారు.

MN 10 final:MN 10 final 01/01/2001 11:16 Page 1



# గంజాయి మూలాలు సమూలంగా తొలగించడమే లక్ష్యం

## గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

**గుంటూరు ఏప్రిల్ 28 ప్రభాత వార్త ప్రతినిధి :** నిషేధిత గంజాయిని పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా గుంటూరు జిల్లా పోలీసులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. గంజాయి వాడుతున్న వ్యక్తులు ఎక్కడి నుంచి గంజాయిని తీసుకువస్తున్నారు, వారికి ఎవరు సరఫరా చేస్తున్నారు, ఎలాంటి నెట్‌వర్క్ ద్వారా అక్రమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్న అంశాలపై లోతైన సమాచారాన్ని సేకరించి నిందితుల పై కేసులు నమోదు చేస్తున్నారు.ఇందులో భాగంగా మంగళవారం గుంటూరులోని శివనగరాజు కాలనీలో పోలీసులు కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహించారు.ఈ ఆపరేషన్లో మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రయోజనాల గురించి సంకల్పం కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో సుమారు 500 ఇళ్లను పోలీసులు తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 43 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. 18 మంది రౌడీషీటర్లను విచారించి ప్రజలకు కలిగే ఇబ్బందులపై చర్యలు చేపట్టారు. గంజాయి సంబంధిత సమాచారం ఏదైనా ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రౌడీషీటర్లు, అనుమానితుల గృహాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి త్రినేత్ర మొబైల్ స్కానింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరికరాలను ఉపయోగించి అనుమానితుల వేలిముద్రలు, వాహనాల



వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు వెస్ట్ ఇంచార్జి డీఎస్పీ బెల్లం శ్రీనివాస రావు, పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు , అరండల్ పేట సీఐ ఆరోగ్య రాజు , నగరంపాలెం సీఐ సత్యనారాయణ, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# సమిష్టి కృషితో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిఎంసిని అగ్ర స్థానంలో నిలుపుదాం : కమిషనర్ మయూర్ అశోక్

**గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 27,ప్రభాతవార్త :** గుంటూరు నగరం ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఖిసూపర్ స్వచ్ఛ లీగ్ సిటీఖి కేటగిరీలో అత్యుత్తమ ర్యాంకును కలిగి ఉందని, ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో సమిష్టిగా కృషి చేసి జిఎంసిని దేశంలోనే మెరుగైన స్థానంలో నిలబెట్టాలని



నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ పారిశుధ్య నిర్వహణపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారంటే దానికి ఎంత ప్రాధాన్యత ఉందో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ లో ర్యాంక్ కోసమే కాదని, నగర ప్రజలకు మెరుగైన ఆరోగ్య రక్షణలో పారిశుధ్యం ప్రధాన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రతి వార్డు సచివాలయం పరిధిలో పారిశుధ్యం మెరుగుపడాలని, ముఖ్యంగా డ్రైన్ల క్లీనింగ్, నిర్మాణ వ్యర్థాల తొలగింపు వంటి పనులు నిరంతరం జరుగుతూ ఖివిజిబుల్ క్లీనింగ్ఖి కంటికి కనిపించాలని స్పష్టం చేశారు. నగరంలో పారిశుధ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా, ప్రతి ఇంట్లోనే అంటే సోర్స్ వద్దే తడి, పొడి చెత్తను వేరు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. హోమ్ కంపోస్ట్ తయారీని ప్రోత్సహించడంతో పాటు, నగరంలో ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ సెంటర్లు పక్కాగా పనిచేసేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో చెత్త ఉండడానికి వీలు లేదని, యజమానులే శుభ్రం చేసుకోవాలని లేకుంటే నోటీసులు ఇచ్చి అపరాధ రుసుం విధించాలన్నారు. మేజర్ డ్రైన్ కల్వర్ట్ లు, మెష్ ల వద్ద వ్యర్థాలను నాల మెషిన్స్ ద్వారా ప్రతి రోజు శుభ్రం చేయించాలన్నారు. అంతర్గత డ్రైన్లను గ్యాంగ్ వర్క్ లో శుభ్రం చేయించాలన్నారు. త్వరలో ఈఆటోలు కూడా పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు సాధించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, పారిశుధ్య విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు.సమావేశంలో సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, ఎస్ఎస్ లు సోమశేఖర్, ఆయూబ్ ఖాన్, రాజేష్, సాంబయ్య, ఐజాక్, ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# కేరింతల నడుమ ఏఎన్‌యు వార్షికోత్సవ వేడుకలు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఏప్రిల్28, ప్రభాతవార్త: వర్సిటీలోని 5 అంతర్గత కళాశాలల విద్యార్థుల కేరింతల నడుమ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మ్యూజికల్ ఈవెంట్ (ఏఎన్‌యు తరంగ్) మంగళవారం అట్టహాసంగా జరిగింది. ఆర్ట్స్, సైన్స్, ఫార్మశీ, వ్యాయామ విద్య, ఆర్కిటెక్చర్ కళాశాలలు




విద్యార్థులు వారిలోని సాంస్కృతిక కళను ప్రదర్శించారు. ఈ వేడుకలకు కన్వీనర్‌గా ఆచార్య ఎం.త్రిమూర్తిరావు అధ్యక్షతన జరిగిన ఈ మ్యూజికల్




ఈవెంట్‌లో సాంప్రదాయ కళాశాలలైన సైన్స్, ఆర్ట్స్‌తో పాటు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుగా ఉన్న వ్యాయామ విద్య, ఫార్మశీ, ఆర్కిటెక్చర్ కళాశాలల విద్యార్థులు వారిలో ఉన్న కళాత్మక నైపుణ్యాలను వీనులవిందుగా ప్రదర్శించారు. అలాగే సంగీతం, డాన్స్, థియేటర్ ఆర్ట్స్ కోర్సుల విద్యార్థులు సైతం అలరించారు. వైస్టన్, ఫోక్ సాంగ్స్, డాన్స్‌లతో నవ్వించారు, స్కిట్‌లు వేసి ఆలోచింపచేశారు. సైన్స్, ఆర్ట్స్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.వీరయ్య, ఆచార్య యం.సురేష్‌కుమార్, ఆచార్య పాల్‌కుమార్, ఆచార్య తేజోమూర్తి, ఆచార్య కె.వి.నిరుపమ, కన్వీనర్ ఆచార్య యం.త్రిమూర్తిరావులు ఆడిటోరియంలో విద్యార్థులను ఎప్పటికప్పుడు ఉత్సాహపరిచి వారిలో ఉత్తేజాన్ని నింపారు. విద్యార్థుల ప్రదర్శనలను తిలకించేందుకు వచ్చిన వీసి ప్రొఫెసర్ కె.గంగాధరరావు, రెక్టార్ ప్రొఫెసర్ ఆర్.శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలంలు విద్యార్థుల కళా ప్రదర్శనలను చప్పట్లు కొట్టి ఎంకరేజ్ చేశారు. ఈసందర్భంగా వీసి మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పుడూ సంతోషంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల ప్రదర్శనల మధ్యలో వర్షం పడగా




దానినిసైతం లెక్కచేయకుండ విద్యార్థులు తడుస్తూనే ప్రదర్శన ఇవ్వడం, వారి ప్రదర్శనను ప్రేక్షకులుగా ఉన్న విద్యార్థులు తిలకించడం గమనార్హం. కాగా వర్సిటీ పూర్వ విద్యార్థి కళారత్న దామోదర గణపతిరావు ఫోక్ సాంగ్స్‌తో విద్యార్థులను అలరించారు.

**పూర్వ విద్యార్థులే అతిథులుగా నేడు వార్షికోత్సవ సంబరాలు**

వర్సిటీ కళాశాలల వార్షికోత్సవ వేడుకలు నేడు మధ్యాహ్నం 2గం. నుంచి డైక్‌మన్ ఆడిటోరియం వేదికగా జరుగనున్నాయి. ఈ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కన్వీనర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు తెలిపారు. ఇందులో విశేషమేమంటే ఈ వేడకలకు పూర్వ విద్యార్థి, 3సార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సాధించిన డా.గజల్ శ్రీనివాస్, మరొక పూర్వ విద్యార్థి అర్జున అవార్డు గ్రహీత, ఒలంపియన్ మంగళ సింగ్ చాంపియా హాజరౌతారని తెలిపారు. ముఖ్యఅతిథిగా వీసి గంగాధరరావు, గౌరవ అతిథులుగా రెక్టార్ శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం, ఆహ్వానితులుగా ఓఎస్‌డి ఆచార్య రవికుమార్ పాల్గొంటారన్నారు. ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరు సహకారం అందించాలని కోరారు. వార్షికోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన సాంస్కృతిక, క్రీడా,లిటరరీ ఈవెంట్‌లలో విజేతలకు ట్రోఫీలు అందించనున్నారు.

# విజ్ఞాన శిక్షణ తరగతులతో మానసిక ఉల్లాసం

**అమరావతి,ఏప్రిల్28,ప్రభాతవార్త :** స్థానిక శాఖా గ్రంథాలయం నందు వేసవి విజ్ఞాన శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. అమరావతి గ్రంథాలయ శాఖ వారు గ్రంథాలయలాలో మోటివేషన్ కార్యక్రమాన్ని యోగ గురువు గిరి స్వామి ప్రారంభించారు. వేసవి సెలవులలో పిల్లలందరూ వేసవి విజ్ఞాన శిబిరాన్ని వినియోగించుకోవలని గ్రంథాలయ శాఖ అధికారి వెంకాయమ్మ కోరారు.విద్యార్థులు సృజనాత్మకత పెంపొందించుకోవలని ఉపాధ్యాయురాలు సుజాత కోరారు విద్యార్థులకు జీకే తరగతులు నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనం అలవర్చుకోవడమే కాకుండా మానసికల్లాసానికి తోడ్పడే ఆటలు, దేశభక్తి గేయాలు, జనరల్ అవేర్నెస్, జనరల్ నాలెడ్జ్, మోటివేషన్ స్టోరీస్, జనరల్ సైన్స్, గణితము కంప్యూటర్ క్లాసెస్ మొదలగు విషయాల గురించి నేర్పించడం జరుగుతుందని వెంకాయమ్మ అన్నారు . నేటి బాలలే రేపటి పౌరులు కనుక ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని చక్కగా వినియోగించుకొని ఒక మంచి పౌరుడిగా మారాలని కాంక్షించారు .ఆర్ వి ఎన్ కాలేజ్ కరస్పాండెంట్ జాజిబాబు



మాట్లాడుతు సెల్ ఫోన్ వదలండి పుస్తకం పట్టండి అనే నినాదంతో గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న ఈ శిబిరం ఎంత ప్రాముఖ్యమైనదని జాజిబాబు అన్నారు. గ్రంథాలయం అనేది మన పూర్వికులు మనకు ఇచ్చిన అస్థిగా భావించి చరిత్రను కాపాడుకోవడంతో పాటు భవిషత్ తరాలకు అందించాల్సిన భాధ్యత ఈ సమాజంలో ప్రతి పౌరుడి పైనా ఉంది కనుక ఆ విధంగా ప్రతి ఒక్కరు అడుగులు వేయాలని ప్రదీప్ కోరారు. శిబిరాన్ని గ్రామ నలుమూలల విద్యార్థినీ, విద్యార్థులు వినియోగించుకోవాలని, తల్లిదండ్రులు వారి పిల్లలను గ్రంథాలయం వైపు అడుగులు వేసే విధముగా ప్రోత్సహించి ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలని జాజిబాబు కోరారు. విద్యార్థులకు పుస్తక పఠనం, కంప్యూటర్స్ నందు గల శిక్షణ పీడియా లోని వీడియోస్ చూపించడం జరిగింది. అనంతరం విద్యార్థులతో ముఖ్య వీధుల వెంట సెల్ ఫోన్ వదలండి పుస్తకం పట్టండి అనే నినాదంతో పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు .ఈ కార్యక్రమములో విద్యార్దులు, గ్రంథాలయ సిబ్బంధి పాఠకులు పాల్గొన్నారు

# బిఎస్ఎన్ఎల్ ఉద్యోగి బాబ్‌సింగ్ మృతికి సంతాపం

**చిలకలూరిపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన బియస్‌యన్ఎల్ టెలికం టెక్నీషియన్, ఉద్యోగ సంఘ నాయకులు పుల్లగూర బాబ్ సింగ్ ఈ నెల 26వ తేదీ ఆదివారం మృతిచెందారు.ఆయన సంతాప కార్యక్రమాన్ని ఆ సంస్థ ఉద్యోగుల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బియస్‌యన్ఎల్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయ ప్రాంగణంలో జరిగింది. సభకు టెలికం రిటైడ్ జెటిఓ సి.హెచ్ రామారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, బాబ్ సింగ్ వ్యక్తిత్వం గురించి మాట్లాడారు. ఉద్యోగ సంఘ నాయకునిగా ఆయన చేసిన సేవలు వివరించారు. తొలుత బాబ్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ రిటైర్డ్ ఉద్యోగి ఏవి శివయ్య, జె .సుధాకరావు, రాజారత్నం, యం.శ్రీనివాసరావు, కంచర్ల కోటేశ్వరరావు తో పాటు పట్టణ ప్రముఖులు చుక్క విన్సెంట్ పాల్, గాయకులు జి రాజకుమార్, భూదాటి కోటయ్య, సత్యనారాయణ తదితరులున్నారు.



# రోడ్డుప్రమాదంలో ప్రైవేటు పాఠశాల డైరెక్టర్‌కు బ్రెయిన్ డెడ్

## అవయవ దానంతో 3గ్గురి జీవితాల్లో వెలుగులు నింపిన పెదవల్లి నాగేశ్వరరావు

**చిలకలూరిపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** చిలకలూరిపేటలో విషాదం చోటుచేసుకుంది. కావూరు- లింగంగుంట్ల పరిధిలోని కృతి ఇంటర్నేషనల్ పాఠశాల డైరెక్టర్ పెదవల్లి నాగేశ్వరరావు బ్రెయిన్ డెడ్ అయ్యారు. పుటెట్టడు దుఖ:లోనూ ఆయన కుటుంబ సభ్యులు తీసుకున్న గొప్ప నిర్ణయం అందరికీ ఆదర్శంగా నిలిచింది. అవయవ దానంతో ముగ్గురికి పునర్జన్మ నిచ్చారు. గురువారం రోడ్డు ప్రమాదంలో కోమాలోకి వెళ్లారు. ఆదివారం రాత్రి ఆయన మృతి చెందారు. కాగా మంగళవారం మృతదేహాన్ని లింగంగుంటకు తరలించారు.

**కలచివేసిన రోడ్డు ప్రమాదం:**

పెదవల్లి నాగేశ్వరరావు శనివారం తన కుమార్తె ఉజ్వల భవిష్యతన కోసం, ఎంసెట్ కోచింగ్ నిమిత్తం చిలకలూరిపేటలోని ఓ కళాశాలలో ఆమె దిగబెట్టి ద్విచక్రవాహనంపై ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. నరసరావుపేట- కావూరు మధ్యలో ఆయన ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి స్కిడ్ కావటంతో ఆయన కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆయన తల నేలకు బలంగా తాకటంతో అక్కడికక్కడే అపస్మారక స్థితికి చేరుకున్నారు. గమనించిన స్థానికులు వెంటనే అంబులెనన్స ద్వారా చిలకలూరిపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యసాయం కోసం గుంటూరులోని ట్రామా కేర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా ఆయన ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి పురోగతి లేకపోవటం, సరైన వైద్యం అందటం లేదని భావించిన కుటుంబ సభ్యులుమంగళగిరిలోని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఎంత శ్రమించినా ఫలితం దక్కలేదు. తలకు బలమైన గాయం కావటంతోపాటు మెదడులో రక్తం గడ్డకట్టటంతో నాగేశ్వరరావు బ్రెయిన్‌డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆదివారం ఆయన తుదిశ్వాస విడిచారు.



**మరణంలోనూ వీడని మానవత్వం...**

తమ ఇంటి పెద్దను కోల్పోయిన ఆ కుటుంబం కన్నీరు మన్నీరుగా విలపిస్తున్న ప్పటికీ, నాగేశ్వరరావు సతీమణి , కుటుంబ సభునయ్లుఉ గొప్ప మనసు చాటుకున్నారు. ఎపి జీవన్‌దాన్ చైర్మన్ డాక్టర్ రాంబాబు, మణిపాల్ ఆసుపత్రి డైరెక్టర్ రామాంజనేయరెడ్డిల పర్యవేక్షణలో నాగేశ్వరరావు శరీరంలోని కళ్లు, లివర్, కిడ్నీలను దానం చేశారు. సేకరించిన కళ్లను వెంటనే హైదరాబాద్‌లోని ఎల్‌విఆర్ ఆసుపత్రికి తరలించారు. ఒకవైపు కుమార్తె భవిష్యత్ కోసం ఆమెను కళాశాలలో దిగబెట్టి వస్తూ ఇలా ప్రమాదానికి గురికావటం ఆకుటుంబాన్ని, స్థానికులను కలచివేసింది. ప్రాణాలు కోల్పోయినా, మరో ముగ్గురికి అవయన దానం చేసి, వారి జీవితాల్లో వెలుగులు నింపిన పెదవల్లి నాగేశ్వరరావు గొప్పతనాన్ని స్థానికులు, తోటి విద్యావేత్తలు కన్నీటి పర్యంతమవుతూ కొనియాడుతున్నారు. ఆయన భౌతికంగా లేకపోయినా దానం చేసిన అవయవాల రూపంలో ఎప్పటికీ జీవించే ఉంటారని పలువురు నివాళులర్పించారు.

# పెదవడ్లపూడిలో ఎల్ఓసి చెక్కుల పంపిణీ

**మంగళగిరి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో ఎల్ఓసి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ పంపిణీ చేశారు.మంగళవారం గ్రామంలో పెన్నాడ నాగలక్ష్మి కి రూ 2,73,358/విలువైన చెక్కును అందజేశారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ. నిధి ద్వారా ఇలాంటి సహాయం అందించడం ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది," అని పేర్కొన్నారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు తమకు అవసరమైన సమయంలో సహాయం అందించినందుకు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యేళ్ళ శివరామయ్య,మాదల రమేష్, బొమ్మారెడ్డి కోటిరెడ్డి, గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు



# పిడుగురాళ్ల నుంచి సిలికాన్ వ్యాలీ దాకా

## కృత్రిమ మేథాలో కొత్త అధ్యాయం రాస్తున్న పిడుగురాళ్ల కుర్రాడు

**పిడుగురాళ్ల, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** చిన్న పట్టణంలో పుట్టిన కల ప్రపంచ సాంకేతిక రాజధాని సిలికాన్ వ్యాలీ వరకు ప్రయాణం చేయగలదు అనడానికి నిదర్శనంగా నిలిచారు జయశంకర నాగ వెంకట అవినాష్ ఆముదాల. పిడుగురాళ్లకు చెందిన ఈ యువ ఇంజనీరు నేడు అమెరికాలోని కాలిఫోర్నియాలోని నోకియా సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ కృత్రిమ మేధా రంగంలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. పిడుగురాళ్లలో పాఠశాల విద్య పూర్తిచేసిన అవినాష్ అమృత విశ్వ విద్యాపీఠం నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో పట్టా పొంది ఉన్నత విద్య కోసం అమెరికా బాట పట్టారు. న్యూయార్క్‌లోని రోచెస్టర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ డిగ్రీ పూర్తి చేశ్యారు. గత యేడాది నుంచి ప్రపంచ ప్రఖ్యాత టెలికాం సంస్థ నోకియాలో ఏఐ ప్లాట్‌ఫామ్ ఇంజనీర్‌గా సేవలందిస్తున్నారు.

**అమెరికాలో పేటెంట్ సాధన..**

యుక్త వయసులోనే ఒక పరిశోధకుడికి లభించే అత్యున్నత గుర్తింపులలో ఒకటైన అమెరికా పేటెంట్‌ను అవినాష్ సొంతం చేసుకున్నారు. ఆన్‌లైన్ ప్రయోగాలలో విశ్వసనీయతను లెక్కించే కొత్త గణిత సూత్రాన్ని రూపొందించారు. ఈ పరిశోధనకు గాను అమెరికా పేటెంట్ కార్యాలయంలో ఈ యేడాది ఫిబ్రవరి 3న ఏకైక ఆవిష్కర్తగా దరఖాస్తు దాఖలు చేశారు. గూగుల్ నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలఉ నిర్వహించే లక్షలాది ప్రయోగాలలో వినియోగించే కొలమానాల్లో ఉన్న లోపాలను గుర్తించి సరిచేసే పద్ధతిని అభివృద్ధి చేశారు. అవినాష్ అభివృద్ధి చేసిన ఎంసిపి – టెలికామ్ అనే ఓపెన్ సోర్స్ ప్రాజెక్ట్ ప్రపంచలోనే ప్రత్యేకమైనది. కృత్రిమ మేధ ఏజెంట్లు సరాసరి నెట్‌వర్క్ రౌటర్లు, స్విచ్‌లతో సంభాషించేందుకు వీలు కల్పించే ఈ సాఫ్ట్‌వేర్ తన రకంలో మొదటిది. నోకియా, సిస్కో, జునిపర్, అరిస్టా వంటి ఏడు అంతర్జాతీయ సంస్థల పరికరాలతో ఇది పనిచేస్తుంది. పివైపిఐ అనే గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌పై ఇది ఉచితంగా అందుబాటులో ఉండడంతో ప్రపంచ వ్యాప్తంగా ఇంజనీర్లు దీన్ని ఉపయోగిస్తున్నారు. ఏఈఈఈ అంతర్జాతీయ జర్నల్‌లో 2022లో అవినాష్ మొదటి రచయితగా ఒక పరిశోధనా పత్రం ప్రచురితమైందది. ఐఓటి ఆధారిత స్మార్ట్ వ్యవసాయ నీరు పారుదల వ్యవస్థపై ఈ పత్రం రైతుల సమస్యలకు సాంకేతిక పరిష్కారాన్ని చూపింది. తాజాగా కార్నెల్ యూనివర్సిటీ ఆధ్వర్యాన ఏఆర్ఎక్స్ఐవి అనే ప్రతిష్టాత్మక పరిశోధన వేదికపై ప్రోక్సిమా పేరుతో మరో పత్రం ప్రచురితమైంది. అవినాష్ ప్రతిమను గుర్తించిన అమెరికాలోని శాన్ జోస్ స్టేట్ యూనివర్సిటీ ఆయనను 2026 శరదృతువులో కృత్రిమ మేధ, 5జి కమ్యూనికేషన్‌లపై, 2027 వసంతంలో రోబోటిక్స్‌పై అతిథి ఉపన్యాసాలు ఇవ్వడానికి ఆహ్వానించింది. శాంటా క్లారా విశ్వవిద్యాలయంలోని బాధ్యతాయుతమైన ఏఐ కార్యక్రమంలో పరిశ్రమ భాగస్వామిగా ఎంపికయ్యారు.



**తల్లిదండ్రుల ప్రోత్సాహమే ఆధారం..**

తన విజయాలలో తమ తల్లిదండ్రుల పాత్ర చాలా ముఖ్యమైంది. పిడుగురాళ్లలోని తన పాఠశాల ఉపాధ్యాయులు, అమృత యూనివర్సిటిలో నా ప్రొఫెసర్లు ఇచ్చిన ప్రోత్సాహం వల్లే తాను ఈదశకు చేరుకోగలిగాను. గుంటూరు జిల్లా నుంచి సాంకేతిక రంగంలో ప్రపంచ స్థాయి సామర్థ్యం ఉన్న విద్యార్థులు ఎందరో ఉన్నారన్నారు. వారందరికీ సరైన మార్గదర్శనం అందిస్తే అద్భుతాలు సృష్టించగలరని అవినాష్ ఉద్విగ్నంగా పేర్కొన్నారు.

# నాదెండ్ల మండలంలోని పెట్రలో బంకులను పరిశీలించిన ప్రత్యేకాధికారి అమలకుమారి

**నాదెండ్ల, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** నాదెండ్ల మండలంలోని సాతులూరు, తూబాడు, గణపవరం గ్రామాల్లో గల ఐదు పెట్రోల్ బంకులను మండల



ప్రత్యేక అధికారి కె. అమల కుమారి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీజిల్ అందుబాటుపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని తెలిపారు. ప్రతి పెట్రోల్ బంక్‌లో డీజిల్ నిల్వలు పూర్తయ్యిన వెంటనే యజమానులు ఇండెంట్లు నమోదు చేస్తున్నారని, అందుకు అనుగుణంగా సరఫరా సంస్థలు తక్షణమే డీజిల్ పంపిణీ చేస్తున్నాయని చెప్పారు. దీంతో త్వరితగతిన డీజిల్ మళ్లీ అందుబాటులోకి వస్తుందని వివరించారు.కొంతమంది ముందస్తుగా ఆందోళన చెంది డబ్బాల్లో డీజిల్ నిల్వ చేసుకోవడం, వాహన ట్యాంకులను పూర్తిగా నింపించుకోవడం వంటి చర్యలు తీసుకోవడం వల్ల తాత్కాలిక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆమె సూచించారు.అందువల్ల ప్రజలు అవసరమైనంత మాత్రమే డీజిల్ కొనుగోలు చేయాలని, అనవసర నిల్వలకు పాల్పడకుండా సహకరించాలని కోరారు.అలాగే, వ్యవసాయ పనుల నిమిత్తం విడివిడిగా డబ్బాల్లో డీజిల్ అవసరమున్న రైతులకు రైతు సేవా కేంద్రాల ద్వారా వి.ఏ.ఏ (జుతితి) లేదా విహెచ్‌ఏ (జుబీతి)ల ద్వారా కూపన్లు జారీ చేయబడతాయని తెలిపారు. కూపన్లు ఉన్న వారికి మాత్రమే డబ్బాల్లో డీజిల్ ఇవ్వబడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకట్రావు, ఆర్ఐ సంతోష్ కుమారి, డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వోలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విలేకరి హత్యకు నిరసనగా ఏపీయూడబ్ల్యూజే,ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేత

చిలకలూరిపేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త: చిత్తూరు జిల్లా వి.కోట మండల విలేకరి జగన్మోహన్ రెడ్డిపై జరిగిన కిరాతక దాడిని, ఆయన హత్యను నిరసిస్తూ చిలకలూరిపేటలో పాత్రికేయ సంఘాలు గళమెత్తాయి. ఏపీయూడబ్ల్యూజే, ఏపీఈఎంజేఏ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ మొహమ్మద్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు.మంగళవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లి వస్తున్న జగన్మోహన్ రెడ్డిని దుండగులు వేటకొడవళ్లతో వెంటాడి అత్యంత హేయంగా హత్య చేయడంపై జర్నలిస్టులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా శ్రీగంధం చెట్ల అక్రమ రవాణాపై ఆయన రాసిన వార్తలే ఈ హత్యకు ప్రేరణగా నిలిచాయని, వాస్తవాలను వెలుగులోకి



తెస్తున్న పాత్రికేయుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికా స్వేచ్ఛపై జరుగుతున్న ఇటువంటి దాడులు ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు వంటివని నాయకులు మండిపడ్డారు. నిందితులను తక్షణమే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు, సీనియర్ పాత్రికేయులు బాబ్జి మాస్టర్, పల్నాడు జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ అడపా అశోక్ కుమార్, రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి షేక్ మస్తాన్ వలి , ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఉప్పాల సుభాని, కార్యదర్శి ఎస్.డి సిద్దిక్, జిల్లా ఈసీ మెంబర్ ఎన్.వి.ఎస్ ప్రసాద్, సీనియర్ పాత్రికేయులు ఆలపాటి ఆంజనేయులు, కొప్పుల కళ్యాణ్ చక్రవర్తి, కొండపాటి రమేష్, పెనుమళ్ళ మనోహర్, యాసం రవి కిరణ్, శివన్నారాయణ, నరసింహాల శ్రీకాంత్, వీరేంద్ర, మణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంధన కొరత నివారించేందుకు అధికారుల చొరవ తీసుకోవాలి

**అమరావతి,ఏప్రిల్ 28,ప్రభాతవార్త :** డీజిల్ పెట్రోలు ఇంధనం కొరత ఏర్పడకుండా ప్రభుత్వ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని అమరావతిలో ప్రజాసంఘాలు ఏఐటిసి నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సిపిఐ నాయకులు మునుగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమ ప్రభుత్వంగా కొనసాగాలంటే ఇంధనం కొరత నివారించి ప్రజలకు పాలన యంత్రాంగం చేరువ కావాలని కోరారు. ఏఐటియుసి నాయకులు రామకృష్ణ అమరావతిలో ర్యాలీ నిర్వహించారు.



MN 11 Final:MN 11 Final 01/01/2001 11:19 Page 1



# నగరంలో మోడల్ రోడ్లుగా ప్రధాన రహదారుల అభివృద్ధి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 27 (ప్రభాత వార్త ) : గుంటూరు నగరానికి హరిత శోభ కలిగించేలా మోడల్ రోడ్లుగా ప్రధాన రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్



తెలిపారు. పచ్చదనంతో నింపి, పర్యావరణహితంగా, సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్లో ఆంధ్రప్రదేశ్ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ (ఏపీయూజీ బీసీ) మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.శ్రీనివాస్ బృందంతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై, నగరంలోని ప్రధాన రహదారుల అభివృద్ధి, పార్కుల ఆధునీకరణపై ఏపీయూజీ బీసీ ప్రతినిధులు సమర్పించిన వివిధ ప్రతిపాదనలను సుదీర్ఘంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరానికి కొత్త రూపునిచ్చేలా తొలి విడతలో భాగంగా కాకాని రోడ్, పొన్నూరు రోడ్, అమరావతి రోడ్ మరియు విఐపి రోడ్లను మోడల్ రహదారులుగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోనున్నామన్నారు. ఈ నాలుగు ప్రధాన రహదారుల వెంబడి సెంట్రల్ మీడియన్లలో ఆకర్షణీయమైన మొక్కలు నాటడం, అత్యాధునిక ల్యాండ్‌స్కేపింగ్ పనులు చేపట్టడం ద్వారా నగర ప్రవేశ మార్గాలను ఆహ్లాదకరంగా మార్చవచ్చని తెలిపారు. దీనికి సంబంధించి తక్షణమే సమగ్రమైన డిజైన్లు మరియు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏపీయూజీ బీసీ ప్రతినిధులకు సూచించారు. రహదారులతో పాటు నగరంలోని నగర ప్రజలకు మెరుగైన వినోదం, ఆహ్లాదం పంచేలా పార్కులలో పచ్చదనాన్ని పెంచడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై నివేదికలు ఇవ్వాలని కోరారు.సమావేశంలో ఏపియుజి బిసి జిఎం దయాకర్ బాబు, జెడ్ఎం బేబి, ప్రిన్స్ పల్ ఆర్కిటెక్ట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

# బీఎస్ఎన్ఎల్ కొత్త కస్టమర్లకు అద్భుతమైన ఫ్రీడమ్ ప్లాన్

**గుంటూరు,ఏప్రిల్28,ప్రభాతవార్త :** ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) కొత్త కస్టమర్ల కోసం ఒక అద్భుతమైన ఫ్రీడమ్ ప్లాన్ను అందుబాటులోకి తీసుకొచ్చిందని పేరేచర్ల బిఎస్ఎన్ఎల్ జూనియర్ టెలికాం ఆఫీసర్ అనిల్ కుమార్ గారు తెలిపారు. ఈ ప్లాన్ ద్వారా కేవలం ఒక్క రూపాయి చెల్లింపుతో వినియో గదారులు 30 రోజుల పాటు అపరిమిత సేవలు పొంద వచ్చు. ఈ ఆఫర్ కింద 30 రోజుల వాలిడిటీతోపాటు ఏ నెట్వర్క్ కైనా అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 2 జీబీ చొప్పున మొత్తం 60 జీబీ హైస్పీడ్ 4జీ డేటా, రోజుకు 100 ఉచిత ఎస్ఎంఎస్లు లభిస్తాయి. ఈ ప్రత్యేక ఆఫర్ కేవలం కొత్త కనెక్షన్ తీసుకునే వారికి లేదా ఇతర నెట్ వర్క్ నుంచి మొబైల్ నంబర్ పోర్టబిలిటీ ద్వారా బీఎస్ఎన్ఎల్కి మారే వారికి మాత్రమే వర్తిస్తుందని వెల్లడించారు. ఆఫర్ ఏప్రిల్ 30 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు తమ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కస్ట మర్ సర్వీస్ సెంటర్ లేదా ఆదీకృత రిటైలర్లను సంప్రదించాలని సూచించారు. వట్టిచెరుకూరు అనంతవరపాడు పుల్లడిగుంట పత్తిపాడు జొన్నలగడ్డ నిడుముక్కల లాం నల్లపాడు యనమదల పొత్తూరు కోండ్రుపాడు పేరేచర్ల మందపాడు సిరిపురం పరిసర ప్రాంతాల్లో 4బి సేవలు విస్తృతంగా అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా అనిల్ కుమార్ గారు కోరారు.

# నిర్వాసితులకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపించాలి

**గుంటూరు విద్య ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేస్ త్రి రోడ్డు నిర్మాణ నిమిత్తం అడవి తక్కెలపాడు పెట్రోల్ బంక్ నుండి పేరేచర్ల వరకు రోడ్డు విస్తరణ అంశాలలో రోడ్డుకి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించే అంశాలలో నిర్వాసితులకు ప్రత్యామ్నాయ స్థలాలను చూపించి ఖాళీ చేయించే విధంగా ప్రతిపాడు శాసనసభ్యులు విశ్రాంత ఐఏఎస్ అధికారి భూర్ల రామాంజనేయులు తగిన చొరవ చూపాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ వినయపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. మంగళవారం టౌన్ ప్లానింగ్ అధికారులు రోడ్డు విస్తరణ లో భాగంగా స్థానిక పోలీసుల సహాయంతో ఆక్రమణలు తొలగింపు అంశాలలో ఒక దాబా నిర్మాణాన్ని తొలగించే అంశాలలో స్థానికులకు టౌన్ ప్లానింగ్ అధికారులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. కనీసం సమయం కూడా ఇవ్వకుండా ఇంట్లో ఉన్న సామాన్లు తీసుకోనియ్యకుండా ఉన్న ఫలంగా ఇల్లులు కూల్చివేస్తే మా పరిస్థితి ఏమిటి అంటూ ఇంటి యజమానురాలు కన్నీటి పర్యాంతరం అయింది. దీనితో స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ అధికారులతో మాట్లాడుతూ నిర్వాసితులకు ప్రత్యామ్నాయంగా స్థలాలు చూపించాలని అందరూ కూడా షెడ్యూల్ కులాలకు చెందిన వ్యక్తులని వారి పట్ల దూకుడు స్వభావతో కాకుండా మంచితనముతో చర్చలు పరంగా సానుకూల వాతావరణంతో సమస్య పరిష్కారమయ్యే దిశగా అధికారులు చొరవ చూపాలన్నారు. కూ టమి ప్రభుత్వాన్ని గెలిపించుకోవడంలో స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ విశేషంగా కృషి చేసిందని ఈ సందర్భంగా ఆయన అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. నిర్వాసితులు కూడా ప్రభుత్వానికి అధికారులకు పోలీసు వారికి సహకరిస్తున్నారని అదే విధంగా నిర్వాసితుల సమస్యల పట్ల కూడా సానుకూల స్వభావంతో ఉండాలని ఏసుబాబు మాదిగ కోరారు .స్థానిక ప్రత్తిపాడు శాసనసభ్యులు భూ ర్ల రామాంజనేయులు నిర్వాసితుల పట్ల కనికరభావంతో వాళ్లని ఆదుకోవాలని ఏసుబాబు మాదిగ విజ్ఞప్తి చేశారు.

# మేడే ఘనంగా నిర్వహించాలి

**మంగళగిరి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** మే డే సందర్భంగా జిల్లాలో మున్సిపల్ కార్మికులు అన్ని ప్రాంతాలలో మేడే ఘనంగా నిర్వహించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ చెంగయ్య అన్నారు. మంగళవారం రాత్రి మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం కె వెంగమ్మ అధ్యక్షతన జరిగింది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ ను మేడే స్ఫూర్తితో రద్దు చేసే అంతవరకు మున్సిపల్ కార్మికులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనేక




పోరాటాలు చేసి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని ప్రభుత్వం పాటించాలని అన్నారు. 12 గంటలు పని చేపిస్తే మున్సిపల్ కార్మికులు సంఘటితంగా ఉండి రానున్న కాలంలో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆప్కాస్ రద్దు చేస్తే ఉద్యమిస్తామని అన్నారు. ప్రభుత్వం రద్దు చేస్తే మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని అన్నారు. సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని అన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ జిల్లా నాయకులు ఎం రవి, పల్లె కృష్ణ, టి బాబు, వై శివ నాగేశ్వరరావు, కే వెంకటేశ్వరమ్మ, కే ఆంజనేయులు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# సంతగుడిపాడులో స్వర్ణ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే అరవిందబాబు

**రొంపిచర్ల, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మంగళవారం రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామంలోని స్వర్ణ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయం పనితీరు, సమయపాలన పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ కార్యకలాపాలను మరింత మెరుగుపరిచి గ్రామస్తులకు సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ యంత్రాంగం ప్రజాసేవా



సేవల అమలు తీరు, సిబ్బంది హాజరు, రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సౌకర్యాలను ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని ఆదేశాలు ఇచ్చారు.కచ్చితంగా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. ఇలాంటి ఆకస్మిక తనిఖీలను ఇతర సచివాలయాల్లోనూ కొనసాగిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# కమిషనర్ ను కలిసిన బీసీ సంఘ నాయకులు

**నరసరావుపేట, ఏప్రిల్ 28 ప్రభాతవార్త ::** నరసరావుపేట మునిసిపల్ కమిషనర్ గా ఇటీవల నూతన బాధ్యతలు చేపట్టిన రమ్య కీర్తనను మంగళవారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు



మర్యాదపూర్వకముగా కలిసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను మాట్లాడుతూ వేసవికాలం సందర్భంగా పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, రద్దీ ప్రాంతాల్లో మున్సిపాలిటీ ద్వారా మంచినీరు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాంప్రసాద్ స్కాన్ సెంటర్ మరియు అక్షర నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ రాంప్రసాద్,సుతారం విశ్వేశ్వరరావు, శ్రీరాములు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యులు పద్మలత పర్యటన

**నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లాను బాలల హక్కుల పరిరక్షణలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిపి, సంపూర్ణ ఖిబాల స్నేహపూర్వక జిల్లాఖిగా మార్చడమే తమ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు కె. జి. వెంకట పద్మలత అన్నారు. మంగళవారం జిల్లా పర్యటనలో భాగంగా నరసరావుపేటలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలల సంరక్షణ కోసం




జిల్లాలోని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలను గుర్తించి వాటిని కమిషన్ ద్వారా పరిష్కరిస్తూ ముందుకు సాగుతామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించిన "బాల వివాహ ముక్త భారత్" లక్ష్యాన్ని చేరుకోవడంలో భాగంగా జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టేందుకు గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఆర్టీఓ అధికారులతో సమీక్షించి మైనర్ పిల్లలు బైక్ రేసింగ్ బారిన పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో భాగంగా సఖి వన్ స్టాప్ సెంటర్, శిశు గృహాలను జిల్లా బాలల పరిరక్షణ విభాగము సందర్శించి పలు సూచనలు చేయడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా అధికారి ఉమాదేవి, వివిధ శాఖల అధికారులు శివ నాగేశ్వరరావు,కాంత కుమారి జేవిజే రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు భోజనం ప్యాకెట్ల అందజేత

**సత్తెనపల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** దివంగత మద్ది పెద్ద అప్పయ్య పుణ్య తిథి పురస్కరించుకుని సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలలో నిరుపేదలకు, రోగులకు ఉచితంగా భోజన ప్యాకెట్ల ను పంపిణీ



చేశారు. రాజుపాలెం మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన దివంగత మద్ది పెద్ద అప్పయ్య పుణ్య తిథి సందర్భంగా ఆయన కుమార్తె, అల్లుడు అనంత లక్ష్మి వెంకట సత్యనారాయణ ఆర్థిక సహాయంతో ఫిజియోథెరపీ డాక్టర్ జీవన జ్యోతి చేతులమీదుగా భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు, వీరితోపాటు డాక్టర్ కరుణాకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం భరతమాత అన్నప్రసాద వితరణ పతకం 792వ రోజుగా జరిగింది. ఈ సందర్భంగా దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనాటి కార్యక్రమ దాతలకు, వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

# సెల్‌ఫోన్లు వదలండి.. పుస్తకాలు పట్టండి

సత్తెనపల్లి, ఏప్రిల్ 28, ప్రభాతవార్త: సెల్ ఫోన్లు వదలండి పుస్తకాలు పట్టండి .అనేనినాదంతో మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వేసవి శిక్షణ తరగతులు 40 రోజులు పాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని మంగళవారం గుంటూరు గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ వందనాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో



గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, శిల్పారామం చైర్మన్ మంజులా రెడ్డి , అడ్వకేట్ లక్ష్మీ శైలజ ,జన విజ్ఞాన వేదిక, మానవతా సంస్థలు. నాయకులు. హెచ్ఎంలు. చిన్నారులు గ్రంథాలయ సిబ్బంది పాల్గొని ఈ అవకాశాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఇంధనాన్ని బ్లాక్‌లో అమ్మితే క్రిమినల్ చర్యలు

5వపేజీ తరువాయి

జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రతి పెట్రోల్ బంకుల వద్ద పోలీసులను నియమించి లా అండ్ ఆర్డర్‌ను కంట్రోల్ చేశామని చెప్పారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని వివరించారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవ కొండపల్లిలోని ప్లాంటులకు స్వయంగా వెళ్లి, జిల్లాకు ఎక్కువ సంఖ్యలో ఆయిల్ ట్యాంకర్లు వచ్చేట్టు ఏర్పాటు చేశారని తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రతి గంటకు ఒకసారి పరిస్థితిని సమీక్ష చేయడం జరిగిందని అన్నారు. ఎక్కడ ఎటువంటి అలసత్వం లేకుండా అధికారులందరినీ సమన్వయం చేస్తూ జిల్లాలోని అన్ని బంకులకు తగినంత పెట్రోల్, డీజిల్ నిల్వలను సమకూర్చడం జరిగిందని చెప్పారు. ప్రస్తుతం అన్ని రిటైల్ అవుట్లలోను పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉందని, జిల్లాలోని ప్రజలు ఎవరూ కూడా రోజువారి అవసరానికి మించి ఇంధనం కొనుగోలు చేయరాదని కోరారు. వాహనములలో అవసరం మేరకు మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలన్నారు. విడిగా బాటిల్లు, క్యానులు, టిన్నులలో ఇంధనము కొనుగోలు చేయవద్దని సూచించారు. ప్రస్తుత పరిస్థితిని ఆసరాగా తీసుకొని ఇంధనమును బ్లాక్ లో అమ్మడానికి ఎవరైనా ప్రయత్నిస్తే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విడిగా ఇంధనం కొనుగోలు చేసి ఇంటిలో నిలువ చేసుకున్నట్లయితే వేసవికాలంలో అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని బంకుల వారికి విడిగా అమ్మకాలను నిషేధించమని ఆదేశించామని చెప్పారు. అన్ని బంకులలో యధావిధిగా ఇంధన నిల్వలు ఉన్నాయని, ఆందోళన చెందవద్దని కోరారు. రైతులకు, అత్యవసర సేవలకు ఎటువంటి ఇంధన కొరత ఉండదని స్పష్టం చేశారు.

# సార్వభౌముడిగా సాక్షీ భగవానుడు....

**పొన్నూరు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** పట్టణంలో వేంచేసియున్న శ్రీ సుందరవల్లీ, రాజ్యలక్ష్మి సమేత శ్రీ సాక్షి భావనారాయణస్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరవ రోజు అయిన మంగళశ్రవారం సుప్రభాతసేవ, ఉదయకాలపు విశేష కార్యక్రమాలు జరిగాయి. సాయంకాలం నిత్యహోమం, బలిహారణ, తీర్థగోష్టి జరిగింది. శ్రీసుందరవల్లీ, రాజ్యలక్ష్మి సమేత సాక్షి భావదేవుడు ఉభయదేవేరులతో రాజాధిరాజ వాహనంపై రాజాధిరాజుగా, సార్వభౌముడిగా, మహాచక్రవర్తిగా దర్శనమిస్తూ స్వర్ణపురి పట్టణ పురవీధుల్లో విద్యుద్దీపకాంతులతో, మంగళవాయిద్యాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా యాజ్ఞీకస్వామి ఎన్.ఎస్.కె.ఆర్. భట్టాచార్యులు(రాంబాబు) రాజాధిరాజ వాహన వైశిష్ట్యాన్ని వివరిస్తూ విశ్వమంతా నిండియున్న యావత్ సృష్టికి సకల చరాచర జీవరాసులు తనను ఆశ్రయించి శరణు వేడితే వారికి సకల కష్టాలను తీర్చి కోరికలను నెరవేరుస్తారని అభయమిస్తున్నానని అభయ వరద హస్తాలతో దర్శనమివ్వడమే ఈ వాహన సేవలోని విశిష్టత. ఉత్సవాలలో పాల్గొనేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు వచ్చి స్వామివారికి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. అర్చకులు గోవర్ధనం రామకృష్ణ, రొంపిచర్ల గౌతమ్ తదితరులు పూజాధి కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మకర్తల మండలి సభ్యులు శిఖాకొల్లి గుర్నాధరావు, కాట్రగడ్డ రామచంద్రరావు, గుడివాడ పవన్, కూరాకుల సత్యనారాయణ, ధరణికోట పద్మావతి, ఆకురాతి అనూరాధ, ఊటుకూరి బాజి శిరీష, సింహాద్రి వెంకట లక్ష్మి, పరాశరం రంగవల్లి, ఎక్స్ అఫిషియో సభ్యుడు పొన్నూరు బాలగంగాధర తిలక్ పాల్గొన్నారు.



అసిస్టెంట్ కమిషనర్ గాండ్ల కామేశ్వరమ్మ పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు.

# గ్రామస్తులంతా ఐకమత్యంతో ముందుకు సాగాలి

### -గ్రామాభివృద్ధిలో ప్రత్యేకతను సాధించిన సర్పంచి ఇక్కుర్తి -విశ్రాంత ఎస్పీ డాక్టర్ చెన్నంశెట్టి చక్రపాణి

**వెల్లలూరు(పొన్నూరు), ఏప్రిల్ 28,ప్రభాతవార్త:** గ్రామస్తులంతా ఐకమత్యంతో ముందకు సాగితే గ్రామాన్ని నందనవనంగా తీర్చిదిద్దుకోవచ్చని, అందుకు నిదర్శనమే వెల్లలూరు గ్రామమని విశ్రాంత ఎస్పీ డాక్టర్ చెన్నంవెట్టి




చక్రపాణి అన్నారు. మండల పరిధిలోని వెల్లలూరు గ్రామంలో తాజా మాజీ సర్పంచి ఇక్కుర్తి మల్లికార్జునరావు, వార్డు సభ్యులకు గ్రామాభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ చక్రపాణి మాట్లాడుతూ గ్రామ సర్పంచిని గ్రామస్తులందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ద్వారా ప్రభుత్వం నుంచి కొంత నిధులు వస్తాయని, అంతేకాకుండా ఏకగ్రీవం ద్వారా గ్రామస్తుల్లో ఎవరూ విబేదించేవారుండరని తద్వారా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. సర్పంచిగా ఇక్కుర్తి మల్లికార్జునరావు ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతి అవకాశాన్ని అదనుగా భావించి గ్రామాభివృద్ధిలో తనదైన ముద్ర వేశారన్నారు. పొన్నూరు మండలంలో ఏ గ్రామం కూడా వెల్లలూరు గ్రామస్తులు ఉపయోగించుకున్న విధంగా ఉపయోగించుకోలేదన్నారు. సర్పంచిగా మల్లికార్జునరావు గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ క్లినిక్, రైతులు పండించిన ఉత్పత్తులు నిల్వ ఉంచుకునేందుకు గోదాముల నిర్మాణం వంటి వాటితో పాటు గ్రామంలో అనేక సిమ్మెంట్ రోడ్ల నిర్మాణాన్ని చేసి తనదైన ముద్ర వేసుకొన్నారు. ఇతర గ్రామస్తులు కూడా వెల్లలూరు గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని ఆయా గ్రామాలు కూడా అభివృద్ధి సాధించాలని చక్రపాణి ఆకాంక్షించారు. సర్పంచి మల్లికార్జునరావు మాట్లాడుతూ గ్రామస్తులంతా తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతోపాటు గ్రామాభివృద్ధికి తాను చేసే ప్రతి పనికి పూర్తిగా వారి మద్దతును ప్రకటించి ముందుకు నడిపించారన్నారు. నేను వెల్లలూరు గ్రామంలో ఐదు సంవత్సరాలు సర్పంచిగా కొనసాగి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానంటే అది నా ఘనత కాదని, ప్రజలు తనపై ఉంచిన నమ్మకమేనన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టినా ఆ పథకాన్ని పూర్తిస్థాయిలో గ్రామంలో అమలయ్యే విధంగా చేశానన్నారు. తనకు సహకరించిన గ్రామస్తులందరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. గ్రామస్తులు ఎప్పటి వలే ఇంక ముందు కూడా తన వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు బండి శివరామప్రసాద్(బాబు) అధ్యక్షత వహించారు. ఉప సర్పంచి సూదా అంకమ్మరావును, వార్డు సభ్యులు తన్నీరు శివకుమారి, గూడపాటి కాలేశ్వరరావు, పెరవలి రామకృష్ణ, బండి శ్రీవల్లి, పెరవలి మస్తాన్‌రావు, బండి శివరామకృష్ణ, నక్కా ఈశ్వరమ్మ, పాకనాటి వెంకట రమణమ్మ, వీరేంద్ర, చింతల స్మల్లిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోట శ్రీనివాసరావు, కొఠారు వెంకటరమణ, ఇక్కుర్తి అంకమ్మరావు, గాండ్ల రత్నాకరరావు, వరికూటి సుధాకర్,ఇక్కుర్తి మదనమోహనరావు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో ఇంధనము కొరత లేదు

### -కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు -తహాశీల్దార్ మహమ్మద్ జియావుల్ హాక్

**పొన్నూరు, ఏప్రిల్ 28,ప్రభాతవార్త:** మండలంలో ఇంధనము కొరత లేదని, అన్ని పెట్రోలు బంకుల్లో పెట్రోలు, డీజిల్ నిల్వలు ఉన్నాయని తహాశీల్దార్ మహమ్మద్ జియావుల్ హాక్ తెలిపారు. తహాశీల్దార్ మహమ్మద్ జియావుల్ హాక్, అర్బన్ సిఐ లావూరి వీరానాయక్‌లు పట్టణ, మండల పరిధిలోని పలు పెట్రోలు బంకులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ మహమ్మద్ జియావుల్ హాక్ మాట్లాడుతూ పెట్రోలు,



డీజిల్ కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో అన్ని పెట్రోలు బంకులపై జిల్లా కలెక్టర్ నిఘా ఉందన్నారు. కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ జిల్లాలో అన్ని పెట్రోలు బంకులను తనిఖీ చేస్తున్నారన్నారు. తనిఖీ సమయంలో పెట్రోలు బంకుల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదు అందితే తక్షణమే వారి లైసెన్సు ను రద్దు చేస్తారని, అంతేకాకుండా వారిపై కేసులు నమోదు చేయడం కూడా జరుగుతుందని హెచ్చరించారు. ప్రతి పెట్రోలు బంకులో గూగుల్‌పే, ఫోన్‌పేలను స్వీకరించాల్సిందేనన్నారు. గూగుల్‌పే, ఫోన్‌పే కుదరదు నగదు చెల్లించాల్సిందేనని బంకుల నిర్వాహకులు పేచీ పెడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. వినియోగదారుల అభీష్టం మేరకు నడుచుకోవాల్సిందేనన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. మండల, పట్టణ పరిధిలో 10పెట్రోలు బంకులు ఉన్నాయని, అన్ని బంకుల్లో ఇంధన నిల్వలు ఉన్నాయన్నారు. వినియోగదారులు కూడా వారికి అవసరమైన మేరకు మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. కొంత మంది డబ్బాలద్వారా తీసుకెళ్ళి అక్రమంగా విక్రయాలు జరుపుతున్నట్లు కూడా తమ దృష్టికి వచ్చిందని అలాంటి వారిపై కూడా చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. బంకుల నిర్వాహకులు నిబంధనలు పాటించకపోతేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

# వట్టికూటి దివ్యకు ఘన సత్కారం

**పొన్నూరు, ఏప్రిల్ 28,ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ వట్టికూటి లీలాప్రసాద్ తనయురాలు వట్టికూటి దివ్య న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. ఈ



సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజిసాహెబ్ తదితర న్యాయవాదులు దివ్యను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా షేక్ బాజిసాహెబ్ మాట్లాడుతూ వట్టికూటి దివ్య జడ్జిగా నియామకం కావడం పట్టణానికే గర్వకారణమన్నారు. రాబోయే రోజుల్లో ఉత్తమ జడ్జిగా ఉన్నత న్యాయమూర్తుల, కక్షిదారుల మెప్పు పొందాలని, జడ్జి పదవికే వన్నె తెచ్చేవిధంగా మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ఎస్టీ సాయి, పొందుగల చైతన్య, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## శ్రీనివాస రామానుజన్‌కు ఘన నివాళులు

**రాజుపాలెం, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** రాజుపాలెం కొండమోడు లోని కెఎన్ఆర్ విద్యాసంస్థలో గణిత శాస్త్ర మేధావి శ్రీనివాస రామానుజన్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కోనేటి నరసింహా రావు, బాడిస మస్తాన్ రావు మాట్లాడుతూ భారతదేశానికి గర్వకారణమైన మహా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ వర్ధంతిని స్మరించుకుంటున్నామన్నారు. రామానుజన్ 1887 డిసెంబర్ 22న తమిళనాడులో జన్మించారని, చిన్ననాటి నుంచే గణితంపై అపారమైన ఆసక్తి చూపించారని, సాధారణ విద్య లేకపోయినా, తన సొంత ఆలోచనలతో అద్భుతమైన గణిత సూత్రాలను కనుగొన్నారన్నారు. రామానుజన్ జీవితం మనకు ఒక గొప్ప పాఠాన్ని నేర్పుతుందని పేర్కొన్నారు. అధ్యాపకులు సాధినేని నరసింహారావు, ఆలూరు ప్రసన్నకుమార్, తెలకపల్లి గోపికృష్ణ,బి. ఇందు సిహెచ్ స్రవంతి విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు.

# ముగిసిన ఊంజల్ సేవలు

### -భక్తులకు కనువిందు చేసిన అలంకరణలు

### -పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు

**పొన్నూరు, ఏప్రిల్ 28,ప్రభాతవార్త:** శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావనారాయణస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గత ఐదు రోజులుగా నిర్వహించిన ఊంజల్ సేవలు మంగళవారంతో



ముగిశాయి. ఈ ఏడాది ప్రత్యేకంగా ఊంజల్ సేవలను నిర్వహించారు. ఈ ఊంజల్ సేవల్లో స్వామివారి ఉభయ దేవేరిలతో వివిధ రకాల అలంకరణలో ఊంజల్‌లో భక్తులకు దర్శనమిచ్చారు. యాజ్ఞీకస్వామి ఎన్.ఎస్.కె.ఆర్. భట్టాచార్యులు(రాంబాబు) మాట్లాడుతూ సాక్షీ భావదేవుడు ఊంజల్‌లో దర్శనమిస్తూ తన వైభవాన్ని, రాజసాన్ని, భక్తిని ప్రతిబింబించేలా కనువిందు చేశారన్నారు. ఈ అలంకరణలో స్వామివారిని దర్శించుకొంటే సర్వసుఖాలు కలుగుతాయన్నారు. ఈ అలంకరణలను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. ధర్మకర్తల మండలి సభ్యులు శిఖాకొల్లి గుర్నాధరావు, కాట్రగడ్డ రామచంద్రరావు, గుడివాడ పవన్, కూరాకుల సత్యనారాయణ, ధరణికోట పద్మావతి, ఆకురాతి అనూరాధ, ఊటుకూరి బాజి శిరీష, సింహాద్రి వెంకటలక్ష్మి, పరాశరం రంగవల్లి, ఎక్స్ అఫిషియో సభ్యుడు పొన్నూరు బాలగంగాధర తిలక్ పాల్గొన్నారు. అసిస్టెంట్ కమిషనర్ గాండ్ల కామేశ్వరమ్మ పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు.

# వాంఖడేలో గర్జించేదెవరు?

## వరుస విజయాలతో సన్‌రైజర్స్ జోరు * హోం అడ్వాంటేజ్‌గా ముంబై

**ముంబై:** ఇండియన్ ప్రీమియర్ లీగ్-2026లో భాగంగా నేడు వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తల పడనున్నాయి. వరుసగా నాలుగు విజయాలతో జోరు మీదున్న ఆరేంజ్ ఆర్మీ... అయిదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్‌ను దాని సొంత గడ్డపై ఓడించి పాంచ్ పటాకా సాధించడంపై ఫోకస్ పెట్టింది. నిలకడలేని ఆరంభం లభించినా.. ఆ తర్వాత వేగంగా పుంజుకుంది. టాప్ ఆర్డర్ మొత్తం పరుగుల వేటలో ఉండడంతో వరుసగా నాలుగు విజయాలతో జోరు మీదికొచ్చింది. ఇదే ఫామ్‌ను కొనసాగించి టాప్ ఫోర్‌లో తమ స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని ఆరేంజ్ ఆర్మీ లక్ష్యంగా ఉంది. మరోవైపు తొలి మ్యాచ్ గెలుపు తర్వాత అనూహ్యంగా పరాజయాల బాట పట్టిన ముంబై ఇండియన్స్.. ఏడు మ్యాచ్‌లలో కేవలం రెండు విజయాలతో పాయింట్లపట్టికలో తొమ్మిదో స్థానంలో ఉంది. సొంత ప్రేక్షకుల ముందు పుంజుకుని, ఈ సీజన్‌లో తమ మూడో విజయాన్ని నమోదు చేయాలని ముంబై ఉవ్విళ్లూరుతోంది.

ప్రస్తుతం ముంబై ఇండియన్స్ జట్టు నిరాశజనక ప్రదర్శనలతో తీవ్ర ఒత్తిడిలో ఉంది. టీ20 ప్రపంచ కప్ జట్టులోని నలుగురు కీలక ప్లేయర్లు ముంబై ఇండియన్స్ టీమ్‌లో ఉన్నా... గత మ్యాచ్‌లో సీఎస్‌కే చేతిలో 103 పరుగుల తేడాతో ఓడింది. కెప్టెన్ హార్దిక్ పాండ్యా(3 వికెట్లు, 97 రన్స్) బ్యాటింగ్, బౌలింగ్‌లో విఫలమవుతుండగా, సూర్యకుమార్(110)సాదరణ ప్రదర్శన చేస్తున్నాడు. గుజరాత్ టైటాన్స్‌పై సెంచరీతో ఫామ్‌లోకి వచ్చిన తిలక్ వర్మపైనే ఆశలు పెట్టుకుంది. జస్‌ప్రీత్ బుమ్రా(2 వికెట్లు) కూడా బౌలింగ్‌లో తేలిపోతున్నాడు. ట్రెంట్‌బౌల్ట్, దీపక్ చాహర్ కూడా విఫలమవుతున్నారు. రోహిత్ శర్మ ఈ మ్యాచ్ బరిలోకి దిగితే ముంబై బ్యాటింగ్‌కు బూస్టింగ్ లాంటిది.

ఇక జైపూర్‌లో 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ విధ్వంసం సృష్టించినా... భారీ స్కోరును సన్‌రైజర్స్ ఛేధించడం ఆజట్టులో నూతనోత్తేజాన్ని నింపింది. ఫామ్ అందుకున్న అభిషేక్ ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలతో 54.28 సగటుతో 212.29 స్ట్రైక్ రేట్‌తో 380పరుగులతో టాప్‌లో ఉన్నాడు. అభిషేక్, హెడ్(186) మరోసారి శుభారంభం అందిస్తే...ఆతర్వాతవచ్చే ఇషాన్(312), హెన్రిచ్ క్లాసెన్ (349) బ్యాట్ ఝుళిపిస్తే భారీ స్కోరు ఖాయం. యువ పేసర్ల ప్రఫుల్, సాకిబ్‌లకు తోడు కెప్టెన్ పాట్ కమిన్స్ జతకూడడంతో సన్‌రైజర్స్ బౌలింగ్ డిపార్ట్‌మెంట్... ప్రత్యర్థి జట్లను హడలెత్తించే స్థాయికి మారింది.





### హెడ్ టు హెడ్

ఇరు జట్లు ఇప్పటివరకు ముఖాముఖిగా 25 సార్లు తలపడగా... ముంబై డామినేట్ చేసింది. ముంబై ఇండియన్స్ 15 సార్లు, సన్‌రైజర్స్ 10 సార్లు గెలుపొందాయి. చివరిసారి తలపడినపుడు ముంబై ఇండియన్స్ విజయం సాధించింది.

### పిచ్ రిపోర్ట్

వాంఖడే పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. చిన్న బౌండరీలకు తోడు బంతి బ్యాట్‌పైకి చక్కగా వస్తుంది కాబట్టి వాంఖడేలో పరుగుల వరద పారే అవకాశం ఉంది. బౌలర్లకు ఇది సవాలుతో కూడిన మైదానం. వారు వికెట్ల కోసం కష్టపడాల్సి ఉంటుంది. కట్టుదిట్టమైన లైన్, లెంగ్త్‌తో బౌలింగ్ చేయడం కీలకం. లేదంటే బ్యాటర్లకు భారీగా మూల్యం చెల్లించాల్సి ఉంటుంది.

### జట్ల వివరాలు(అంచనా)

**ముంబై ఇండియన్స్:** డికాక్, నమన్, సూర్య కుమార్, హార్దిక్(కెప్టెన్), తిలక్ వర్మ, రూథర్ ఫోర్డ్, విల్ జాక్స్, బుమ్రా, భగత్, గజన్‌ఫర్, అశ్వనీ ; **ఇంపాక్ట్ ప్లేయర్:** రోహిత్ శర్మ

**సన్‌రైజర్స్ హైదరాబాద్:** అభిషేక్, ఇషాన్, క్లాసెన్, సలీల్, అనికేత్ వర్మ, నితీష్ కుమార్, కమిన్స్ (కెప్టెన్), శివంగ్, సాకిబ్,ప్రఫుల్, ఎషాన్ మలింగ; **ఇంపాక్ట్ ప్లేయర్:** ట్రావిస్ హెడ్.




## ఊబర్ కప్ నుంచి భారత్ ఔట్

**డెన్మార్క్:** ఊబర్ కప్ బ్యాడ్మింటన్‌లో భారత్ సవాల్ ముగిసింది. థామస్ కప్‌లో పురుషుల జట్టు క్వార్టర్ ఫైనల్ బెర్త్ దక్కించుకుంటే... పీవీ సింధూతో కూడిన మహిళల టీమ్ చతికిలపడింది. గ్రూప్-ఏలో చైనా చేతిలో 0-5తో వైట్‌వాష్ అయింది. ఎన్నో ఆశలతో డెన్మార్క్‌కు వెళ్లిన భారత బృందం నిష్క్రమించింది. ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధూతో పాటు అందరూ చేతులెత్తేశారు.

సింగిల్స్‌లో పీవీ సింధూ మరోసారి చైనా హార్డిల్‌ను అధిగమించడంలో విఫలమైంది. మూడు సెట్ల హోరాహోరీ పోరులో చైనాకు చెందిన వాంగ్ జియి చేతిలో ఓడింది. తొలి సెట్ 16-21తో ఓడినా.. రెండో సెట్‌లో సింధూ అద్భుతంగా పుంజుకుంది. 21-19తో నెగ్గి సమవుజ్జీగా నిలిచింది. ఫలితం తేల్చే మూడో సెట్‌లోనూ సింధూ పోటాపోటీగా పాయింట్లు సాధించింది. అయితే కీలక దశలో ఒత్తిడికి లోనై పొరపాట్లు చేయడంతో ఆ సెట్ 19-21తో చేజారింది. దీంతో తప్పక గెలవాల్సిన డబుల్స్‌లో ప్రియా కొంజెంగ్బమ్-శృతి మిశ్రా జోడీ... చైనా ద్వయం లీ షెంగ్ షూ - టాన్ నింగ్ చేతిలో ఓడింది. మరో డబుల్స్‌లో ట్రిసా జాలీ-కవిప్రియ జోడీ కూడా ఓటమి పాలయింది. రివర్స్ సింగిల్స్‌లో ఇషారాణి, దేవికా సిహగ్ ఓటమితో భారత జట్టు టోర్నీ నుంచి వైదొలిగింది.

ఈ ఓటమితో గ్రూప్-ఎలో భారత్ ఏకైక విజయంతో మూడోస్థానంలో నిలిచింది. చైనా మూడు మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో టాప్ ప్లేస్‌తో, అతిథ్య డెన్మార్క్ 3 మ్యాచ్‌ల్లో రెండు విజయాలు, ఒకదాంట్లో ఓటమితో రెండోస్థానంలో నిలిచాయి. గ్రూప్-ఎ నుంచి టాప్ టూ జట్లు చైనా, డెన్మార్క్ క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించింది. చైనా చేతిలో 5-0తో, డెన్మార్క్ చేతిలో 3-2తో ఓడిన భారత్... ఉక్రెయిన్‌పై 4-1తో నెగ్గి టోర్నీ నుంచి ఇంటిదారి పట్టింది. థామస్ కప్‌లో ఇప్పటికే క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకున్న భారత పురుషుల జట్టు... చివరి మ్యాచ్‌లో చైనాతో తలపడనుంది.



## రెజ్లింగ్ సమాఖ్య అడ్డుకుంటోంది: వినేశ్ ఫోగట్

**ఢిల్లీ:** భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్ సంచలన వ్యాఖ్యలు చేసింది. రెజ్లింగ్‌లోకి రీఎంట్రీ ఇవ్వకుండా రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా... తనను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోందని వాపోయింది. నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్ రిజిస్ట్రేషన్ గడువు ఈ నెల 30వరకు ఉన్నా... పోర్టల్‌లో గడువు ముగిసినట్లు చూపెడుతోందన్నారు. దీనిపై రెజ్లింగ్ సమాఖ్యను సంప్రదిస్తే సరిగ్గా స్పందించడం లేదని వినేశ్ ఫోగట్ పేర్కొంది. ఏషియన్ గేమ్స్, ప్రపంచ చాంపియన్‌షిప్ వంటి సెలెక్షన్ ట్రయల్స్‌లో పోటీలో ఉండాలంటే ఈ టోర్నమెంట్ తనకు ఎంతో కీలకమైందని తెలిపింది. మరోవైపు వినేశ్ ఆరోపణలను రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు సంజయ్ సింగ్ ఖండించారు. వినేశ్ రిజిస్ట్రేషన్ చేసుకున్న స్క్రీన్ షాట్‌ను బయటపెట్టారు. ఇప్పటివరకు దాదాపు 800 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఎవరికి ఎలాంటి సమస్య రాలేదన్నారు. వినేశ్ ఫోగట్ టోర్నీలో పాల్గొనకుండా తామెవరం అడ్డుకోవడం లేదని స్పష్టం చేశారు.




## పంజాబ్ జైత్రయాత్రకు రాజస్థాన్ రాయల్స్ బ్రేక్

**ముల్లన్‌పూర్:** ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ జైత్రయాత్ర ఎట్టకేలకు బ్రేక్ పడింది. పరుగుల వరద పారిన ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్.. 223 రన్స్ టార్గెట్‌ను మరో నాలుగు బంతులుండగానే 4 వికెట్లు కోల్పోయి అందుకుంది. ఆరు వికెట్ల తేడాతో నెగ్గి పంజాబ్‌కు తొలి ఓటమి రుచి చూపింది. రాయల్స్ ఇన్నింగ్స్ ధాటిగా ఆరంభమైంది. అర్షదీప్ తొలి ఓవర్‌లో సిక్స్‌తో పరుగుల ఖాతా తెరిచిన వైభవ్(16 బంతుల్లో 43, 3 ఫోర్లు, 5 సిక్స్‌లు)... ఆతర్వాత బ్యాక్ టు బ్యాక్ ఫోర్లు బాదాడు. ఫెర్గ్యూసన్ ఓవర్లో 4, 6, 4... జెన్సన్ ఓవర్లో సిక్స్.. అర్షదీప్ ఓవర్లో సిక్స్ సాధించాడు. ఆ తర్వాతి బంతికే శ్రేయస్ అద్భుత క్యాచ్‌తో అవుటయ్యాడు. ఆ తర్వాత జైస్వాల్ జోరు పెంచాడు. అదే ఓవర్లో 4, 6, 4 సాధించాడు. కేవలం 27 బంతుల్లో 51రన్స్ చేశాడు. జురెల్16), రియాన్ పరాగ్29) విఫలమైనా.. ఫెరీరా(26 బంతుల్లో 52 నాటౌట్, 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), శుభమ్ దూబే (12 బంతుల్లో 31 నాటౌట్) మెరుపులు మెరిపించారు. పంజాబ్ బౌలర్లప విరుచుకుపడ్డారు. ఫెరీరా విన్నింగ్ షాట్ సిక్స్‌తో రాయల్స్ విజయాన్ని పూర్తి చేశాడు.

అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగుల భారీ స్కోరు చేసింది. ఎప్పటిలాగే ప్రియాన్ష్ ఆర్య(11 బంతుల్లో 29), ప్రభ్‌సిమ్రాన్(44 బంతుల్లో 59) ఫ్లయింగ్ స్టార్ట్ అందించగా... కూపర్ కన్నోలీ(14 బంతుల్లో 30), శ్రేయాస్ అయ్యర్(27 బంతుల్లో 30) రాణించారు. తొలి వికెట్‌కు 37 రన్స్, రెండో వికెట్‌కు 59 రన్స్, మూడో వికెట్‌కు 48 రన్స్‌ను ప్రభ్‌సిమ్రాన్ జోడించాడు. స్లాగ్ ఓవర్లలో స్టోయినిస్(22 బంతుల్లో 62 నాటౌట్) ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోశాడు. ముఖ్యంగా బ్రిజేష్ వేసిన చివరి ఓవర్లో వరుసగా 4, 6, 6, 4, 4 సాధించాడు. స్టోయినిస్ మొత్తంగా 4 ఫోర్లు, 6 సిక్స్‌లతో ఈ స్కోరు సాధించాడు. ఆర్ఆర్ బౌలర్లలో యష్‌రాజ్ రెండు వికెట్లు పడగొట్టాడు.







## ఐదునెలల కనిష్టానికి...
## పారిశ్రామిక ఉత్పత్తిరంగ వృద్ధి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** తయారీరంగంలో వృద్ధిమందగించడం, ఇంధనరంగంలో ఉత్పత్తి తగ్గడం, పశ్చిమాసియా సంక్షోభం వంటి వాటితో భారత పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి ఐదునెలల కనిష్టానికి చేరింది. మార్చి నెలలో 4.1 శాతంగా మాత్రమే ఉన్నట్లు కేంద్ర ఆర్థగణాంక శాఖప్రకటించింది. అదే గత ఏడాది ఇదే మార్చిలో 3.9 శాతంగా ఉంది. పారిశ్రామిక ఉత్పత్తివృద్ధి ఫిబ్రవరి నెలకుగాను 5.1శాతం వరకూ వృద్ధిని నమోదుచేసింది. గత ఏడాది అక్టోబరులో అత్యంత కనిష్టస్థాయి అంటే 0.5 శాతానికి పారిశ్రామిక ఉత్పత్తి పడిపోయింది. మార్చినెలలో కూడా 4.3శాతంగా ఉందని, ఏడాదిక్రితం చూస్తే నాలుగుశాతం మాత్రమే ఉన్నట్లు ఎన్ఎస్ఓ వెల్లడించింది. గనుల రంగంలో ఉత్పత్తి 5.5శాతానికి మెరుగుపడింది. విద్యుత్ ఉత్పత్తి స్వల్పంగా ఉంది. ఏడాదిక్రితం 7.5శాతం ఉంటే ఈ ఏడాది మార్చిలో కేవలం 0.8శాతం మాత్రమే వృద్ధినమోదుచేసింది. పూర్తి సంవత్సరానికిగాను పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి నిలకడగా 4.1శాతంగామాత్రమే ఉంది. అంతకు ముందుసంవత్సరం నాలుగుశాతంతో పోలిస్తే కొంతమేర మెరుగుపడిందని ఎన్ఎస్ఓ తెలిపింది. ఉత్పత్తిరంగంలో ప్రధానంగా దేశంలో ఉన్న కీలక 23 పారిశ్రామికగ్రూపుల్లోని 14గ్రూపుల పరిశ్రమలు సానుకూల వృద్ధిని నమోదుచేసాయని కూడా వివరించింది. బేసిక్ మెటల్స్ 8.6శాతం, మోటార్‌వాహణ ఉత్పత్తి, ట్రెయిలర్లు, సెమిట్రైలర్లు 18.1శాతం, భారీ యంత్రాలు,యంత్రసామగ్రి 11.2శాతం వృద్ధిని నమోదుచేసినట్లు తెలిపింది. ఎంఎస్ శ్లాబులు, అల్లాయ్‌స్టీల్, హెచ్‌ఆర్ కాయిల్స్, ఇనుప శ్లాబ్‌రేకులు కూడా కొంతమేర వ1దిదనమోదుచేసింది. వర్గీకరణలో ప్రైమరీ గూడ్స్‌పరంగా 173.3పాయింట్లు, భారీ యంత్రాల కేటగిరీలో 156.2, ఇంటర్మీడియేట్‌గూడ్స్‌లో 181.4, మౌలికవనరులు, నిర్మాణరంగ ఉత్పత్తులపరంగా 229 పాయింట్లుగా ఉంది. వినియోగరంగ వస్తువులు146.2, కన్స్యూమర్‌నాన్ డ్యూరబుల్స్ 150.6 పాయింట్లతో కొంత మెరుగుపడినట్లు కేంద్ర అర్థగణాంకశాఖ వెల్లడించింది.

## డాలర్ వర్సెస్ రూపాయి 94.56

**ముంబయి, ఏప్రిల్ 28:** డాలరుతో రూపాయి మారకం విలువలు 41 పైసలు క్షీణించి 94.56గా ట్రేడింగ్ ముగిసింది. మంగళవారం ముడిచమురు ధరలు పెరగడంతో విదేశీ మూలధన నిధులు కూడా మార్కెట్లనుంచి ఎక్కువ విత్‌డ్రా కావడం వంటి చర్యలకకు డాలర్ చెల్లింపులు పెరిగి విదేశ ఈకరెన్సీకి డిమాండ్ పెరిగింది. దీనితో రూపాయి మారకం విలువలు గణనీయంగా క్షీణించాయి. విదేశీ కరెన్సీ ట్రేడర్లు అంచనాల ప్రకారం ఇప్పటికే రూపాయి భారీగా క్షీణించిందని, దీనివల్ల దేశ కరెంటు ఖాతాలోటు కూడా పెరుగుతుందని, మూలధన నిధుల్లో కూడా హెచ్చు తగ్గులు చోటుచేసుకుంటాయని చెప్పారు. ఈ ఏడాది ఇప్పటివరకూ విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మొత్తం 19 బిలియన్ డాలర్ల పెట్టుబడులను భారతీయ ఈక్విటీ మార్కెట్లనుంచి విత్‌డ్రాచేసుకున్నారు.



ఇంటర్‌బ్యాంకు ఫారిన్ ఎక్స్ఛేంజి మార్పిడి పరంగాచూస్తే రూపాయి 94.35వద్ద ప్రారంభం అయి 94.58 వద్దకు ఇంట్రాడేలో ట్రేడింగ్ జరిగింది. క్షీణించిన విదేశీ పెట్టుబడులవల్లనే రూపాయి మరింత పతనం అయినట్లు తెలుస్తోంది. భౌగోళిక ఉద్రిక్తతలు పెరిగిన కారణంగా విదేశీ నిధులు మార్కెట్లక రావడం తగ్గింది. ముడిచముదరలు 2.62శాతంపెరిగాయి.

బ్యారెల్‌కు 111.07 డాలర్లుగా ట్రేడింగ్ కొనసాగింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గితే బ్యారెల్‌కు 85 నుంచి 90డాలర్లవరకూ కొనసాగవచ్చని తేలింది. 2027 ఆర్థికసంవత్సరంలో 92-93 మధ్యరేంజ్‌లో ఉంటుందని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ ఆర్థికవేత్త రజనిసిన్హా అంచనావేసారు. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లపరంగా చూస్తే రూ. 1151.48 కోట్లు విత్‌డ్రాచేసారు. ముడి చమురు ధరలు మరింత పెరిగితే రూపాయీ మరింత క్షీణించక తప్పదన్న అంచనాలు కూడా కొందరు ట్రేడింగ్ నిపుణులు చెపుతున్నారు.

## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఏప్రిల్ 28:** పశ్చిమాసియాలో నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరగడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభనతో మదుపరులు అప్ర మత్తంగా వ్యవహరించారు. ఫలితంగా, మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 416.72 పాయింట్లు నష్టపోయి 76,886.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 97 పాయింట్లు క్షీణించి 23,995.70 వద్ద ముగిసింది. ప్రధానసూచీలు నష్టపోయినప్పటికీ, మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు మాత్రం లాభాలతో రాణించడం విశేషం. నిఫ్టీ మిడ్ క్యాప్ 0.28 శాతం, స్మాల్‌క్యాప్ 0.42 శాతం మేర లాభపడ్డాయి. సెన్సెక్స్‌లో అదానీ పోర్ట్స్, ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా షేర్లు లాభపడగా హెచ్‌సీఎల్ టెక్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టపోయాయి.

రంగాలవారీగా చూస్తే బ్యాంకింగ్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్ షేర్లు లాభాలను నమోదు చేశాయి. వ్యూహాత్మకమైన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ఇరాన్ చేసిన ప్రతిపాదన పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తిగా ఉన్నారని వచ్చిన నివేదికలతో మార్కెట్ సెంటిమెంట్ బలహీనపడింది. బ్రెంట్ ముడిచమురు బ్యారె ల్ ధర 2.78 శాతం పెరిగి 111.43 డాలర్లకు చేరింది. ముడిచ మురు ధరల పెరుగుదల భారత్ వంటి దిగుమతులపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థకు ప్రతికూలమని ట్రేడర్లుభావిస్తున్నారు.

ఈ నేపథ్యంలో డాలర్‌తో రూపాయి మారకం విలువ కూడా 0.38 శాతం క్షీణించి 94.56వద్ద ట్రేడ్‌అయింది. యాక్సిస్‌బ్యాంకు 2.65 శాతం, ఐసిఐసిఐబ్యాంకు 1.77 శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.96శాతం తగ్గాయి. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ కూడా 0.04శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.05శాతం నష్టపోయింది. బిఎస్‌ఇలో మొత్తం 1998 షేర్లుపెరిగితే 2257 షేర్లు క్షీణించాయి. 178 షేర్లుమాత్రమే స్థిరంగా కొనసాగాయి. పదేళ్ల బెంచ్‌మార్క్ బాండ్లు 0.52శాతంపెరిగి 6.979శాతంగా ట్రేడ్ అయ్యాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్‌నెల సెటిల్‌మెంట్లు ఒకశాతం క్షీణించి రూ.1,50,200గా నిర్ణయించారు. అమెరికా పదేళ్లబాండ్లు 0.51శాతం పెరిగి 4.357 శాతం గా కూపన్‌రేట్ నమోదయింది. మారుతిసుజుకి ఇండియా 2.53 శాతం క్షీణిస్తే ఎయుసానమల్‌ఫైనాన్స్‌బ్యాంకు సైతం 2.03శాతం క్షీణించింది. పిరమల్ ఫైనాన్స్ 09.13శాతం పెరిగింది. కోల్ ఇండియా 3.10శాతం ర్యాలీ తీసింది. నికరలాభాల్లో 12.9శాతం పెరగడమే ఇందుకు కారణం. అల్ట్రాటెక్ సిమెంట్ 1.64శాతం క్షీణించింది. సిటీ యూనియన్ బ్యాంకు షేర్లు మాత్రం 1.60శాతం పెరిగాయి. ఆదాని టోటల్ గ్యాస్ కూడా 2.81శాతం, ర్యాలీస్ ఇండియా 0.17శాతం పెరిగాయి. ఐఎఫ్‌సిఐ 2.09శాతం దిగజారింది.

### మార్కెట్లకు హార్ముజ్ ఒత్తిళ్లు




## రూ.3034కోట్ల ఆస్తులు ఇడి జప్తు

**ముంబై, ఏప్రిల్ 28:** రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ బ్యాంకు ఫ్రాడ్ కేసులో సుమారు రూ. 3034 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేసింది. ఈ కేసులో ఇప్పటి వరకు రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూపుకు చెందిన సుమారు 19,344 కోట్లు అటాచ్ చేశారు. అటాచ్ చేసిన ప్రాపర్టీల్లో ముంబైకి చెందిన ఉషా కిరణ్ బిల్డింగ్, ఖండాలాలోని ఫార్మ్‌హౌజ్, అహ్మదాబాద్‌లోని సనాంద్‌లో ఉన్న భూమి ఉన్నాయి. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు చెందిన 7.71 కోట్ల విలువైన షేర్లను కూడా జప్తు చేశారు. అనిల్ అంబానీకి చెందిన రైస్ ట్రస్ట్ ఆధీనంలో ఆ గ్రూపు ఉన్నది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఏర్పడిన సిట్ బృందం రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూపు కేసులను విచారిస్తున్నది. మనీల్యాండరింగ్‌తో పాటు నిధుల మళ్లింపు, బ్యాంక్ నిధుల దుర్వినియోగం కోణంలో కేసు విచారణ జరుగుతున్నది. ఎస్బీఐ, పీఎన్బీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎల్ఐసీ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సీబీఐ కేసులు నమోదు చేసింది. ఆ కేసులపై ఈడీ దర్యాప్తు చేస్తున్నది. ఆర్‌కామ్‌తో పాటు ఆ గ్రూపు కంపెనీలు దేశీయ, విదేశీ కంపెనీల నుంచి రుణాలు తీసుకున్నది, ఆ మొత్తం విలువ సుమారు 40,185 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు.




## బంధన్ లాభం 534.13 కోట్లు

**ముంబయి, ఏప్రిల్ 28:** ప్రైవేటు రంగంలోని బంధన్ బ్యాంకు నాలుగోత్రైమాసికంలో నికరలాభాలు 68శాతంపెరిగాయి. నాలుగో త్రైమాసికంలో బ్యాంకు లాభం రూ.534.13 కోట్లు సాధించినట్లు వెల్లడించింది. గత ఏడాది ఇదే కాలంలో కేవలం రూ.317 కోట్లు ఆర్జించింది. నికరవడ్డీ ఆదాయం కూడా 1.4 శాతం పెరిగి రూ.2800 కోట్లుగా ఉంది. ఇదే గత ఏడాది రూ.2760 కోట్లుమాత్రమే ఆర్జించింది. స్థిరాస్థి ప్రమాణాలుకూడా మెరుగుపడ్డాయి. స్థూల నిరర్థక ఆస్తులు 3.33 శాతంనుంచి 3.27శాతానికి తగ్గాయి. అయితే నికర నిరర్థక ఆస్తులు రూ.4804.99 కోట్ల నుంచి 5019.55 కోట్లకు పెరిగాయి. స్థూల అడ్వాన్సులు 13శాతం పెరిగి రూ.1.54 లక్షల కోట్లకు చేరాయి. డిపాజిట్లు 10శాతం పెరిగి రూ.1.66 లక్షల కోట్లుగా ఉన్నట్లు బ్యాంకు వెల్లడించింది. రిటైల్ డిపాజిట్లు 46శాతంపెరిగాయి.

## ఎటిఎఫ్ ధరలు పెరిగితే ఇకపై సర్వీసులు నడపలేం...
## కేంద్రానికి ఇండియన్ ఎయిర్‌లైన్స్ లేఖ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** విమాన ఇంధన ధరల పెరుగుదలపై ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ (ఎఫ్ఐఏ) ఆందోళన వ్యక్తం చేసింది. విమాన ఇంధన ధరల్ని అదుపులోకి తెచ్చేందుకు కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ మేరకు కేంద్ర విమానయాన శాఖకు మంగళవారం లేఖ రాసింది. కేంద్రం జోక్యం చేసుకుని విమాన ఇంధన ధరలు తగ్గించకుంటే విమానయానాన్ని కొంతకాలం మూసివేయాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఎఫ్ఐఏ సంస్థ ఇండిగో ఎయిర్‌లైన్స్, ఎయిర్ ఇండియా, స్పైస్ జెట్ వంటి సంస్థలకు ప్రతినిధిగా వ్యవహరిస్తుంది. తాజాగా ఆయా సంస్థల తరఫున కేంద్రానికి లేఖ రాసింది. ఎఫ్ఐఏ ప్రకారం ప్రస్తుతం అంతర్జాతీయ పరిణామాల వల్ల విమాన ఇంధన ధరలు (ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్/ఏటీఎఫ్ ) భారీగా పెరిగాయి. దీంతో విమానయాన సంస్థలపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. విమాన ఇంధన ధరల పెరుగుదల వల్ల విమానాల నిర్వహణ కష్టమైపోతోంది.

ఏటీఎఫ్ ధరలు చమురు సంస్థలకు అందుబాటులో లేకుండా పెరిగాయి. ఒక కిలోలీటర్ చమురుకు దాదాపు రూ.2 లక్షల వరకు ఖర్చవుతోంది. పశ్చిమాసియాలో క్రూడాయిల్ ధరలు పెరగడం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. సాధారణంగా ఎయిర్ లైన్స్ సంస్థల వ్యయంలో 30-40 శాతం ఇంధనానికి ఖర్చవుతుంది. కానీ, ప్రస్తుతం పరిస్థితుల్లో ధరల పెరుగుదలవల్ల ఈ ఖర్చు 55-60 శాతం పెరిగింది. అందుకే కేంద్రం త్వరగా జోక్యం చేసుకుని ధరలు తగ్గించాలని ఎఫ్ఐఏ కేంద్రాన్ని కోరుతోంది.

ఏటీఎఫ్ పై ప్రస్తుతం విధిస్తున్న 11 శాతం పన్నును తగ్గించాలని, రాష్ట్రాలు విధించే వ్యాట్ కూడా తొలగించాలని కేంద్రాన్ని కోరుతున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో 25 శాతం వరకు వ్యాట్ ఉన్న సంగతిని ఎఫ్ఐఏ ప్రస్తావిస్తోంది. అలాగే, ఇంధన ధరల్లో స్థిరత్వం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాయి. ధరల స్థిరీకరణకు ఒక ప్రత్యేక వ్యవస్థ ఉండాలని ఎఫ్ఐఏ కోరుతోంది. ఇంధన ధరల పెరుగుదల వల్ల అనేక మార్గాల్లో విమానాలు నడపడం ఆయా సంస్థలకు భారంగా మారుతోంది. అంతేకాదు.. కొన్ని రూట్లలో విమాన సర్వీసుల్ని తగ్గించడం, రద్దు చేయడం చేస్తున్నాయి. ఫ్యూయల్ ధరలు పెరిగితే విమాన టిక్కెట్ల ధరలు పెరుగుతాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14